
'యాక్సిస్' బ్యాంకులో అసలేం జరిగింది...? 8

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
ఆదివారం 27 జూలై 2025





హాయ్.. హలో..!

● నగరంలో అనసూయ, బుల్లిరాజు సందడి

ప్రముఖ నటి అనసూయ భరద్వాజ్, బాలనటుడు రేవంత్ (బుల్లిరాజు) శనివారం నెల్లూరు నగరంలో సందడి చేశారు. హాయ్.. హలో అంటూ అభిమానులను పలకరించారు. వేదికపై స్టెప్పులు వేసి, అభిమానులను ఉత్సాహ పరిచారు. ప్రముఖ వస్త్రాల నిలయం లక్ష్మీ షాపింగ్ మాల్ 13వ బ్రాంచ్‌ను వారు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి, మాట్లాడారు.

- వివరాలు 8లో..

పోస్ట్...

ఇవ్వడమేకాదు తీసుకోవడమూ...!

- ఇంటి నుంచే పోస్టల్ సేవలు
- అందుబాటులోకి ఏపీటీ 2.0
- రిజిస్టర్డ్ పోస్ట్ బుకింగ్‌తో శ్రీకారం
- అదనపు రుసుము లేకుండా సేవలు

పోస్ట్.... అంటూ ఇప్పటి వరకు మనకు వచ్చిన ఉత్తరాలు, కవర్లు, పార్శిళ్లనే పోస్టల్ శాఖ ఇంటికి తెచ్చిచ్చేది. ఇక నుంచి మనం మరొకరికి పంపాలనుకున్న వాటిని కూడా ఇంటికి వచ్చి స్వీకరించనుంది. ఇలా వినియోగదారులకు ఇంటి వద్దకే సేవలు అందించడానికి ఏపీటీ 2.0 (అడ్వాన్స్ పోస్టల్ టెక్నాలజీ)ని అందుబాటులోకి తెచ్చింది. ఈ నూతన విధానాన్ని జిల్లాలోని 300 పోస్టాఫీసుల్లో అమలుపరిచే సాఫ్ట్‌వేర్ అనుసంధాన ప్రక్రియ ఇటీవల పూర్తయింది. తొలుత రిజిస్టర్డ్ పోస్టు బుకింగ్‌తో ఇంటి వద్దకే సేవలకు తపాలా శాఖ శ్రీకారం చుట్టింది.



నెల్లూరు (హరనాథపురం), జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత కాలానికి అనుగుణంగా తపాల శాఖ సేవల్లో మార్పులు చేస్తూ నూతన త్వాన్ని సంతరించుకుంటోంది. ప్రైవేటు కొరియర్ సర్వీసులకు దీటుగా నిలిచేలా వినియోగదారులకు వద్దకే సేవలు అందించేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా అడ్వాన్స్ పోస్టల్ టెక్నాలజీ (ఏపీటీ) 2.0ని అమల్లోకి తెచ్చింది. ఈ విధానం ద్వారా తపాలా సేవలన్నీ వెబ్ ఆధారిత క్లౌడ్ టెక్నాలజీలో లభిస్తాయి. సైబర్ నేరాల నియంత్రణ, వాటిపై నిఘా ఉంటుంది. తొలుత రిజిస్టర్డ్ పోస్టు బుకింగ్ సేవలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు రిజిస్టర్డ్ పోస్ట్, స్పీడ్ పోస్టు వంటివి చేయాలంటే తపాలా కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఇళ్ల వద్దకే తపాలా శాఖ సిబ్బంది వచ్చి వాటిని సేకరించి బట్వాడా చేయనున్నారు. ఇందుకోసం ఐపీవో(ఇండియన్ పోస్టల్) యాప్‌ను ప్రవేశ పెట్టింది.



ఎలా పంపాలి..?

ఐపీవో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని సేవల కోసం సిబ్బందికి రిక్వెస్ట్ పంపితే ఆ మేరకు సేవలందిచేలా చర్యలు తీసుకుంటారు. విలువైన ఆర్టికల్స్‌ను రిజిస్టర్డ్, స్పీడ్ పోస్ట్‌లో పంపాలనుకునే వారు వాట్సప్ ద్వారా తపాలా శాఖకు సమాచారం ఇవ్వాలి. ఆ వెంటనే వినియోగదారుడి ఫోన్‌కు బార్‌కోడ్ నెంబరుతోపాటు, ఓటీపీ పంపుతారు. తర్వాత ఇంటికి వచ్చే సిబ్బందితో బార్‌కోడ్ ఓటీపీ వివరాలు సరిచూసుకుని ఆర్టికల్స్ వారికి ఇస్తే సరిపోతుంది. దీనికి సేవా రుసుము ఉండదు.

● పొదుపు పథకాల్లో డిపాజిట్లకు...

ఐపీవో యాప్ నుంచి ఖాతాదారులు సుకన్య సమృద్ధి యోజన, కిసాన్ వికాస్ పత్రాలు తదితర పొదుపు పథకాల్లో డిపాజిట్ చేసేందుకు కూడా వెసులుబాటు కల్పించనున్నారు. భవిష్యత్తులో ఆదివారం సెలవు దినాల్లో కూడా తపాలా సేవలు అందించే ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది.

● ఉపయోగాలు

- రియల్ టైం పార్శిల్ ట్రాకింగ్‌తో వినియోగదారులు తమ పార్శిల్ ఎక్కడ ఉందో తక్షణం తెలుసుకోవచ్చు.
- స్కానింగ్, బార్‌కోడ్, ఆప్టికల్ కెమెరా తదితర ఆధునిక పద్ధతులతో సమాచార ప్రాసెసింగ్ వేగంగా, ఖచ్చితంగా ఉంటుంది.
- ప్రతీ పార్శిల్‌ను లాగ్ చేయబడటం వల్ల లోపాల గుర్తింపు సులభమవుతుంది. దొంగతనం, తప్పుదారి పద్ధతులకు అడ్డుకట్ట.
- పోస్టల్ కార్యాలయాలన్నీ ఒకే నెట్‌వర్క్‌లో కలుపబడినట్లుగా వ్యవహరిస్తాయి. దీనివల్ల డెలివరీ వేగం పెరుగుతుంది.
- వినియోగదారుల ఫిర్యాదులకు తక్షణంగా స్పందించగలిగే విధంగా సమాచారం అందుబాటులో ఉంటుంది. అంతేకాక ట్రాన్స్‌ఫర్, డెలివరీ వంటి ప్రక్రియలను ఉన్నతాధికారులు ఆన్‌లైన్‌లో పర్యవేక్షించవచ్చు.

'సోమశిల'కు భారీగా పెరిగిన ఇన్‌ఫ్లో

అనంతసాగరం జూలై 26 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద అనూహ్యంగా పెరిగింది. శుక్రవారం 6,799 క్యూసెక్కులు వస్తుండగా శనివారం నాటికి 10,151 క్యూసెక్కులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. వచ్చే ప్రవాహం మరింత పెరగవచ్చని ఇంజనీర్లు భావిస్తున్నారు. ప్రస్తుతం డ్యాంలో 28.888 టీఎంసీల నీరు నిల్వ ఉండగా ఉత్తర కాలువకు 320, దక్షిణ కాలువకు 400, పెన్నాడెల్టాకు 1,600 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

మైనింగ్ వద్దు.. కొండే ముద్దు!

వరికుంటపాడు, ఆ మండలం జంగంరెడ్డిపల్లి గ్రామాల సమీపంలోని కొండ ప్రాంతంలో చేపట్టనున్న మైనింగ్ తవ్వకాల అనుమతులు రద్దు చేయాలని గ్రామస్థులు ఆందోళనబాట పట్టారు. సీపీఎం, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం వేర్వేరుగా నిరసన తెలిపారు. వరికుంటపాడు మీదుగా వెళుతున్న రాష్ట్ర దేవదాయ మంత్రి ఆనం కారును అడ్డగించి తమ గోడు వెళ్లబోసుకున్నారు. సబ్ కలెక్టర్‌తో మాట్లాడతానని ఆయన తెలిపారు.

- వివరాలు 8లో..



మైనింగ్ వద్దంటూ గ్రామస్థులు ఇచ్చిన వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి ఆనం

జీతాల బిల్లుల్లో తీవ్ర జాప్యం

బదిలీల ప్రక్రియతోనే ఆలస్యం
ఉద్యోగ, ఉపాధ్యాయుల ఎదురుచూపులు

నెల్లూరు(విద్య), జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ, ఉద్యోగుల జీతాల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం నెలకొంది. జూన్ నెలలో భారీగా బదిలీలు జరగిన సమయంలోనే వీరికి సంబంధించిన జీతాల బిల్లులు పెట్టే డ్రాయింగ్ ఆఫీసర్లు కూడా బదిలీ అయ్యారు. వీరిస్థానాల్లో వచ్చిన సిబ్బంది సకాలంలో విధుల్లో చేరకపోవడం, బిల్లులు ట్రెజరీకి చేరకపోవడం తదితర కారణాలతో రెండు నెలల జీతాలు నిలిచిపోయాయి. జీతాల బిల్లులను సాధారణంగా 20 నుంచి 25వతేదీ వరకు ట్రెజరీ కార్యాలయాల్లో ఇవ్వాల్సి ఉంటుంది. ఆ తర్వాత ప్రతినెలా 1వ తేదీన ఉపాధ్యాయ, ఉద్యోగులకు జీతాలను ప్రభుత్వం వారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తుంది. అయితే బదిలీల జరిగిన నేపథ్యంలో ఆయా ఉద్యోగులు వారి వారి స్థానాల్లో చేరిన తరువాత తాము గతంలో పనిచేసిన స్థానం నుంచి లాస్ట్ పే సర్టిఫికెట్ (ఎల్‌పీసీ)ను కొత్త స్థానానికి పంపాలి. ఆ తరువాత వారు పనిచేసే కొత్త ప్రదేశంలో జీతాల కోసం బిల్లులు పెట్టుకోవాల్సి ఉంటుంది. ఉద్యోగ, ఉపాధ్యాయులు బదిలీల జరిగిన తరువాత ఉత్తర్వులు తీసుకుని బదిలీ అయిన స్థానంలో చేరతారు. కొత్తగా చేరిన స్థానాల్లో డ్రాయింగ్ ఆఫీసర్ బదిలీ జరిగి ఉంటే కొత్తవారు వచ్చేసరికి కొన్నికోట్ల జాప్యం అవుతోంది. ఇలా అనేక కారణాలతో జిల్లావ్యాప్తంగా వేలాదిమందికి జీతాలు పడలేదు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి నెలా 1 నుంచి 5వ తేదీ లోపల అందరికీ జీతాలను, పెన్షన్లను చెల్లిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఉపాధ్యాయ, ఉద్యోగుల బదిలీలతో పెద్ద ఎత్తున మార్పులు జరగడంతో రెండు నెలలుగా జీతాలు లేక తాము ఇబ్బందులు పడుతున్నామని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇప్పటికైనా తమ జీతాలను సకాలంలో విడుదల చేయాలని కోరుతున్నారు.



కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులను సత్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, పక్కన జేసీ కార్తీక్

విశ్రాంత సైనికులకు పొజిషన్ సర్టిఫికెట్లు అందజేస్తాం

కార్గిల్ విజయ దినోత్సవ వేడుకలో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాధపురం) జూలై 26 (ఆంధ్రజ్యోతి) : పదవీ విరమణ చేసిన సైనికులకు నిబంధనల మేరకు అందించే భూమికి సంబంధించిన పొజిషన్ సర్టిఫికెట్లను త్వరలోనే అందజేస్తామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. శనివారం 26వ కార్గిల్ విజయ దినోత్సవ వేడుకలు కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో జరిగాయి. కార్గిల్ పోరాటంలో అసువులు బాసిన వారి కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పలకరించి సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్గిల్

- మిగతా 6లో..

ఆ మూడు పురపాలక సంఘాలకు ప్రత్యేకాధికారుల పాలన పొడిగింపు



కావలి/కందుకూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కావలి, కందుకూరు మున్సిపాలిటీలతోపాటు అల్లూరు నగర పంచాయతీ ప్రత్యేకాధికారుల పాలనను మరో ఆరు నెలలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. 2025 జూలై 3 నుంచి 2026 జనవరి 2వ తేదీ వరకు వారి పాలన పొడిగిస్తున్నట్లు ఈ నెల 22న మున్సిపల్ అధికారులకు ఉత్తర్వులు అందాయి. ఆరేళ్లుగా కావలి పురపాలక సంఘం ప్రత్యేకాధికారుల పాలనలో సాగుతోంది. ప్రత్యేకాధికారిగా ఆర్డీవో కొనసాగుతున్నారు. మున్సిపాలిటీలో కావలి రూరల్ మండలం చౌదరిపాలెంను గ్రామస్థుల ఆమోదం లేకుండా విలీనం చేస్తూ గత వైసీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో చౌదరిపాలెంవాసులు హైకోర్టును ఆశ్రయించగా స్టే విధించింది. దీంతో అప్పట్లో ఎన్నికలు ఆగిపోగా, ప్రత్యేకాధికారి పాలన కొనసాగుతోంది. ప్రస్తుత ప్రభుత్వం చౌదరిపాలెంను కావలి మున్సిపాలిటీలో విలీనాన్ని విరమించుకున్నట్లు హైకోర్టుకు నివేదించింది. ఈ క్రమంలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తారనే ప్రచారం సాగుతుండగా, తాజాగా ప్రత్యేకాధికారి పాలనను పొడిగించారు.

కందుకూరు మున్సిపాలిటీ ప్రత్యేకాధికారిగా సబ్ కలెక్టరు తిరుమాణి శ్రీపూజను మరో ఆరునెలలపాటు పొడిగిస్తూ మున్సిపల్ పరిపాలనాశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ప్రత్యేకాధికారి పదవీకాలం ఈ నెలాఖరుతో ముగుస్తున్న నేపథ్యంలో మరో ఆరునెల లు పొడిగిస్తూ ఉత్వర్వులిచ్చారు.

● అల్లూరు మండలంలోని అల్లూరు, నార్తుమోపూరు, సింగపేట పంచాయతీలను కలుపుతూ గత వైసీపీ ప్రభుత్వం అల్లూరును నగర పంచాయతీగా చేసింది. అయితే నార్తుమోపూరు గ్రామస్థులు తమను నగర పంచాయతీలో కలపడాన్ని వ్యతిరేకిస్తూ కోర్టుకు వెళ్లటంతో అప్పట్లో ఎన్నికలు ఆగిపోయాయి. అప్పటి నుంచి ప్రత్యేకాధికారి పాలన కొనసాగుతోంది. అల్లూరు నగర పంచాయతీ ప్రత్యేకాధికారిగా కావలి కమిషనర్ కొనసాగుతు న్నారు. మరో ఆరు నెలలు గడువు పొడిగించడంతో ఆయనే కొనసాగను న్నారు.

అనధికార లేఅవుట్‌దారులకు తీపికబురు

● క్రమబద్ధీకరణకు అవకాశం ఇచ్చిన ప్రభుత్వం

నెల్లూరు(సిటీ), జూలై 26,(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పట్టణ, నగర ప్రాంతాలలో అనధికార లేఅవుట్ వేసి, ప్లాట్ల క్రయ, విక్రయాలు జరిపిన యజమానులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి ఎస్ సురేష్‌కుమార్ జీవో నెం.134ను శనివారం విడుదల చేశారు. 2019, ఆగస్టుకు ముందు ప్లాట్లు, వెంచర్లు వేసిన వారు ఎల్‌ఆర్‌ఎస్ (ల్యాండ్ రెగ్యూలరైజడ్ స్కీం) ద్వారా దరఖాస్తు పెట్టుకుంటే రెగ్యులరైజ్ చేస్తూ వచ్చారు. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం గత నెల జూన్ 30వ తేదీలోపు అనధికార లేఅవుట్లుగా తేలిన వారంతా మార్కెట్ విలువలో 7 శాతం చెల్లించుకుంటే క్రమబద్ధీకరణ చేసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఇలా క్రమబద్ధీకరణ అవకాశం పొందిన స్థలదారులు భవన నిర్మాణ అనుమతుల సమయంలో బెటర్‌మెంట్, ఓపెన్ స్పేస్ కింద 14 శాతం చెల్లించాల్సిన అవసరం ఉండదని అధికారులు పేర్కొన్నారు. రియల్టర్లు, వారి వద్ద ఖాళీ స్థలాలు కొనుగోలు చేసిన వారంతా ఈ ఎల్‌ఆర్‌ఎస్ కోసం వేచి చూస్తున్నారు. కాగ భవన నిర్మాణంలో తలెత్తిన అతిక్రమణలను క్రమబద్ధీకరించే బీపీఎస్ (బిల్డింగ్ పీనలైజడ్ స్కీం) కూడా త్వరలో విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.



ఉలవపాడు పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించిన గిరిజనులు

అర్ధరాత్రి హైడ్రామా!

- హత్యాయత్నం కేసు అంటూ ముగ్గురు గిరిజన మహిళల అరెస్ట్
- ఉదయాన్నే స్టేషన్‌కు తీసుకొస్తామని ప్రాధేయపడ్డా ససేమిరా
- పోలీస్‌స్టేషన్ ఎదుట మహిళలు, యువకుల ధర్నా
- మద్దతుగా నిలిచిన ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీ శ్రేణులు
- కరేడు భూసేకరణ ఉద్యమాన్ని నీరుగార్చేందుకేనంటూ ఆగ్రహం

ఉలవపాడు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఉలవపాడు మండలం కరేడులో భూసేకరణ వ్యవహారం చినికి చినికి పెద్దదవుతోంది. రాజకీయ రంగు పులుముకోవడంతో చిన్న ఘటన జరిగినా పోలీసుల ద్వారా ప్రజలపై కేసులు నమోదు చేయిస్తున్నారు. ఇలాంటి ఘటనే శనివారం వెలుగులోకి వచ్చింది. ఓ దాడి కేసులో శుక్రవారం అర్ధరాత్రి (శనివారం తెల్లవారుజాము 1 గంట) భారీగా గిరిజన కాలనీలోకి ప్రవేశించిన పోలీసు లు నిందారోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురు మహిళలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాలనీవాసులు ఎంత ప్రతిఘటించినా, ఉదయం తామే స్టేషన్‌కు తీసుకువస్తామని ప్రాధేయ పడినా పోలీసులు వినలేదు. అయితే, ఉదయానికల్లా ఈ విషయం దావాలనంలా వ్యాపించడంతో స్టేషన్ వద్దకు గ్రామస్థులు, మహిళలు భారీగా చేరుకుని నిరసన వ్యక్తం చేశారు.

● పోలీసుల కథనం ఇదీ..

కరేడు పంచాయతీ పరిధిలోని రామకృష్ణాపురం ఎస్టీ యనాది కాలనీకి చెందిన జగన్నాథం శేషమ్మ తనను అదే గ్రామానికి చెందిన మానికల సుజాత, మల్లవరపు లలితమ్మ, మానికల శిరీష (పంచాయతీ వార్డు సభ్యురాలు) దాడి చేసి చంపేందుకు ప్రయత్నించారని, వారి నుంచి ప్రాణహాని ఉందని శుక్రవారం మధ్యాహ్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినందున ముద్దాయిలను మహిళా పోలీసుల సమక్షంలో అదుపులోకి తీసుకున్నట్లు చెబుతున్నారు. కందుకూరులో న్యాయాధికారి సెలవులో ఉన్నందున కనిగిరి కోర్టులో హాజరు పరిచేందుకు నిందుతులను శనివారం మధ్యాహ్నం తరలించారు. అక్కడ వాదనలలు విన్న న్యాయాధికారి వచ్చే నెల 13వ తేదీ వరకు రిమాండ్ విధించారు.

● గ్రామస్థుల వాదన ఇలా..

తొలి నుంచి ఫిర్యాదుదారు శేషమ్మ కరేడు బలవంతపు భూసేకరణ ఉద్యమంలో పాల్గొంటూ రాష్ట్ర ప్రభుత్వ తీరును తప్పుపడుతోంది. అయితే రామకృష్ణాపురం ఎస్టీ కాలనీలో ఇటీవల కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పర్యటించి ప్రభుత్వం తరఫున తాను భరోసాగా నిలుస్తానంటూ గ్రామస్థులకు హామీ ఇచ్చారు. అప్పటి నుంచి శేషమ్మ కొంత సానుకూల ధోరణిలో వ్యవహరిస్తోంది. దీనిపై ఎస్టీ కాలనీలోని శుక్రవారం మధ్యాహ్నం శేషమ్మ బంధువులు గ్రామం మొత్తం ఒక కట్టు మీద ఉంది. ఐక్యతను చెడగొడుతున్నట్లు ఎందుకు చెడ్డపేరు తెచ్చుకుంటావని మాట్లాడినందుకు గొడవకు దిగిందని ధర్నాలో పాల్గొన్న ఆ గ్రామ మహిళలు, యువకులు చెబుతున్నారు. గ్రామంలోని మానికల సుజాత, మల్లవరపు లలితమ్మ, మానికల శిరీషలు, శేషమ్మ మధ్య వాగ్వాదం పెద్దదై ఒకరినొకరు నెట్టుకునే క్రమంలో శేషమ్మ నేలపై పడింది. దీంతో ఆమె చేతికి గాయమైంది. ఇది కావాలని చేసిన దాడి కాదని, గ్రామస్థులను భయభ్రాంతులకు గురి చేసేందుకు హత్యాయత్నంగా మార్చారని రామకృష్ణాపురం వాసులు పోలీసుల చర్యలను తప్పుబట్టారు. దీనివెనుక పెద్ద రాజకీయమే ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరేడు గ్రామస్థులతోపాటు రామకృష్ణాపురం, ఆకుతోట సంఘం, ధర్మారెడ్డి సంఘం ఎస్టీలు స్టేషన్ వద్ద ధర్నా చేపట్టబోతున్నారని తెలియడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్న ముగ్గురు మహిళలను ఉదయాన్నే కందుకూరు రూరల్ పోలీస్టేషన్‌కు తరలించారు.

● వామపక్షాలు, వైసీపీ మద్దతు

కరేడు బలవంతపు భూసేకరణ ఉద్యమాన్ని నీరుగార్చేందుకు కుట్రలో భాగంగా అమాయక గిరిజన మహిళలను అక్రమంగా జైలుకు పంపించే కుట్ర అని ధర్నాలో పాల్గొన్న వామపక్షాలు, పౌరసంఘం ప్రతినిధులు, వైసీపీ నాయకులు మండిపడ్డారు. బెదిరించి, భయాందోళనలకు గురిచేసి గ్రామాలను ఖాళీ చేయించాలనే ఉద్దేశంతో ఇలాంటి చిన్నచిన్న ఘటనలను పోలీసులను ముందుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. పోలీసు బలగాలను మోహరించినా ఇళ్లు, గ్రామాలను ఖాళీ చేసేది లేదని వారు స్పష్టం చేశారు.

● చివరికి దిగొచ్చిన పోలీసులు..

ఎస్టీ యానాదులు, వామపక్ష, వైసీపీ నేతల నిరసనలతో పోలీసులు దిగి వచ్చారు. తొలుత నమోదు చేసిన హత్యాయత్నం(307) కేసును దాడి (326) కేసుగా మార్చడంతో ఆందోళనకారులు ధర్నా విరమించారు. కందుకూరు, కావలి డివిజన్ల నుంచి భారీగా పోలీసు బలగాలను ఉలవపాడు పోలీసు స్టేషన్‌కు తరలించారు.

నేడు ప్రతిభ పురస్కారాల ప్రదానం

వెంకటాచలం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గౌడ కల్లుగీత పారిశ్రామికుల సంఘం, గౌడ సేవాసమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో గౌడ విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోసూరు వెంకటసుబ్బయ్య గౌడ్, అనికేపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యురాలు కోసూరు పద్మగౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు టౌన్ హాలులో ఉదయం ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో 450కి పైగా మార్కులు సాధించిన గౌడ విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం చేస్తామన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9435
వెండి కిలో ధర	రూ. 116400
వెండి ఒక గ్రాము	రూ. 119.40

రాగి తీగల దొంగలను పట్టుకోరూ!?

- ట్రాన్స్‌ఫార్మర్లలోని వైర్ల మాయం
- వారం రోజుల్లో 8 చోరీలు



అల్లూర్తిలో ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టిన దుండగులు

పొదలకూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : పొలాల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో ఉండే రాగి వైర్లు వరుసగా చోరీకి గురవుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రాగి వైర్ల చోరీ సంఘటనలు ఇటీవల ఎక్కువగా జరుగుతున్నాయని విద్యుత్ శాఖాధికారులే చెబుతుండడం గమనార్హం. వారం రోజుల వ్యవధి లోనే మండలంలోని అల్లూర్తి, మర్రిపల్లి, తాటిపర్తి గ్రామాల్లో వరుసగా 8 చోట్ల రాగివైర్లు చోరీకి గురయ్యాయి. దుండగులు ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులో ఉన్న రాగితీగలను తీసుకెళ్లి అమ్ముకుం టున్నారు. పొదలకూరు పరిసర ప్రాంతాల్లో చాలా ఏళ్లుగా ఈ తరహా దొంగ తనాలు జరుగుతున్నాయని రైతులు చెబుతున్నారు. గతే డాది ఏప్రిల్ నుంచి అధికంగా పొదలకూరు విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోనే ఈ దొంగతనాలు జరిగినట్లు అధికా రులు తేల్చారు. ఇప్పటివరకు 58 ట్రాన్స్‌ఫార్మర్లను దొంగ తనం చేశారు. స్తంభం నుంచి ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించి, పగులగొట్టి అందులో ఉన్న రాగితీగను తీసుకెళ్లాలంటే విద్యుత్ పనుల్లో మెళకువలు తెలిసినవాళ్లకే అది సాధ్యమ వుతుంది. ఇలాంటి దొంగతనాలు చేసే ముఠాలో ఇలాంటి నైపుణ్యం ఉన్నవారు ఒకరుంటారని గతంలో పట్టుబడిన దొంగల ద్వారా తెలిసింది. మినీ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నందున వరుసగా రెండు నుంచి మూడింటిని పగులగొడు తున్నారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసే విషయం లో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఉద్యాన సాగు అధికంగా ఉన్న గ్రామాల్లో పంటలకు నీరు పెట్టుకు నేందుకు రైతులు విద్యుత్ మోటార్లపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్లను తరచూ పగులగొట్టి రాగి వైరు చోరీ చేస్తుండడంతో కొత్తవి బిగించేందుకు సమయం పడుతోంది. బాధిత రైతులు విద్యుత్ అధికారులకు సమాచారం అందజేస్తే వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. పోలీసులు కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ కాపీ అందజేస్తే అప్పుడు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తారు. తోటలు, పొలాల్లో ఏర్పాటు చేసే ట్రాన్స్‌ఫార్మర్ల భద్రతను రైతులే చూసుకోవాలని విద్యుత్ అధికారులు వెల్లడించారు.

ఘనంగా అంతర్జాతీయ మడ అడవుల దినోత్సవం



బహుమతులు అందజేస్తున్న అధికారులు

ముత్తుకూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మడ అడవుల దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక ఈదూరు ఈశ్వరమ్మ, జడ్పీ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సం దర్భంగా అటవీశాఖ ఎంఎస్‌సీ ఛైర్మన్ వర్షిణి మాట్లాడుతూ మడ అడవులు తుఫానుల సమయంలో సహజ రక్షణగా పని చేయడమే కాక, సముద్ర జీవజాతులకు నివాసంగా ఉన్నాయన్నారు. తీర ప్రాంతాల్లో కోతను నివా రించడంలో గడ్డి గుట్టలు ముఖ్య పాత్ర పోషి స్తాయన్నారు. మడ అడవుల్లో మొక్కలు నాటడం, తీర ప్రాంతంలో పరిశుభ్రత తదితర అంశాలపై పర్యావరణ నిపుణులు అవగాహన కల్పించారు. జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంఎస్‌సీ ఛైర్మన్ వర్షిణి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

మరణించినా.. మరొకరికి చూపు

విడవలూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): విడవలూరులోని పీర్ల చావిడి సెంటర్‌లో నివాసం ఉంటున్న పంది రవి (48) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. మన సేవా సంస్థ నిర్వాహకులు దేవళ్ల శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో మృతుడి నేత్రాలను కుటుంబ సభ్యులు నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు దానం చేశారు. కాగా నేత్రాలను టెక్నీ షియన్ సునీల్ సేకరించారు.

'వీరమల్లు'పై విమర్శలా?



మాట్లాడుతున్న సురేష్‌నాయుడు

వెంకటాచలం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' సినిమాపై విమర్శలు చేయడం తగదని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు అన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కుటుంబ సమేతంగా అందరూ వెళ్లి చూడాల్సిన సినిమా వీరమల్లు అని, ఎమ్మెల్యేలు, మంత్రులు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులు చిత్రాన్ని చూస్తున్నారన్నారు. మొఘలుల పాలనలో ఔరంగజేబు హిందూ దేవాలయాలపై చేసిన దాడులు, అరాచకాలను కళ్లకు కట్టినట్లు సినిమాలో చిత్రించారన్నారు. కొందరు పనిగట్టుకుని వీరమల్లు సినిమాపై దుష్ప్రచారం చేస్తున్నారని, అలాంటివాటిని సహించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో నేతలు పినిశెట్టి మల్లికార్జున్, సందూరి శ్రీహరి, సుబ్రహ్మణ్యం, రామిరెడ్డి తదిత రులు పాల్గొన్నారు.

ఈ రహదారికి మోక్షం ఎప్పుడో.. ?

- ప్రయాణికుల ఆవేదన



గుంతలమయమైన చెలికల - విడవలూరు రహదారి

విడవలూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): విడవలూరు నుంచి చెలికలకు వెళ్లే రహదారి కొన్నేళ్లుగా మరమత్తులకు నోచుకోకపోవడంతో అధ్వాన్నంగా మారింది. చెలికల గ్రామస్థులు ఈ రోడ్డు గుండానే మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఈ రహదారిని పట్టించుకునే నాథుడు లేకపోవడంతో అడుగడుగునా గుంతలు పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. నిత్యం పాఠశాల బస్సులతో పాటు పలు వాహనాలు ఈ రోడ్డుపై ప్రయాణిస్తుంటాయి. రహదారి మధ్యలో పెద్ద పెద్ద గుంతలు పడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు గుంతల కారణంగా అదుపు తప్పి పక్కనున్న పొలాల్లోకి దూసుకెళ్లింది. అయితే బస్సులోని విద్యార్థులందరూ క్షేమంగా బయటపడ్డారు. గత ప్రభుత్వ పాలకులు పట్టించుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వాధికారులైనా స్పందించి ఈ రహదారికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మినగల్లు సీజేఎఫ్ఎస్ భూములను పరిశీలించిన జేసీ

- 1992లో పట్టాలిచ్చినా కేటాయించని వైనంపై విచారణ



రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మినగల్లు గ్రామ రెవెన్యూ పరిధిలోని సీజేఎఫ్ఎస్ భూములను శనివారం జాయింట్ కలెక్టర్ కార్తీక్ పరిశీలించారు. ఆర్డీఓ అనూష, తహసీల్దారు వెంకటేశ్వర్లుతో కలిసి ఆ భూములకు సంబంధించిన రైతులు, గ్రామ సర్పంచు, నాయకులు, గ్రామస్థులతో చర్చించారు. భూముల సాగు, స్థితిగతులపై ఏఆర్‌సీ కమిటీ వేసి విచారణ చేపట్టారు. జీవో ప్రకారం ఆ భూములను ఎవరెవరికి ఏమేరకు కేటాయించాలనే విషయంపై ఆర్డీఓ అనూష, తహసీల్దారు వెంకటేశ్వర్లుకు జేసీ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సుమారు 100 ఎకరాల్లో సీజేఎఫ్ఎస్ పట్టాలు ఇచ్చినా తరువాత అవి రద్దయ్యాక డీకేటీ పట్టాలు మంజూరు చేయలేదంటూ తమకు ఓ ఫిర్యాదు అందిందన్నారు. దీనిపై విచారించేందుకే మినగల్లుకు వచ్చినట్లు జేసీ తెలిపారు. ఐతే సాగులో వున్న శివాయిజమా జమేదారుల లిస్టు త్వరలోనే ఏఆర్‌సీ కమిటీలో పెట్టి అసైన్‌మెంట్ ప్రపోజల్స్ తయారు చేయమని ఆర్డీఓ, తహసీల్దారులను కూడా ఆదేశించామన్నారు. జేసీ వెంట వీఆర్‌ఓ వెంకటేశ్వర్లు, స్థానిక సర్పంచు భర్త బొర్రు రాము, సురేష్‌రెడ్డి, మస్తాన్, సీజేఎఫ్ఎస్ పట్టాదారులు, రైతులు వున్నారు.

● సుపరిపాలనలో ఫిర్యాదుతో సీజేఎఫ్ఎస్ భూ సమస్య పరిష్కారం

మినగల్లు పంచాయతీలోని సుమారు 97మంది పేదలకు 33 ఏళ్ళ క్రితం 101 ఎకరాల సీజేఎఫ్ఎస్ భూములను పంపిణీ చేశారు. కానీ నేటికీ ఎవరికి ఎంత భూమి అనేది కేటాయించకపోవడంతో ఆ పేదలంతా ఆ భూమిని ఇతరులకు లీజుకిచ్చి జీవనం సాగిస్తున్నారు. పట్టాలు ఇచ్చిన నాటి నుంచి తమకు భూములు కేటాయించాలని ప్రజా ప్రతినిధులు, అధికారులతో మొరపెట్టుకుంటున్నారు. కార్యాలయాల చుట్టూ కాళ్ళరిగేలా తిరిగినా ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. అయితే 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి ఫిర్యాదు చేయడంతో శనివారం జేసీ విచారణ చేపట్టారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆర్డీఓ, తహసీల్దార్లను ఆదేశించారు.

సమగ్రాభివృద్ధి దిశగా సర్వేపల్లి

టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



మహిళలతో మాట్లాడుతున్న సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

వెంకటాచలం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ విధ్వంసాల తర్వాత రాష్ట్ర ప్రభుత్వ సుపరిపాలనలో సర్వేపల్లి నియోజకవర్గం సమగ్రాభివృద్ధి దిశగా దూసుకెళుతోందని సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. కసుమూరు పంచాయతీ చింతలపాళెం గ్రామంలో శనివారం 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సమస్యలను ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, చవటపాలెం సొసైటీ అధ్యక్షుడు రావూరి రాధాకృష్ణమనాయుడు, టీడీపీ నేతలు వెంకయ్యనాయుడు, ప్రభాకర్ నాయుడు, బాబూరావు, బుర్రా శ్రీను, కడివేటి శేషయ్య, కూరపాటి మస్తానయ్య, నలబాలపు వెంకటాద్రి, కడివేటి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో సాగుచేస్తున్న నిమ్మచెట్ల తొలగింపు

సైదాపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మొలకలపూండ్ల రెవెన్యూ కమ్మవారిపల్లి గ్రామ సమీపంలోని గద్దలతిప్ప వద్ద ప్రభుత్వ భూముల్లో అక్రమంగా సాగుచేస్తున్న నిమ్మ చెట్లను శనివారం రెవెన్యూ అధికారులు జేసీబీతో తొలగించారు. తహసీల్దార్ సుభద్ర మాట్లాడుతూ కొండ పోరంబోకు భూముల్లో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా నిమ్మ చెట్లను సాగుచేస్తున్నవారికి నోటీసులు జారీ చేసి కోర్టు ఆదేశాల మేరకు పోలీసుల సహకారంతో తొలగిస్తున్నామన్నారు.

దళిత, గిరిజనుల ధర్నా

దళిత, గిరిజనులు సాగు చేసుకుంటున్న నిమ్మచెట్లు తొలగించవద్దని యానాది సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెసీ పెంచలయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. 20 ఏళ్ళుగా వారు భూములను సాగు చేసుకుంటున్నారని, తొలగించవద్దని కోరారు.

అచ్యుతానందన్‌కు సీపీఎం నివాళులు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మరణించిన కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్. అచ్యుతానందన్‌కు సీపీఎం నాయకులు నివాళులర్పించారు. శనివారం బుచ్చిరెడ్డిపాళెంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు జొన్నలగడ్డ వెంకమరాజు, అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. 2006నుంచి 2011వరకు కేరళ ముఖ్యమంత్రిగా అచ్యుతానందన్ విధులు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి. శ్రీనివాసులు, జి. శ్రీనివాసులు, సీహెచ్. మల్లికార్జున, పి. మల్లికార్జున, జి. సురేష్, వి. మునుస్వామి, టి. రమణయ్య, ఎం. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణపట్నం పోర్టులో ఆక్టోపస్ మాక్ డ్రిల్



మాక్ డ్రిల్‌లో పాల్గొన్న ఆక్టోపస్ సిబ్బంది, పోలీసులు

ముత్తుకూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : అదానీ కృష్ణపట్నం పోర్టులో శనివారం ఆక్టోపస్ బృందం మాక్ డ్రిల్ నిర్వహించింది. పోర్టులో అపరిచిత వ్యక్తులు, చొరబాటుదారుల నియంత్రణ కోసం శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము ఒకటిన్నర వరకు ఆక్టోపస్ సిబ్బంది, కృష్ణపట్నం పోర్టు పోలీసులు, ముత్తుకూరు అధికారులతో కలిసి తనిఖీలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా మాక్ డ్రిల్ పూర్తి చేశారు. అనుకోని సంఘటనలు, ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు ఏం చేయాలి? అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను ఎలా చక్కదిద్దాలి? అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆక్టోపస్, డీఎస్పీలు కృష్ణ, శ్రీనివాస్, ఆర్ఐలు కాళికాకృష్ణ, సతీష్, కృష్ణపట్నం సీఐ రవినాయక్, ఎస్ఐ జేపీ శ్రీనివాసులురెడ్డి, తహ సీల్దారు స్వప్న, ఎంపీడీవో నాగమణి, వైద్యాధికారి దేవీకృప, పోర్టు సెక్యూ రిటీ సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవ

రాపూరు, జూలై 26 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని పెంచ లకోన క్షేత్రంలో పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవికి శనివారం ఊంజల్‌సేవ శనివారం ఘ నంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను అలంకార మండ పానికి తీసుకొచ్చి అక్కడ తిరుచ్చిపై కొలువుదీర్చారు. ఆభరణాలు, పుష్పా లతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం సహస్ర దీపా లంకరణ మండపంలో ఊంజల్‌సేవ నిర్వహించారు. నిత్యకల్యాణ మండ పంలో స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని వేడుకగా జరిపారు. రాత్రి కోన మాడ వీధులలో క్షేత్రోత్సవం నిర్వహించారు.

కార్గిల్ అమరవీరుల త్యాగాలే స్ఫూర్తి

వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ డాక్టర్ సునీత

వెంకటాచలం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కార్గిల్ అమరవీరుల త్యాగాలు అందరికీ స్ఫూర్తిదాయకమని, యువత వారి జీవితాలను ఆదర్శంగా తీసుకుని సామాజిక మార్పు కోసం కృషి చేయాలని వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత పిలుపునిచ్చారు. వీఎస్‌యూలో శనివారం వీఎస్‌యూ, సింహపురి వైద్యసేవా సమితి సంయుక్తంగా 'కార్గిల్ విజయ్ దివస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశరక్షణ కోసం ప్రాణాలర్పించిన కార్గిల్ యుద్ధ వీరుల త్యాగాలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో ట్రైబల్ ప్రాజెక్ట్ జిల్లా కో ఆర్డినేటర్ సుబ్బారావు, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, డాక్టర్ ఆర్ ప్రభాకర్, పీఆర్‌వో డాక్టర్ కోటనీల మణికంఠ, డాక్టర్ శ్యాంసుందర్ భగవాన్, డాక్టర్ ఎం ఓబుళపతి తదితరులు పాల్గొన్నారు.

చిలకలమర్రిలో...

అనంతసాగరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలమర్రి ఉన్నత పాఠశాల్లో శనివారం కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. కార్గిల్ యుద్ధ విజయం సాధించి 26 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విద్యార్థులు జాతీయ జెండాలతో కార్యక్రమంలో పాల్గొన్నారు. అమరవీరులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై గర్భిణులకు అవగాహన

రాపూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నవాబుపేట గ్రామం ఇందిరాకాలనీలో అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాపూరు సెక్టార్ సీడీపీవో సునంద పౌష్టికాహారంపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాధిక, స్కూల్ హెడ్మాస్టర్ ప్రమీల, అంగన్‌వాడీ వర్కర్లు సుభాషిణీ, ఆదిలక్ష్మీ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా గిరిజనుల ఇళ్లు

- అక్టోబరులోగా పూర్తి చేస్తాం : ఈఈ మోహన్‌రావు



గిరిజనుల ఇళ్లను పరిశీలిస్తున్న ఈఈ మోహన్‌రావు

మనుబోలు, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని 7 పంచాయతీల్లో 104 గిరిజనుల ఇళ్లు అసంపూర్తిగా ఉన్నట్లు గుర్తించామని నెల్లూరు గృహనిర్మాణశాఖ ఈఈ మోహన్‌రావు తెలిపారు. శనివారం ఆయన మండలంలోని జట్లకొండూరు, బండేపల్లి పంచాయతీల్లో గిరిజనుల ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్‌లోగా గిరిజనుల ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదేశించారన్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ. 1.80 లక్షలతో పాటు గిరిజనులకు అదనంగా రూ. 75 వేలు అందజేస్తామన్నారు. ఇళ్ల నిర్మాణాలను సగంలో వదిలేసి వెళ్ళిన కాంట్రాక్టర్లందరికీ నోటీసు లు ఇచ్చామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈఈ వెంట ఏఈ శరత్, వర్క్ఇన్‌స్పెక్టర్ శ్రీనువాసులు తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం అందాలంటే లింకు తప్పనిసరి

- 6,900 కుటుంబాలు అనర్హతకు గురయ్యే అవకాశం : డీఏవో

నెల్లూరు(వ్యవసాయం), జూలై 26 (ఆంధ్రజ్యోతి): రైతు కుటుంబాలకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయం అందాలంటే అర్హులయిన రైతులందరి బ్యాంకు ఖాతాకు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ) లింకు తప్పనిసరని జిల్లా వ్యవసాయాధికారి పీ.సత్యవాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 1,98,514 రైతు కుటుంబాలు ఈ పథకానికి అర్హత పొందాయని, అందులో 6,900 కుటుంబాలు అనర్హతకు గురయ్యే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు. ఎన్‌పీసీఐ ఇన్‌యాక్టివ్ కారణంగా 4,385 కుటుంబాలు, అలాగే ఎన్‌పీసీఐకి అసలు లింకు కాకుండా మరో 2,515 కుటుంబాలు ఉన్నాయని వివరించారు. ఈజాబితాలు మొత్తం రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రైతులు పరిశీలించుకుని బ్యాంకులకు వెళ్లి ఎన్‌పీసీఐ యాక్టివేషన్, లింకు చేసుకుంటేనే పథకం నిధులు బ్యాంకు ఖాతాలో జమవుతాయని స్పష్టం చేశారు. వివిధ కారణాలతో పథకానికి అనర్హత పొందిన రైతుల వివరాలను గ్రీవెన్స్ మాడ్యూల్లో పొందుపరచే కార్యక్రమం కూడా శుక్రవారం నిలిచిపోయిందని తెలిపారు. జిల్లాలో మొత్తం 2432దరఖాస్తులు గ్రీవెన్స్ మాడ్యూల్‌లో పొందుపరచి, మండల వ్యవసాయ అధికారి, మండల రెవెన్యూ అధికారి అనుమతితో ఆర్‌టీజీఎస్ పరిశీలనకు పంపుతామని పేర్కొ న్నారు. అనంతరం పథకానికి అర్హతపొందే జాబితా వస్తుందని, ఇదంతా నిరంతర ప్రక్రియని తెలిపారు. అనర్హతకు గురైన రైతులు అందుకు గల కారణాలను తెలుసుకుని సరిచేసుకోవాలన్నారు. ఆధార్‌లో తప్పులు, డెత్ మ్యుటేషన్, బ్యాంకు లింకింగ్, ల్యాండ్ ఆధార్ లింకింగ్ ఇతర సమస్యలు సరిచేసుకుని సిద్ధంగా ఉంటే అన్నదాత సుఖీభవ పోర్టల్ తిరిగి ఓపెన్ కాగానే గ్రీవెన్స్ మాడ్యూల్‌లో తిరిగి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని ఆమె వివరించారు.

బదిలీ అయిన టీచర్లకు వెంటనే జీతాలు చెల్లించాలి

- డీఈవో కార్యాలయం ఎదుట యూటీఎఫ్ నిరసన



డీఈవోకి వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘం నేతలు

నెల్లూరు(విద్య), జూలై 26 (ఆంధ్రజ్యోతి) : బదిలీ అయిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని యూటీఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. నగరంలోని డీఈవో కార్యాలయం ఎదుట శనివారం నిరసన ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు మాట్లాడుతూ బదిలీ అయిన వారికి త్వరగా జీతాలు చెల్లించాలన్నారు. అలాగే బోధనేతర పనుల నుంచి వారు వెంటనే రిలీవ్ అయ్యి వారివారి స్థానాల్లో చేరాలన్నారు. ప్రభుత్వం వారికి రెండు నెలలుగా జీతాలు చెల్లించకపోగా, ప్రాథమికోన్నత పాఠశాలలోని తెలుగు ఉపాధ్యాయుడిని ప్రాథమిక పాఠశాలకు మార్చడం, ప్రాథమిక పాఠశాలలోని హెచ్ఎంలను ప్రాథమికోన్నత పాఠశాలలకు మార్చడం వంటి అసంబద్ధమైన చర్యలు చేపట్టిందని విమర్శించారు. వీటన్నింటినీ వెంటనే సవరించి విద్యారంగాన్ని పరిరక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం డీఈవో బాలాజీరావుకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వీవీశేషులు, ప్రధాన కార్యదర్శి జీవీ.చలపతిశర్మ, రాష్ట్ర, జిల్లా నేతలు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

- పకడ్బందీగా ఏర్పాట్లు : డీఆర్వో

నెల్లూరు (హరనాథపురం) జూలై 26 (ఆంధ్రజ్యోతి) : నేటి (ఆదివారం) నుంచి ఆగస్టు ఒకటోతేదీ వరకు ఏపీపీఎస్‌సీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు డిపార్ట్‌మెంటల్ పరీక్షలు నిర్వహించనున్నామని, ఇందుకుగాను ఏర్పాట్లన్నీ పూర్తి చేశామని డీఆర్వో హుస్సేన్‌సాహెబ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని డీఆర్‌వో చాంబర్‌లో పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో డీఆర్వో సమావేశం నిర్వహించారు. పొట్టేపాలెంలోని అయాన్ డిజిటల్‌జోన్ కేంద్రంలో నిర్వహించే ఈ పరీక్షలు ఉదయం 10 నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్స్‌లో నిర్వహిస్తామన్నారు. కంప్యూటర్ ఆధారితంగా నిర్వహించే ఈ పరీక్షలకు విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో పరీక్షల లైజన్ అధికారి ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

ఆకాశంలో మబ్బులు.. రాలని చినుకులు

- వర్షం కోసం రైతుల ఎదురుచూపు



ఉదయగిరి దుర్గంపై కమ్మేసిన కారుమబ్బులు

ఉదయగిరి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గతం వారం రోజులుగా ఆకాశంలో కారుమబ్బులు కమ్ముతున్నా చినుకు రాలడంలేదు. కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు కురిసినా ప్రయోజనం శూన్యం. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా సరైన వర్షం కురవలేదు. పంట సాగు చేసిన, సాగుకు భూమిని సిద్ధం చేసిన రైతులు వర్షం కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. కొన్ని పంటలు వాడుముఖం పడుతున్నాయి. మరో వారం రోజుల్లో వరుణుడు కరుణించకపోతే ఖరీఫ్ సీజన్ పంటల సాగు అదును దాటుతోందని రైతులు వాపోతున్నారు.

పొజిషన్ సర్టిఫికెట్లు అందజేస్తాం!

(5వ పేజీ తరువాయి)

పోరాటం ఎప్పటికీ మరిచిపోలేని ఘటన అని, దేశ సైనికుల పోరాటపటిమను యావత్ భారతదేశం ఒకే మాట ఒకేబాటగా గుర్తించిన సమయమని అన్నారు. తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశాన్ని కాపాడిన సైనికుల త్యాగం చిరస్మరణీయమంటూ కొనియాడారు. వారి త్యాగనిరతిని భర్తీ చేయడం అసాధ్యమైనప్పటికీ వారి కుటుంబాలకు జిల్లా యంత్రాంగం ఎప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. కార్గిల్ పోరాటం జరిగినప్పుడు తాను ఎనిమిదేళ్ల వయసులో ఉన్నానని, ప్రతిరోజు యుద్ధవార్తల గురించి ఆసక్తిగా పత్రికలు చూసేవాడినని కలెక్టర్ గుర్తు చేసుకున్నారు. భారతదేశ సైనికుల పోరాటపటిమను నేటితరానికి కూడా తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకుగాను పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహించి వారిలో స్ఫూర్తిని రగిలించాలని అధికారులను ఆదేశించారు. మాజీ సైనికుల కోరిక మేరకు నెల్లూరులో అమరవీరుల స్థూపం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన 20 మంది కార్గిల్ పోరాట వీరులను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కార్తీక్‌లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి హరికృష్ణ, మాజీ సైనికులు శ్యాంప్రసాద్, కృష్ణారెడ్డి, తదితరులతోపాటు వివిధ పాఠశాలల ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	134
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	264

కోడిగుడ్ల ధర (100): 475



పారిశుధ్య పనుల పరిశీలన

నెల్లూరు సిటీ, జూలై 26,(ఆంధ్రజ్యోతి) : నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను శనివారం కమిషనర్ నందన్ పరిశీలించారు. మైపాడురోడ్డు జాఫర్ సాహెబ్ కాలువపై నిర్మిస్తున్న స్మార్టు స్ట్రీట్ బజార్‌ను ఆయన పరిశీలించి, జరుగుతున్న పనులపై ఆరా తీశారు. వీలైనంత పూర్తి చేసి లబ్ధిదారులకు అందచేయాలన్నారు. అనంతరం మారుతీనగర్‌లోని పార్కును పరిశీలించి, కనీస సౌకర్యాలు సమకూర్చాలని అధికారులను ఆదేశించారు.

న్యూస్ బాక్స్

రూరల్‌లో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం



శిలాఫలకం ఆవిష్కరణలో గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, జూలై 26,(ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్లోని నిరుపేదలు నివసిస్తున్న ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నట్లు టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. శనివారం 18వ డివిజన్ పరిధిలో చేపట్టబోతున్న పలు అభివృద్ధి పనులను ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో ఈ డివిజన్‌లో ఇప్పటి వరకు రూ. 4.30 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చూశాకే పనులు గుర్తింపు జరుగుతుందని స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల నిర్వహణలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్లీపురం వద్ద ఘర్షణ

నెల్లూరు రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లీపురం వద్ద ఘర్షణ జరగ్గా, ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ సీఐ గుంజి వేణు శనివారం తెలిపారు. ఆయన కథనం మేరకు, శుక్రవారం రాత్రి రెహమాన్ ఎక్స్‌కవేటర్ నడుపుతూ వెళ్తుండగా వెనుక స్కూటరుపై వస్తున్న భార్గవ్, చెంచయ్యలకు దారి ఇవ్వలేదన్న నెపంతో ఎక్స్‌కవేటర్‌ను ఆపి రాడ్లతో తీవ్రంగా గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ఆ ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

నేత్రదానం



నెల్లూరు (వైద్యం) జూలై 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఉస్మాన్‌సాహెబ్ ఎటకు చెందిన గుర్రం శేషయ్య (80) శనివారం మృతిచెందారు. నెల్లూరు పినాకిని లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు ధోనిశెట్టి సునీల్‌బాబు సహకారంతో మృతుడి కుటుంబ సభ్యులను ఒప్పించి, ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్ సునీల్ మృతుడి నేత్రాలను సేకరించారు. నేత్రదానం చేయాల్సిన వారు 99595 89321 నంబరుకు ఫోన్ చేయాలని నిర్వాహకులు తెలిపారు.

మాలకొండ ఆదాయం రూ.12,33,850

వలేటివారిపాలెం, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనృసింహ స్వామి ఆలయానికి శనివారం భక్తుల నుంచి రూ.12,33,850 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్లకు రూ.7,500, కుంకుమార్చనకు రూ.20,360, వివాహముల ద్వారా రూ.4 వేలు, తలనీలాలకు రూ.46,100, వాహనపూజలకు రూ.4,120, ప్రత్యేకదర్శనం టికెట్లకు రూ.2,81,400, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ.720, రూము అద్దెలు రూ.29,700, కవర్లు విక్రయంతో రూ.11,535, లడ్డూప్రసాదంకు రూ.2,60,690, అన్నదానానికి రూ.3,67,725, విరాళముల రూ.2 లక్షలు వచ్చినట్లు పేర్కొన్నారు.

నేడు కరేడుకు రామచంద్రయాదవ్ రాక

ఉలవపాడు, జూలై 26(ఆంధ్రజ్యోతి): బీసీవై పార్టీ వ్యవస్థాపకుడు బోడే రామచంద్ర యాదవ్ ఆదివారం కరేడులో పర్యటించనున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన మహిళలపై అక్రమ కేసులు బనాయించి భయపెట్టి భూములు లాక్కోవాలని చూడటం ప్రభుత్వ పెద్దలు, స్థానిక ఎమ్మెల్యే అమాయకత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. కరేడు రైతుల బలవంతపు భూసేకరణలో రైతులకు అండగా, గిరిజన మహిళలపై పెట్టిన అక్రమ కేసులపై న్యాయపోరాటం చేస్తానని, కార్యచరణ ప్రణాళిక కోసం ఆదివారం కరేడు రైతులను కలవబోతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు పెంచలస్వామి ఆరాధన మహోత్సవం

ఆత్మకూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేపూరు గ్రామ సమీపంలోని హనుమాన్ జంక్షన్ వద్ద ఆదివారం హనుమాన్ భక్త పెంచల స్వామి ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు భాస్కర్‌నాయుడు, పెంచలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు సుప్రభాతసేవ, ఆంజనేయస్వామి అష్టోత్తర నామావళి, తీర్థ ప్రసాద వినియోగం, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రైవేటుకే ప్రాధాన్యం



- జీజీహెచ్‌లో విధులకు వైద్యుల డుమ్మా
- నిబంధనలన్నీ బేఖాతర్
- చేతులెత్తేసిన పర్యవేక్షణ అధికారులు
- చర్యలకు సన్నద్ధం : ఇన్‌చార్జి సూపరింటెండెంట్

నెల్లూరు (వైద్యం), జూలై 26 (ఆంధ్రజ్యోతి): నిరుపేద రోగులకు మెరుగైన చికిత్సలు అందిస్తామంటూ, ప్రభుత్వ వైద్యులుగా బాధ్యతలు చేపట్టిన కొంతమంది విధులకు డుమ్మా కొడుతూ ప్రైవేట్ ఆసుపత్రులకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. ఇదేమని అడిగేవారు లేకపోవటంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వీరి పనితీరును మార్చడానికి ప్రభుత్వం బయోమెట్రిక్ పద్ధతిని తీసుకువచ్చింది. ఆతర్వాత ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) తీసుకువచ్చినా వారితీరు మారలేదు. వీరిపై పర్యవేక్షణ లేకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. ఈ పరిస్థితి నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నెలకొంది.

● ఎప్పుడు వస్తారో..?

ఇక్కడ పనిచేస్తున్న కొందరు వైద్యులు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళతారో చెప్పలేని దుస్థితి. గత ఏడాది జీజీహెచ్‌లో ఉన్న వైద్యులందరినీ కడప, కర్నూలు, అనంతపురం, తిరుపతి జిల్లాలకు బదిలీ చేశారు. అయినా వారు అక్కడికి అప్పుడప్పుడు వెళ్లి వస్తూ నగరంలోని సొంత క్లినిక్‌లకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. వైద్యులు విధులకు సక్రమంగా హాజరు అయ్యేందుకు ఎఫ్ఆర్ఎస్‌ను ప్రభుత్వం తీసుకు వచ్చింది. అయినా దీన్ని అనుకూలంగా మలుచుకుంటున్న కొందరు వైద్యులు విధులకు డుమ్మా కొడుతున్నారు. విధుల్లో ఉన్నట్లుగా కలరింగ్ ఇస్తున్నారు. ఇదిలాఉంటే గతంలో సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన ఓ వైద్యుడు సొంత క్లీనిక్‌లోనే విధులు నిర్వహిస్తూ కేవలం ఎఫ్ఆర్ఎస్ కోసం జీజీహెచ్‌కు వచ్చేవారని తెలిసింది. జిల్లాలో ఇద్దరు మంత్రులతోపాటు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఉన్నా ఇక్కడ వైద్యులను సంస్కరించలేకపోవటంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

● రోగుల పరిస్థితి అధ్వానం..

జీజీహెచ్‌కి వైద్యులు రాకపోవడంతో రోగులకు నర్సింగ్ సిబ్బందే దిక్కవుతున్నారు. ప్రస్తుతం ఇక్కడ 225 మంది వైద్యులు ఉన్నారు. వీరితోపాటు సీనియర్ రెసిడెంట్ వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. 750 పడకలు ఉన్న ఈ ఆసుపత్రిలో ప్రతిరోజూ 1200 మంది రోగులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో ప్రతిరోజు 500కు పైగా ఇన్‌పేషెంట్‌లు వైద్య చికిత్సలు పొందుతుంటారు. అయితే ఇక్కడ వైద్యులు మాత్రం సకాలంలో అందుబాటులో ఉండరు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వారు రోగులకు అందుబాటులో ఉండాలి. వైద్యులు రోగులను పరీక్షించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు రాస్తున్నారు. తీరా ఆయా పరీక్షలకు వెళ్లిన రోగులు ఆ పరీక్షలు చేయించుకుని మధ్యాహ్నం 12.30 గంటలకు వైద్యున్ని కలసి ఫలితాలను చూపించాలని వస్తే అప్పటికే వైద్యులు వెళ్లిపోతున్నారు. దీంతో చేసేది లేక మరుసటి రోజు ఆసుపత్రికి రావాల్సి వస్తున్నది. దీంతో సుదూర ప్రాంతాల రోగులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఈ క్రమంలో జీజీహెచ్ వైద్యులతీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా కలెక్టర్‌తోపాటు ప్రజాప్రతినిధులు జీజీహెచ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

చర్యలకు సమాయత్తం



సక్రమంగా విధులకు హాజరుకాని వైద్యులపై చర్యలకు సమాయత్తం అవుతున్నాం. రోగులకు వైద్యులు అందుబాటులో ఉండేలా పూర్తిస్థాయి పర్యవేక్షణ నిర్వహిస్తాం. ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వైద్య సేవలు మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నాం.

- డాక్టర్ కొండేటి మాధవి, జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్

సైనికుల త్యాగాలు ఆదర్శం

- కార్గిల్ విజయ్ దివస్‌లో ఎన్‌సీసీ అధికారులు



ర్యాలీకి హాజరైన ఎన్‌సీసీ అధికారులు, క్యాడెట్స్

నెల్లూరు(విద్య), జూలై 26 (ఆంధ్రజ్యోతి): సైనికుల త్యాగాలను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని ఎన్‌సీసీ అధికారులు తెలిపారు. కార్గిల్ దివస్ సందర్భంగా శనివారం నగరంలో వివిధ విద్యాసంస్థల క్యాడెట్స్ ర్యాలీ నిర్వహించి, వీర జవాన్లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికుల త్యాగాలపై దేశశాంతి, సౌఖ్యాలు ఆధారపడి ఉన్నాయన్నారు.

● మున్సిపల్ పాఠశాలలో....

నగరంలోని నవాబుపేట చిన్నబాలయ్య నగర్ నగరపాలక ఉన్నత పాఠశాలలో శనివారం కార్గిల్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్స్ ర్యాలీ చేపట్టారు. ఎన్‌సీసీ చీఫ్ ఆఫీసర్ బాల బ్రహ్మచారి మాట్లాడుతూ అమరవీరులు ఆశయాలను కొనసాగించేలా విద్యార్థులు ముందుకు నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

● జీవీఆర్ఆర్ జూ. కళాశాలలో...

జీవీఆర్ఆర్ జూనియర్ కళాశాలలో జరిగిన కార్గిల్ విజయ్‌దివస్‌కు అతిథిగా వెటరన్ సార్జంట్ విజయ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏబీ.రవికుమార్, వాత్సల్య నిర్వాహక కార్యదర్శి జీవీ.సాంబశివరావు, సంయుక్త కార్యదర్శి దుర్గాప్రసాద్, ఎన్ఎస్ఎస్ పీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● వెంగళరావునగర్ హైస్కూల్‌లో...

వెంగళరావునగర్ నగరపాలక ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో ఎన్‌సీసీ కేడెట్స్ విజయ్ దివస్ నిర్వహించారు. అమరవీరులకు కొవ్వొత్తులతో ఘన నివాళులర్పించారు.అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ సెకండ్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు, ఎన్‌సీసీ అధికారులు, కేడెట్స్ పాల్గొన్నారు.

● రత్నం పాఠశాలలో....

నగరంలోని సరస్వతినగర్ డాక్టర్ కిషోర్స్ రత్నం ఉన్నత పాఠశాలలో కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. అతిథులుగా సుబేదార్ హేమంత్‌కుమార్, నాయక్ మహేష్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్స్ మణిమాల, జ్యోతి, జాస్మిన్, నాగేంద్ర, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రహణ మొర్రికి ఉచిత చికిత్సలు



ఆపరేషన్ చేయించుకున్న వారితో ఆసుపత్రి నిర్వాహకులు

నెల్లూరు (వైద్యం) జూలై 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జయభారత్ ఆసుపత్రి చొరవతో ఇద్దరు గిరిజన చిన్నారులకు ఉచిత గ్రహణ మొర్రి శస్త్రచికిత్సలు నిర్వహించారు. ఇందుకూరుపేట మండలం కొరుటూరు గిరిజనకాలనీలోని జోష్నవి, వెంకటాచలం మండలం ఈదగాలి గిరిజనకాలనీలోని తిరుమలకొండ శ్రీలతకు ఈ చికిత్సలు జరిగాయి. ఆసుపత్రి మేనేజర్ గురుప్రసాద్ దృష్టికి చిన్నారుల సమస్యలను కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. ఆయన స్వర్ణభారత్ ట్రస్ట్‌ను సంప్రదించి, చెన్నైలోని మీనాక్షి అమ్మాల్ డెంటల్ కళాశాలను ద్వారా ఉచిత శస్త్రచికిత్సలు చేయించారు. శనివారం ఆపరేషన్ చేయించుకున్న చిన్నారులతోపాటు వారి తల్లిదండ్రులు ఆసుపత్రికి వచ్చి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి గిరిజన విభాగం ఇన్‌చార్జ్ మోపూరు వెంకటేశ్వర్లు, పొట్లూరి శ్రీనివాసులు, డిప్యూటీ మేనేజర్లు మనోహర్, వెంకటేష్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రెండోరోజు సీపీఎం ధర్నా



పొట్టేపాళెం కలుజు వద్ద నిరసనలో సీపీఎం నాయకులు

నెల్లూరు రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): పొట్టేపాళెం, ములుముడి గ్రామాల వద్ద కలుజులపై వంతెనలు నిర్మించాలని సీపీఎం నాయకులు రెండురోజు శనివారం కూడా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా మాజీ కార్యదర్శి చంద్ర రాజగోపాల్, నాయకులు శ్రీరాములు, చంద్రమౌళి మాట్లాడారు. ఐదు నియోజ కవర్గాల ప్రజాప్రతినిధులు ఈ కలుజులపై ప్రయాణిస్తున్నారని, వంతెనల నిర్మాణాలకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి నిధులు మంజూరు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జనార్దన్, నాయకులు తిరుపాలు, జానా ప్రసాద్, గండవరపు శ్రీనివాసులు, పాదర్తి మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్, ఈఎస్ఐ కోసం కార్మికుల ధర్నా



ఫ్యాక్టరీ ముందు ధర్నా చేస్తున్న కార్మికులు

వింజమూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రపడియ గ్రామంలో ఉన్న చిరాన్ ఫ్యాక్టరీలోని కార్మికులు తమకు పీఎఫ్, ఈఎస్ఐ ఇప్పించాలని శనివారం ధర్నాచేశారు. కొంతకాలంగా తమకు పీఎఫ్, ఈఎస్ఐ అందడంలేదని, నమోదు కూడా కాంట్రాక్టులు చేయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చిరాన్ మేనేజర్ కార్మికులకు దగ్గరకు వచ్చి సమస్యలు పరిష్కరిస్తానని చెప్పడంతో కొంతమంది కార్మికులు పనికి వెళ్లారు. మరికొందరు సమస్యలు పరిష్కరించాకే పనిలోకి వస్తామని తేల్చి చెప్పారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

కలిగిరి, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకొండూరులో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో శనివారం విగ్రహప్రతిష్ఠ మహోత్సవం వైభంవగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయంలో జరిగిన అభిషేకాలు, గ్రామో త్సవంలో పాల్గొన్నారు. భక్తులతో కలసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బిజ్జం కృష్ణారెడ్డి, బీవీ రామారావు, సర్పంచు మొక్కా సుజాత, ఉప సర్పంచు తోట మాల్యాద్రిరెడ్డి, మాజీ సర్పంచు మొక్కా హజరత్తరావు, తదితరులు పాల్గొన్నారు.

చేనేతల అభివృద్ధికి కోటయ్య ఎనలేని సేవలు

నెల్లూరు(వ్యవసాయం), జూలై 26(ఆంధ్రజ్యోతి): చేనేతల అభివృద్ధికి ప్రగడ కోటయ్య ఎనలేని సేవలు చేశారని చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా కన్వీనర్ బుధవరపు బాలాజీ తెలిపారు. కోటయ్య 110వ జయంతి సందర్భంగా కమిటీ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని మనం ఆసుపత్రి ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేతల కోసం 75రోజులు పాదయాత్ర చేసి, జైలు జీవితం కూడా అనుభవించిన ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు. ఈకార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు సమాధి శ్రీనివాసులు యాదవ్, చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు సోమాగోపాల్, నాయకులు చింతలపూడి పెంచలయ్య, గుత్తికొండ శ్రీనివాసులు, జానపాటి రామసుబ్బయ్య, వింజమూరు వెంకటేశ్వర్లు, చింతగింజల సుబ్రహ్మణ్యం, మహిళా అధ్యక్షురాలు సోమ అనూరాధ, పాటి విజయ, మాజీ కార్పొరేటర్ లలితారామ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కోటయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు

● చింతలపూడి పెంచలయ్యకు సన్మానం

కోవూరు మండలం గమళ్లదిబ్బ చేనేత క్లస్టర్ కుటుంబాలకు చింతలపూడి పెంచలయ్య రూ.1.26లక్షల సాయాన్ని ప్రకటించి ప్రభుత్వానికి జమ చేశారని చేనేతల కమిటీ జిల్లా కన్వీనర్ బీ. బాలాజీ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన్ను శాలువా కప్పి సన్మానించారు.

ఎన్ఎంయూఏ ఉద్యోగుల నిరసన



డిపో ఎదుట నిరసన తెలియచేస్తున్న ఉద్యోగులు

ఉదయగిరి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం ఎన్ఎంయూఏ ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈసందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ గవర్నర్‌పేట-1, విజయవాడ పాత బస్టాండ్ స్థలాలు ప్రైవేటు సంస్థకు అప్పగించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వెంటనే విరమించుకోవాలని, లేకపోతే నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎన్ఎంయూఏ నా యకులు శంకర్, నాగరాజు, కాశీవిశ్వనాథ్, సురేష్, సిద్ధయ్య, ఆర్ఎస్‌రెడ్డి, రమణయ్య, సుజాత, వెంగమ్మ, నాగమణి పాల్గొన్నారు.

కావలి డిపోలో ఆందోళన

కావలి(టౌన్,ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఆర్టీసీ స్థలాల ప్రైవేటీకరణకు పూనుకోవడం దుర్మార్గమని ఆర్టీసీ ఎన్ఎంయూ నేతలు మండిపడ్డారు. ఈ మేరకు శనివారం కావలి డిపో వద్ద ఆందోళన చేశారు. విజయవాడలో విలువైన భూములు లూలూ మాల్ నిర్మాణానికి ధారాదత్తం చేయాలనుకోవడం సరికాదన్నారు.

పాత కక్షల నేపథ్యంలో ఘర్షణ

ఇద్దరిపై కేసు నమోదు

గుడ్లూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): పాతకక్షల నేపథ్యంలో ఘర్షణ పడి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటనలో ఇరువురిపై కేసులు నమోదయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. కావలిలో నివాసం ఉండే కూతల జీవన్ కుమార్ ఉలవపా డు మండలం రామాయపట్నం జడ్పీ హైస్కూల్‌లో పీడీగా పనిచేస్తున్నారు. శుక్రవారం విధులకు హాజరైన ఆయన సాయంత్రం విధులు ముగించుకుని తన కారులో కావలికి బయలుదేరారు. గుడ్లూరు మండలం తెట్టు కుమ్మరపాలెం వద్దకు రాగానే తెట్టు నుంచి రామాయపట్నంకు బైక్‌పై వెళుతున్న మండలంలోని కర్లపాలెంకు చెందిన చాపల సాయిచంద్ కారుకు అడ్డంగా బైకును నిలిపి జీవన్‌కుమార్‌ను అ డ్డగించి దుర్భాషలాడాడు. గతంలో కావలిలో వీరిద్దరి మధ్య జరిగిన వివాదం నేపథ్యంలో అనూహ్యంగా చోటు చేసుకు న్న ఈ ఘటనలో ఇరువురు ఘర్షణ పడి ఒకరిపై ఒకరు రాళ్లు, కత్తితో దాడి చేసుకున్నారు. గమనించిన స్థానికులు ఇరువురికి నచ్చచెప్పి అడ్డుతీసి పంపించారు. ఈ దాడిలో గాయపడిన సాయిచంద్ కావలి ఏరియా వైద్యశాలలో, జీవన్‌కుమార్ ఉలవపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు. శనివారం పోలీసులకు పరస్పరం ఫిర్యాదు చేసుకోవడంతో కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట్రావు తెలిపారు.

స్మార్ట్ మీటర్లు వద్దు : సీపీఐ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

నెల్లూరు (వైద్యం) జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై ఆర్థిక భారం పడకుండా స్మార్ట్ మీటర్లు వద్దు - ఉన్నవి తొలగించవద్దు... అనే విధానాన్ని అనుసరించాలని సీపీఐ నగర కార్యదర్శి అరిగెల నాగేంద్రసాయి డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. స్మార్ట్‌మీటర్ల వల్ల ప్రజలపై రూ.15,400 కోట్లు భారం పడే అవకాశం ఉందన్నారు. ఎన్నికల సమయంలో కరెంటు చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం సెకితో కుదుర్చుకున్న ఒప్పందాలనే కొనసాగించే ప్రయత్నం చేస్తున్నదన్నారు. రాబోయే రోజుల్లో సెల్‌ఫోన్ రీచార్జీ చేసినట్లు కరెంటు కూడా రీచార్జీ చేసుకునే పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం స్మార్ట్‌మీటర్లు వద్దుంటూ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జిలానిఖాన్, జిల్లా కార్యదర్శి మున్నా, ఏఐఎస్ఎఫ్ నగర నాయకులు శివం తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానంతో పునర్జన్మ

నెల్లూరు (వైద్యం) జూలై 26 (ఆంధ్రజ్యోతి): అవయవ దానం ద్వారా పలువురికి పునర్జన్మ ప్రసాదించవచ్చని నారాయణ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. శనివారం నారాయణ ఆసుపత్రిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రం జాతీయ అవయవదాన వారోత్సవాలను నిర్వహిస్తున్నదని, ఇందులో భాగంగా నారాయణ ఆసుపత్రిలో ప్రజలకు, ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నారాయణ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దొరసానమ్మ, వివిధ విభాగాల వైద్య నిపుణులు సంపత్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, ద్వారకానాథ్‌రెడ్డి, వంశీకృష్ణ తదితరులు మాట్లాడారు. అనంతరం అవయవ దానం పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో యూరాలజిస్ట్ డాక్టర్ యువరాజ్‌రెడ్డి, ఏజీఎం శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అవయవ దానంపై పోస్టర్లు విడుదల చేస్తున్న వైద్య నిపుణులు



చెవిలో పూలతో కార్మికుల నిరసన

ప్రభుత్వ చర్యలకు నిరసనగా పారిశుధ్య కార్మికులు చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. శనివారం నగరంలోని బొల్లినేని సెంటర్ నుంచి కొండాయపాళెం గేటు వరకు వారు ఈ నిరసన ప్రదర్శన చేశారు. సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు



సూర్యనారాయణ, రూరల్ నాయకులు శివాజీ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు 12 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. ప్రస్తుతం ఉన్న పద్ధతి ద్వారానే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి టెండర్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెంచలనర్సయ్య, సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, సీఐటీయూ నేతలు కొండాప్రసాద్, సుధాకర్, మాలకొండయ్య, కోటేశ్వరరావు, భాగ్యమ్మ, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

- నెల్లూరు (వైద్యం,ఆంధ్రజ్యోతి)



శ్రీవారికి బ్యాటరీ వాహనాల విరాళం

రాపూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన దేవస్థానానికి తిరుపతికి చెందిన టీటీడీ విశ్రాంత ఉద్యోగి ఎం సుబ్రహ్మణ్యం, ఎం సుశీల దంపతులు సుమారు రూ.12లక్షల విలువ గల 2 బ్యాటరీ వాహనాలను శనివారం విరాళంగా అందజేశారు. ప్రత్యేక పూజలు జరిపి ఆలయ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉపకమిషనర్ వీ శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

● నిత్యాన్నదానానికి రూ. 2లక్షల విరాళం

పెంచలకోనలోని శాశ్వత నిత్యాన్నదాన పథకానికి శనివారం తిరుపతి విజయపురి కాలనీకి చెందిన జొన్న వెంకయ్య, వెంకటసుబ్బమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు శ్రీకాంత్ దంపతులు రూ.2లక్షల నగదు ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డికి అందజేశారు.

దేవుడికి ఎన్ని నగలున్నాయ్!

కావలిలోని మూడు ఆలయాల్లో ఆభరణాల లెక్కింపు

కావలి, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఇటీవల దేవదాయశాఖలో కలిసిన కావలి గ్రామదేవత కలుగోళ్ల శాంభవి, పాతూరు శివాలయం, విష్ణాలయాలకు సంబంధించిన ఆభరణాలను శనివారం దేవదాయశాఖ గుంటూరు రేంజ్ జ్యువలరీ వెరిఫికేషన్ అధికారిణి (జేవీవో) సైదమ్మబాయి ఆధ్వర్యంలో లెక్కింపు చేపట్టారు. ఆమెతో పాటు ఆలయ ధర్మకర్త కృష్ణమోహన్, ఈవో రాధాకృష్ణ, కోవూరు గ్రూప్ ఆలయాల ఈవో కృష్ణప్రసాద్‌లు ఈ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత కలుగోళ్ల శాంభవి ఆలయంలోని అమ్మవారి ఆభరణాలను తనిఖీ చేసి వాటిని లెక్కించి, తూకం వేసి అక్కడే ఉన్న లాకర్‌లో భద్రపరిచారు. అనంతరం శివాలయం, విష్ణాలయంలో కూడా తనిఖీలు చేసి ఉన్న ఆభరణాలను లెక్కించి తూకం వేసి ఎన్ని అభరణాలు ఉన్నాయో నిర్ధారించారు. అయితే ప్రస్తుతం కలుగోళ్ల శాంభవి ఆలయంలో ఆభరణాలు భద్రపరచేందుకు పటిష్టమైన ఏర్పాట్లతో లాకర్ ఉండటంతో మూడు ఆలయాల ఆభరణాలు అక్కడకు చేర్చి భద్రపరిచారు. త్వరలో ఆయా ఆలయాలకు సంబంధించి మూడు బాక్స్‌లు తయారు చేసి ఆభరణాలు ఆ బాక్స్‌ల్లో వేర్వేరుగా పెట్టి తాళాలు వేయనున్నారు. ఆభరణాలు భద్రపరిచిన లాకర్ తాళాలను ఈవోకు ఒకటి, ఆలయ ధర్మకర్తకు ఒకటి అందజేశారు. ఆయా ఆలయాల్లో ఉత్సవాలు జరిగే సమయంలో వాటిని తీసుకుని ఉత్సవాల అనంతరం తిరిగి వారి సమక్షంలోనే భద్రపరచే విధంగా నిర్ణయించారు.



గ్రామాల రూపురేఖలు మార్చండి

● జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు (జడ్పీ), జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మహిళా జడ్పీటీసీలు, ఎంపీటీసీలు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతాల్లోని గ్రామాల రూపురేఖలు మార్చాలని జడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ పిలుపునిచ్చారు. నెల్లూరులోని జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మహిళా జడ్పీటీసీలు, ఎంపీటీసీల శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళా ప్రతినిధులు ఈ శిక్షణ వేదికను చక్కగా వినియోగించుకున్నారని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల మహిళలు ఆర్థికాభివృద్ధికి తమవంతు సహాయసహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో స్టేట్ అబ్జర్వర్ ప్రసాద్, జడ్పీ కార్యాలయ సిబ్బంది, శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలి

● సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ

నెల్లూరు (హరనాథపురం), జూలై 26 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని అంగన్‌వాడీల సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ కోరారు. శనివారం నగరంలోని జెట్టి శేషారెడ్డి సమావేశ మందిరంలో అంగన్‌వాడీల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని కోరారు. పాత ఫోన్లు తీసుకుని కొత్త ట్యాబ్‌లు ఇవ్వాలని, లేనిపక్షంలో మరో పోరాటానికి సిద్ధమని తెలిపారు. ఇచ్చిన ఫోన్లు సక్రమంగా పనిచేయకపోవడంతో పూర్తి సమయం ఈ యాప్‌ల నిర్వహణకు సరిపోతుందని చెప్పారు. అన్నీ సరుకులు సకాలంలో సెంటర్‌కు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకుడు టీవీ ప్రసాద్, అంగన్‌వాడీల సంఘం జిల్లా అధ్యక్షురాలు సుజాత, జిల్లా కార్యదర్శి రెహనాబేగం, నాయకులు శేషమ్మ, రాధ, నాగభూషణమ్మ, కామాక్షమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

● అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసీఈసీ డే

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బాల్యారంభ పూర్వ ప్రాథమిక విద్యాదినోత్సవం (ఈసీఈసీడే) కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. నగరంలోని వెంగళరావునగర్ సెక్టార్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన ఈసీఈసీ డే కార్యక్రమంలో అర్బన్ సీడీపీవో అరుణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నాలుగో శనివారం ఈసీఈసీడేని జరపాలన్నారు. ఆరోజున పిల్లలు నేర్చుకున్న అంశాలను తల్లిదండ్రుల ముందు ప్రదర్శించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఏ.రాజేశ్వరి, కార్యకర్త నజీమా, హెల్పర్ నాగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో అభద్రత



జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయాణికుల భద్రత గాలిలో దీపంలా మారింది. కొంతకాలంగా బస్టాండ్లలో తరచూ చోరీలు జరుగుతున్నాయి. ఆర్టీసీ విజిలెన్స్ సిబ్బంది కొరత ఉండటం, ఉన్నవారేమో వచ్చామా... వెళ్లామా! అన్నట్లు విధులు నిర్వహిస్తుండటంతో దొంగలు బస్టాండ్లలో చేతివాటం చూపుతున్నారు. ప్రయాణికుల భద్రత పక్కన పెడితే ఆర్టీసీ బస్సులకే భద్రత లేదని ఇటీవల నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండులో జరిగిన బస్సు దొంగతనంతో స్పష్టమైంది.

- బస్టాండ్లలో పెరుగుతున్న చోరీలు
- బస్సులకే భద్రత కరువు
- రాత్రయితే మందుబాబుల సంచారం
- ఆకతాయిల బెడద
- విజిలెన్స్‌లో సిబ్బంది కొరత
- రక్షణ చర్యలు అంతంతమాత్రం
- బిక్కుబిక్కుమంటున్న ప్రయాణికులు


నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండులో నిలిపి ఉన్న బస్సుల ఏరియల్ వ్యూ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 26 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజుల క్రితం నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండులో నిలిపి ఉన్న ఓ బస్సును ఆర్టీసీకి సంబంధం లేని ఓ వ్యక్తి దర్జాగా నడుపు కుంటూ తీసుకెళ్లిపోయాడు. ఆ బస్సును నడిపే డ్రైవర్ వచ్చి చూసుకునే వరకు ఎవరో అనామకుడు బస్సును తీసుకెళుతున్న విషయాన్ని ఎవరూ గుర్తించలేదు. బస్టాండులో ఉన్న బస్సునే ఆర్టీసీ అధికారులు కాపాడుకోలేకపోతే ఇక ప్రయాణికుల భద్రతపై ఏమి దృష్టిసారిస్తారని ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల నెల్లూరులోని ప్రధాన బస్టాండులో ఉన్న ఓ బస్సులో బ్యాగు చోరీ జరిగింది. అందులో లక్షల విలువ చేసే బంగారు నగలు ఉన్నాయి. దీంతో బాధితులు లబోదిబోమన్నారు.

రాత్రి పూట బిక్కు బిక్కు...

కొన్ని ప్రాంతాల్లో చీకటి పడితే ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ బస్సుల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. మందుబాబులు ఫూటుగా మద్యం సేవించి వచ్చి బస్టాండ్లలోని బెంచీలు, కుర్చీలపై నిద్రిస్తున్నారు, ఆ మత్తులో రచ్చ చేస్తున్నారు. బస్టాండ్లలోని స్టాల్స్‌లో అర్ధరాత్రి వేళ కూడా సిగిరెట్లు, వాటర్ ప్యాకెట్లు, టచ్చింగ్ వంటివి దొరుకుతుండటంతో మందుబాబులు అక్కడి వస్తున్నారు. ఈ క్రమంలో బస్సుల కోసం ఎదురు చూస్తున్న వారితో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు.

సీసీ కెమెరాలు అంతంత మాత్రమే

జిల్లాలో ఏడు ఆర్టీసీ డిపోలు ఉండగా వాటిలో నామమాత్రంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. నిత్యం వేలాది మంది ప్రయాణాలు సాగించే నెల్లూరు ప్రధాన బస్టాండులో ఏడు కెమెరాలు, నగరంలోని ఆత్మకూరు బస్టాండులో 14, కావలి బస్టాండులో 16, రాపూరు బస్టాండులో 6, ఆత్మకూరు మున్సిపల్ బస్టాండులో 3, కందుకూరు బస్టాండులో 3 కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆత్మకూరులోని ఆర్టీసీ బస్టాండులో, ఉదయగిరి బస్టాండులో అసలు సీసీ కెమెరాలే లేకపోవడం గమనార్హం.

విజిలెన్స్‌లో సిబ్బంది కొరత

ఆర్టీసీ విజిలెన్స్ విభాగాన్ని సిబ్బంది కొరత వేధిస్తోంది. ఉన్నవారేమో బస్టాండ్లలోని స్టాల్స్‌లో అప్పుడప్పుడు నిషేధిత వస్తువులు పట్టుకోవడం, ఆర్టీసీ డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు చేయడం, కార్గోలో తనిఖీలు చేయడానికి పరిమితం అవుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు, సిబ్బంది వైఫల్యం వల్లే వరుస దొంగతనాలు జరుగుతున్నట్లు విమర్శలున్నాయి. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే... విజిలెన్స్‌లో సిబ్బంది కొరత ఉందని, ఉన్నవారితో భద్రత ఏర్పాటు చేస్తున్నామని చెబుతున్నారు.

చట్టాలపైన అవగాహన అవసరం

న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి వాణి

వెంకటాచలం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : చట్టాలపైన ప్రతీ ఖైదీకి అవగాహన ఎంతో అవసరమని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే వాణి సూచించారు. చెముడుగుంట సమీపంలోని జిల్లా కేంద్ర కారాగారంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె ఖైదీల యోగా క్షేమాలు, కేసుల వివరాలు, భోజన వసతి, వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లాయర్లు లేనివారికి తామే ఏర్పాటు చేస్తామని, తద్వారా పేదలు న్యాయ సేవలు, సలహాలను ఉచితంగా పొందవచ్చన్నారు. జైలు నుంచి విడుదలై బయటకు వెళ్లిన తర్వాత మంచిగా, కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ సీహెచ్ బాలమహేష్, డిఫెన్స్ కౌన్సిల్ టీ గోపాల్‌రెడ్డి, డిప్యూటీ చీఫ్ హర్ష, జైలర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి వాణి

మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి

● సీపీఎం, ఎమ్మార్పీఎస్ ఆందోళన

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరికుంటపాడు, భాస్కరాపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 233, 1లోని లీజుదారులకు మంజూరు చేసిన మైనింగ్ అనుమతులను వెంటనే రద్దుచేయాలని సీపీఎం, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం వేర్వేరుగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ ఆధ్వర్యంలో నాయకులు, ప్రజలు కొండ ప్రాంతానికి చేరుకొని పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి స్థానికులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండ ప్రాంతానికి అతి సమీపంలో జంగంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎస్సీలు నివాసం ఉంటున్నారన్నారు. వారికి ఆప్రాంతంలోని కొండ పోరంబోకు భూములే జీవనాధారంగా మారాయన్నారు. గత ప్రభుత్వం 2023 లో ఆప్రాంతంలోని 43 ఎకరాల్లో మైనింగ్ తవ్వకాలకు అనుమతులిస్తూ జీవో విడుదల చేసిందన్నారు. దీంతో ఇటీవల వ్యాపారులు బోరు పాయింట్లు వేసి పనులు చేపట్టేందుకు పూనుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కలెక్టరును సైతం కలిసి సమగ్రంగా నివేదికలు అందజేసి న్యాయ పోరాటం సాగిస్తామన్నారు. అలాగే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేడ్కర్ మాదిగ కొండ ప్రాంతాన్ని పరిశీలించడంతో పాటు తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి ఆర్ఐ హర్షద్ అమహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచు దిలీప్‌కుమార్, వైస్ ఎంపీపీ చంచల మధు, రైతు సంఘం జిల్లా కార్యదర్శులు కాకు వెంకటయ్య, మాలె వెంగయ్య, రాష్ట్ర కమిటీ కౌలురైతు సంఘం సభ్యుడు గంటా లక్ష్మీపతి, ఉదయగిరి, దుత్తలూరు ఏరియా కార్యదర్శులు కోడె రమణయ్య, మల్లికార్జున, ఎమ్మార్పీఎస్ నాయకులు గోచిపాతల వెంకటేశ్వర్లు, బెజవాడ బాలగురవయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ ఆనంకు వినతి

కొండ ప్రాంతంలో చేపట్టనున్న మైనింగ్ తవ్వకాల అనుమతులు రద్దు చేసి న్యాయం చేయాలని శనివారం రాత్రి గ్రామస్థులు రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఎదుట వాపోయారు. వరికుంటపాడు మీదుగా ప్రయాణిస్తున్న మంత్రి వాహనాన్ని ఆపి తమ గోడు వినిపించారు. మైనింగ్ జరిపితే తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. మైనింగ్ వద్దు- కొండే ముద్దు అంటూ కొందరు నినాదాలు చేయడంతో కొంతమేర అసహనానికి గురైన ఆనం... నా ముందు ఆరిస్తే ఏం వస్తుంది, మీ ఎమ్మెల్యే ముందు మాట్లాడాలి కదా అన్నారు. అనంతరం గ్రామస్థుల నుంచి మంత్రి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ విషయమై సబ్ కలెక్టర్‌తో మాట్లాడతానని చెప్పి వెళ్లిపోయారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ఆండ్రా నాగిరెడ్డి, సర్పంచు దిలీప్‌కుమార్, ఆండ్రా శివరామిరెడ్డి పాల్గొన్నారు.

'ఉపాధి'కి తూట్లు పొడుస్తున్న కేంద్రం

నెల్లూరు (వైద్యం) జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తున్నదని, ఈ వైఖరి మారాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ అన్నారు. శనివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో సంఘం సమావేశం జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షుడు దర్గాబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడిగా లీలామెహన్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా దర్గాబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆవుల శేఖర్ ఎన్నికయ్యారు.


ఏఐ గ్రాడ్యుయేషన్ పట్టా పొందుతున్న సుధా చంద్రమౌళి


140 మందికి ఏఐ గ్రాడ్యుయేషన్‌లో పట్టాలు


● టాపర్‌గా నెల్లూరు యువకుడు చంద్రమౌళి

హైదరాబాద్, జూలై 26(ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధ (ఏఐ)పై గత 60రోజులుగా నిర్వహించిన ఏఐ గ్రాడ్యుయేషన్ ప్రోగ్రాం ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 600 మంది ఇందులో పాల్గొన్నారు. పట్టాల ప్రధానోత్సవం శనివారం టి-హబ్‌లో జరిగింది. మొత్తం 140 మందికి ఏఐ గ్రాడ్యుయేషన్ పట్టాలు పొందారు. వీరిలో నెల్లూరు జిల్లాకు చెందిన సుధా చంద్రమౌళి టాపర్‌గా నిలిచారు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రతీ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే ఏఐ గురించి అవగాహన కల్పించడం తన లక్ష్యమని ఈ సందర్భంగా సుధా చంద్రమౌళి తెలిపారు.

నెల్లూరులో లక్కీ షాపింగ్‌మాల్ ప్రారంభం

నెల్లూరు (హరనాధపురం) జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వస్త్రాల నిలయం లక్కీ షాపింగ్ మాల్ 13వ బ్రాంచ్ నెల్లూరులో శనివారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ప్రముఖ నటి అనసూయ భరద్వాజ్, బాల నటుడు రేవంత్ (బుల్లిరాజు) ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వీరిని చూసేందుకు అభిమానులు షాపింగ్‌మాల్ వద్దకు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా అనసూయ మాట్లాడుతూ నెల్లూరుకు మొట్ట మొదటిసారిగా వచ్చానని, తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. లక్కీ షాపింగ్ మాల్‌లో ప్రజలు కోరుకునే అనేక రకాల వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. షాపింగ్ మాల్ ఓపెనింగ్ ఆఫర్‌తోపాటు పండుగల ఆఫర్లు కూడా ఎన్నో ఉన్నాయని చెప్పారు. ఇటీవల విడుదలైన హరిహర వీరమల్లు సినిమాను చూడాలని అభిమానులకు పిలుపునిచ్చారు. పవన్‌కల్యాణ్ సినిమాల్లోకి యాక్సిడెంటల్‌గా వచ్చానని చెబుతుంటారని, ప్రజలకు సేవ చేయాలనే తపనతో ఆయన పని చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా నెల్లూరులో హరిహర వీరమల్లు టికెట్ ధర అడిగి తెలుసుకున్నారు. లక్కీ షాపింగ్‌మాల్ అధినేతలు శ్రీనివాసులు, స్వామి, రత్నయ్య, తదితరులు మాట్లాడుతూ నెల్లూరులో ఏర్పాటు చేసిన లక్కీ షాపింగ్‌మాల్‌ను ప్రజలు ఆదరించాలని కోరారు. ప్రజలు కోరుకున్న అన్నీ రకాల వస్త్రాలను అందుబాటులో ఉంచామని చెప్పారు.


లక్కీ షాపింగ్‌మాల్‌లో జ్యోతిప్రజ్వలన చేస్తున్న నటి అనసూయ భరద్వాజ్, పక్కన బాల నటుడు రేవంత్


స్టెప్పులేసి ఫ్యాన్స్‌ను ఉత్సాహ పరుస్తూ..

అసలేం జరిగింది..?

- రుణాల స్కామ్‌లో యాక్సిక్ బ్యాంకు అధికారుల పాత్ర?
- వారిని కాపాడేందుకే కాలయాపన!!
- సమాచారం ఇచ్చేందుకు ఏడు నెలలా?

ముత్తుకూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : కార్మికులను సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా చూపించి రూ.కోట్లు రుణాలు స్వాహా చేసిన కేసులో యాక్సిస్ బ్యాంక్ అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణ ప్రజలకు రుణం ఇవ్వాలంటే ఎన్నో ఆంక్షలు విధించే బ్యాంక్ అధికారులు ఎలాంటి క్షేత్రస్థాయి తనిఖీలు లేకుండా రూ.కోట్ల రుణాలు మంజూరు చేయడంపైన సందేహాలు తలెత్తుతున్నాయి. డిజిటల్ బ్యాంకింగ్‌లో ఉన్న లోపాలను అనుకూలంగా మార్చుకుని ఈ స్కామ్‌కి పాల్పడ్డారు. ప్రధానంగా యాక్సిస్ బ్యాంక్ ముత్తుకూరు శాఖలో నాలుగు బోగస్ కంపెనీల ఖాతాలను ఎలాంటి పరిశీలన లేకుండా ప్రారంభించడంలో నిందితులు నలుగురితోపాటు బ్యాంకు అధికారుల ప్రమేయం ఉంటుందని భావిస్తున్నారు. పోలీసుల ప్రాథమిక విచారణలోనూ ఈ వాస్తవాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. రుణాల స్కాంపై గత ఏడాది డిసెంబరు 23వ తేదీ 179/2024గా కేసు నమోదు చేశారు. అప్పుడే సీఐ, ఎస్ఐలు విచారణలో భాగంగా 56 మంది ఖాతాదారుల వివరాలు, వారు సమర్పించిన ధ్రువపత్రాలు, ప్రధాన నిందితులు వాసుదేవ నాయుడు, అల్లాబక్షు, శివ, వెంకట్ ఇచ్చిన అన్నీ ఆధార పత్రాలతో సంపూర్ణ నివేదిక ఇవ్వాలని బ్యాంక్ అధికారులను రాతపూర్వకంగా కోరారు. అంతర్గతంగా తమ బ్యాంకులో విచారణ ఉంటుందని పూర్తయ్యాక ఇస్తామని ఇతరత్రా కారణాలు చెబుతూ, బ్యాంక్ అధికారులు కాలం వెళ్లబుచ్చారు. సుదీర్ఘంగా కాలయాపన చేయడం వెనుక తమ అధికారులను కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల రుణాలు కట్టాలంటూ యాక్సిస్ బ్యాంక్ నుంచి ఖాతాదారులకు నోటీసులు రావడంతో వారు బహిరంగ నిరసన వ్యక్తం చేస్తూ, ఆందోళనకు దిగారు. దీంతో ఈ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయానికి బ్యాంక్ అధికారులను పిలిపించి వెంటనే నివేదిక ఇవ్వాలని కోరినా స్పందన లేకపోవడంతో గురువారం పోలీసులు చట్టపరంగా బ్యాంక్ అధికారులకు నోటీసులు జారీ చేశారు. అసలు నిందితులు వాసుదేవనాయుడు, అల్లాబక్షు, శివ, వెంకట్‌లతోపాటు ఖాతాలు తెరిచిన 56 మంది ఖాతాదారులకు, లోన్లు ఇచ్చిన నెల్లూరు పరిసర ప్రాంతాల యాక్సిస్ బ్యాంకుల అధికారులకు రుణాల స్కామ్‌లో ప్రమేయం ఉందని విశ్వసనీయ సమాచారం. పోలీసులు లోతుగా విచారిస్తే ఈ కుంభకోణంలో వాస్తవాలు వెల్లడయ్యే అవకాశాలున్నాయి.



బోగస్ కంపెనీ ఖాతాలున్న ముత్తుకూరు యాక్సిస్ బ్యాంక్ బ్రాంచ్

నేడు పెంచలస్వామి ఆరాధన మహోత్సవం

ఆత్మకూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేపూరు గ్రామ సమీపంలోని హనుమాన్ జంక్షన్ వద్ద ఆదివారం హనుమాన్‌భక్త పెంచల స్వామి ఆరాధన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు భాస్కర్ నాయుడు, పెంచల నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు సుప్రభాతసేవ, అంజనేయస్వామి అష్టోత్తర నామావళి, తీర ప్రసాద వినియోగం, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9435
వెండి కిలో ధర	రూ. 116400
వెండి ఒక గ్రాము	రూ. 119.40

శుభ్రతకు నోచుకోని ఓవర్‌హెడ్ ట్యాంకులు

● తాగునీరు కలుషితం ● పొంచి ఉన్న వ్యాధులు ● పట్టించుకోని అధికారులు

ఆత్మకూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులు శుభ్రతకు నోచుకోకపోవడం, ఇటీవల అడపా దడపా వర్షాలు కురుస్తుండడంతో తాగునీరు కలుషితమై వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 21 గ్రామ పంచాయతీలకు గాను కేవలం ఐదారు గ్రామాల్లో మాత్రమే నీటి ట్యాంకులను శుభ్రం చేస్తూ క్లోరినేషన్ చేసిన తాగునీటిని సరఫరా చేస్తున్నారని సాక్షాత్తు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో చెప్పడం ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో 130 పంచాయతీల్లో మూడు సీపీడబ్ల్యుఎస్, 187 పీడబ్ల్యుఎస్, 91 ఎంపీడబ్ల్యుఎస్, 215 డీపీలకు పైబడి ఉన్నాయి. పీడబ్ల్యుఎస్ పథకాలకు సంబంధించిన నిర్వహణను గ్రామ పంచాయతీలకు, సీపీడబ్ల్యుఎస్ పథకాల నిర్వహణను ఆర్థికసంఘం నిధులతో ట్యాంకుల నిర్వహణ చేపడుతున్నారు. కాగా, నిధుల కొరత వెంటాడుతుండంతో పాటు పలు చోట్ల ఓవర్‌హెడ్ ట్యాంకులకు నిచ్చెనలు లేకపోవడంతో శుభ్రతకు నోచుకోవడం లేదు. నెలలో రెండు సార్లు ట్యాంకులు శుభ్రం చేయాల్సి ఉంటుంది. బ్లీచింగ్, సున్నంతో శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలి. మైనర్ పంచాయతీల్లో ఒక్కో ట్యాంకు ఒక్కసారి శుభ్రం చేసేందుకు రూ.500 నుంచి రూ.1000, మేజర్ పంచాయతీల్లో రూ.1000 నుంచి రూ.1500 వరకు ఖర్చు చేస్తున్నట్లు లెక్కల ద్వారా తేటతెల్లమవుతోంది. అయితే నియోజకవర్గంలోని ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్ పేట, చేజర్ల, సంగం, మర్రిపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో తాగునీటి వాటర్‌ట్యాంకులు శుభ్రతకు నోచుకోవడం లేదు. దీంతో కలుషితనీరు సరఫరా కావడంతో వ్యాధులు ప్రబలుతున్నాయని, ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వాటర్‌ట్యాంకుల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి రక్షిత మంచినీటిని అందించి వ్యాధుల బారి నుంచి కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.



శుభ్రతకు నోచుకోని వాటర్‌ట్యాంకు



రూ.54 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు మంజూరు

● ఎన్ రవిశంకర్‌రెడ్డి, ఏపీఎం

సంగం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి మండలంలో 731 పొదుపు సంఘాలకు (ఎస్‌హెచ్‌జీ) రూ. 54 కోట్ల మేర బ్యాంక్ లింకేజీ రుణాలు లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని డీఆర్‌డీఏ (వెలుగు) ఏపీఎం రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు.

ఇంటర్వ్యూ

? ఇప్పటి వరకు ఎన్ని ఎస్‌హెచ్‌జీలకు ఎన్ని కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు ఇప్పించారు.

! మండలంలో 73 పొదుపు సంఘాలకు రూ. 9.59 కోట్ల బ్యాంక్ లింకేజి కింద రుణాలు మంజూరు చేయడం జరిగింది.

? స్త్రీనిధి పథకంలో రుణ లక్ష్యం ఎంత, సభ్యులు ఎంత మంది. ఇప్పటి వరకు ఎంత మందికి రుణం ఇచ్చారు.

! ఈ పథకంలో 892 మందికి రూ. 8.92 కోట్ల మేర రుణ లక్ష్యం నిర్దేశించారు. ఇప్పటి వరకు 153 మందికి రూ. 1.08 కోట్ల మేర రుణం అందచేశాం.

? ఈ పథకంలో ఒక్కొక్క సభ్యురాలికి ఎంత రుణం ఇస్తారు. మొత్తం సంఘానికి రుణమెంత.

! ఒక్కొక్కరికి రూ. 50 వేల చొప్పున సంఘం మొత్తానికి రూ. 5 లక్షలు మంజూరు చేస్తాం.

చిలకలమర్రిలో కార్గిల్ విజయ్ దివాస్



కార్గిల్ విజయ్ దివాస్‌లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

అనంతసాగరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలమర్రి ఉన్నత పాఠశాల్లో శనివారం కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. కార్గిల్ యుద్ధ విజయం సాధించి 26 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విద్యార్థులు జాతీయ జెండాలతో కార్యక్రమంలో పాల్గొన్నారు. అమరవీరులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

మాజీ సైనికుడికి సన్మానం



మాజీ సైనికుడు షేక్ సుభానీని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ఉదయగిరి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా పట్టణంలోని అగ్రహారం వీధికి చెందిన మాజీ సైనికుడు షేక్ సుభానీని శనివారం బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు సన్మానించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ కార్గిల్ యుద్ధం జరిగి 26 ఏళ్లు పూర్తయిందని, ఎందరో సైనికుల త్యాగాల ఫలితం కారణంగా కార్గిల్ యుద్ధం విజయవంతమైందన్నారు. అందులో అశువులు బాసిన సైనికులకు ప్రతిఒక్కరూ నివాళులర్పించి వారి సేవలను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సాగర్ సేవా సమితి అధ్యక్షుడు ఎండీ మన్సూర్‌అలీ, బీజేపీ నాయకులు ఆవుల రోశయ్య యాదవ్, చల్లా సుబ్బరత్నం, దుగ్గయ్య, మస్తాన్, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎన్‌ఎంయూఏ ఉద్యోగుల నిరసన



డిపో ఎదుట నిరసన తెలియచేస్తున్న ఉద్యోగులు

ఉదయగిరి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం ఎన్‌ఎంయూఏ ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈసందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ గవర్నర్‌పేట-1, విజయవాడ పాత బస్టాండ్ స్థలాలు ప్రైవేటు సంస్థకు అప్పగించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వెంటనే విరమించుకోవాలని, లేకపోతే నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ నాయకులు శంకర్, నాగరాజు, కాశీవిశ్వనాథ్, సురేష్, సిద్ధయ్య, ఆర్‌ఎస్‌రెడ్డి, రమణయ్య, సుజాత, వెంగమ్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్, ఈఎస్‌ఐ కోసం కార్మికుల ధర్నా



ఫ్యాక్టరీ ముందు ధర్నా చేస్తున్న కార్మికులు

వింజమూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రపడియ గ్రామంలో ఉన్న చిరాన్ ఫ్యాక్టరీలోని కార్మికులు తమకు పీఎఫ్, ఈఎస్‌ఐ ఇప్పించాలని శనివారం ధర్నాచేశారు. కొంతకాలంగా తమకు పీఎఫ్, ఈఎస్‌ఐ అందడంలేదని, నమోదు కూడా కాంట్రాక్టులు చేయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చిరాన్ మేనేజర్ కార్మికులకు దగ్గరకు వచ్చి సమస్యలు పరిష్కరిస్తానని చెప్పడంతో కొంతమంది కార్మికులు పనికి వెళ్లారు. మరికొందరు సమస్యలు పరిష్కరించాకే పనిలోకి వస్తామని తేల్చిచెప్పారు. అధికారులు స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కార్మికులు కోరారు

ప్రమాదకరంగా సోమశిల రహదారి



రోడ్డుపై ఏర్పడిన గుంత

అనంతసాగరం జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తుకూరు వద్ద సోమశిల రహదారి గుంతలమయమై ప్రమాదకరంగా మారినా పట్టించుకునే నాథుడే లేడని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు పడడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించి ప్రమాదాలు నివారించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

గిరిజన పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



తరుణవాయి ఎస్టీ కాలనీలో బడి బయట ఉన్న పిల్లలతో మాట్లాడుతున్న ఐటీడీఏ ఏఎంవో శాంతకుమారి

సంగం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గిరిజన పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఐటీడీఏ ఏఎంవో శాంతకుమారి సూచించారు. శనివారం ఆమె మండలంలోని తరుణవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలో జరుగుతున్న రెండవ విడత నాడు-నేడు పనులను పరిశీలించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులతో కలిసి స్థానిక ఎస్టీ కాలనీలలో పర్యటించి బడిఈడు పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. 14 ఏళ్ల లోపు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో సుమారు 2వేల మంది గిరిజన పిల్లలు బడి బయట ఉన్నట్లు గుర్తించామని, వారిని బడిలో చేర్చేందుకు వారి తల్లిదండ్రులు, స్థానిక గ్రామ పెద్దలతో మాట్లాడుతున్నామన్నారు. గిరిజన పిల్లల చదువులకు ప్రభుత్వం అనేక అవకాశాలు కల్పిస్తోందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాల పూర్తికి చర్యలు : ఏఈ



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో నాగేశ్వరప్రసాద్

మర్రిపాడు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీపీ లక్ష్మీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గృహనిర్మాణ శాఖ ఏఇ రవి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ మండలంలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ. 8.75 కోట్లు రైతుల ఖాతాలో జమ అయినట్లు తెలిపారు. పలు శాఖల అధికారులు ప్రగతి నివేదికను సమావేశంలో వివరించారు. ప్రతీ సచివాలయంలో రైతులకు జనుములు, జీలుగలు అందేలా చూడాలని ఏపిలగుంట ఎంపీటీసీ హజరత్‌రెడ్డి అధికారులను కోరారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వరప్రసాద్, తహసీల్దారు అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పొదుపు మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం



స్టాళ్లను పరిశీలిస్తున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు

ఆత్మకూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళల ఆర్థిక స్వావలంభనే లక్ష్యంగా ప్రతినెలా ఆత్మకూరు పట్టణంలో మెప్మా అర్బన్ మార్కెట్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, మెప్మా సీవో మాధవి తెలిపారు. శనివారం పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో పొదుపు మహిళలు సొంతంగా తయారుచేసిన బ్యాగులు, చెట్నీలు, మహిళా దుస్తులు, స్వీట్ స్టాల్స్‌ను వారు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రుణాలను రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచారన్నారు. పొదుపు గ్రూపు మహిళలను ఆర్థికంగా ప్రోత్సహించి మరింత ఆదాయం పొందేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. పొదుపు మహిళలు సృజనాత్మకంగా జూట్ బ్యాగులతో పాటు ఇతర వస్తువులు తయారుచేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, మున్సిపల్ కౌన్సిలర్లు నూరా భాస్కర్‌రెడ్డి, పొడమేకల పెంచలయ్య, షేక్ మహబూబ్‌బాష, మెప్మా ఆర్పీలు, టీఎల్‌ఎఫ్ వోబీలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలి : ఎంపీడీవో



తడిచెత్త, పొడి చెత్తపై ప్రజలకుఅవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో సాయి ప్రసాద్

సీతారామపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బసినేనిపల్లి గ్రామంలోని సచివాలయాన్ని ఎంపీడీవో సాయిప్రసాద్ శనివారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా బసినేనిపల్లి గ్రామంలో పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తడిచెత్త, పొడిచెత్త, ఐవి ఆర్‌ఎస్ కాల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలని, వాతావరణ కాలుష్యం నివారించుటకు వ్యర్థాల నిర్వహణలో భాగస్వాములు కావాలన్నారు. గ్రామ ప్రజలు చెత్తను రోడ్లమీద, బహిరంగ డ్రైనేజిలో వేయరాదని, అతిక్రమించిన వారికి గ్రామ పంచాయతీచే జరిమానా విధించబడుతుందన్నారు. ఇంటిలోని చెత్తను తడిచెత్త, పొడిచెత్తగా గ్రీన్ అంబాసిడర్‌లకు అందజేయాలని ప్రజలకు సూచించారు.

సూపర్ సిక్స్ పేరుతో మోసం

కలువాయి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పేరుతో ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని వైసీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి విమర్శించారు. కలువాయిలో శనివారం ఆయన బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో జడ్పీటీసీ బి అనిల్‌కుమార్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ ఎం కృష్ణారెడ్డి, ఎంపీపీ ఆర్ లక్ష్మీదేవి, సర్పంచు పెంచలమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ మండల కన్వీనర్‌గా కొండా

ఉదయగిరి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండల వైసీపీ కన్వీనర్‌గా మండలంలోని బండగానిపల్లి పంచాయతీ కృష్ణారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొండా రాజగోపాల్‌రెడ్డి నియమితులయ్యారు. ఈసందర్భంగా శనివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో మండలంలోని పలువురు నాయకులు కొండాకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు అక్కి. భాస్కర్‌రెడ్డి, సయ్యద్ గౌస్ మొహిద్దీన్, నారపరెడ్డి, సలీం, బాబు, ఇత్తడి రమణ, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఉర్దూ పాఠశాల తనిఖీ



పాఠశాలలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఉప తనిఖీ అధికారి ఖాజామొహిద్దీన్

సంగం, జూలై 26 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని జండాదిబ్బ యాకసిర మఠంలో ఉన్న ఉర్దూ పాఠశాలను జిల్లా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఖాజా మొహిద్దీన్ శనివారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థుల హాజరు, రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు జేశారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సొసైటీ పర్సన్ ఇన్‌చార్జికి ఘన సన్మానం



శ్రీనివాసులరెడ్డిని సన్మానిస్తున్న సీఈవో, టీడీపీ నాయకులు

ఉదయగిరి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొట్టాలపల్లి ప్రాథమిక సహకార పరపతి సంఘ కార్యాలయ పర్సన్ ఇన్‌చార్జి శ్రీనివాసులరెడ్డిని సీఈవో రేకలగుంట పోలయ్య ఆధ్వర్యంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, ఉద్యోగులు, టీడీపీ నాయకులు శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4 కార్యక్రమంలో భాగంగా జిల్లా సహకార శాఖ అధికారి గురప్ప, కావలి డివిజన్ అధికారి రాజశేఖర్ సూచన మేరకు సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి శ్రీనివాసులరెడ్డి స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన భవానీ కుటుంబాన్ని దత్తత తీసుకోవడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు నరసింహులు, నాగయ్య, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి

ఉదయగిరి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి విద్యార్థులకు విద్యాబోధన చేయాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి సూచించారు. శనివారం పట్టణంలోని ఎన్‌బీ పాఠశాలను ఆయన సందర్శించారు. తరగతుల వారీగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. సకాలంలో సిలబస్ పూర్తి చేయాలన్నారు. అనంతరం సంబంధిత రిజిస్టర్లను తనిఖీచేసి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం అందాలంటే

లింకు తప్పనిసరి

● 6,900 కుటుంబాలు అనర్హతకు గురయ్యే అవకాశం : డీఏవో

నెల్లూరు(వ్యవసాయం), జూలై 26 (ఆంధ్రజ్యోతి): రైతు కుటుంబాలకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయం అందాలంటే అర్హులయిన రైతులందరి బ్యాంకు ఖాతాకు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ) లింకు తప్పనిసరని జిల్లా వ్యవసాయాధికారి పీ.సత్యవాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 1,98,514 రైతు కుటుంబాలు ఈ పథకానికి అర్హత పొందాయని, అందులో 6,900 కుటుంబాలు అనర్హతకు గురయ్యే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు. ఎన్‌పీసీఐ ఇన్‌యాక్టివ్ కారణంగా 4,385 కుటుంబాలు, అలాగే ఎన్‌పీసీఐకి అసలు లింకు కాకుండా మరో 2,515 కుటుంబాలు ఉన్నాయని వివరించారు. ఈజాబితాలు మొత్తం రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రైతులు పరిశీలించుకుని బ్యాంకులకు వెళ్లి ఎన్‌పీసీఐ యాక్టివేషన్, లింకు చేసుకుంటేనే పథకం నిధులు బ్యాంకు ఖాతాలో జమవుతాయని స్పష్టం చేశారు. వివిధ కారణాలతో పథకానికి అనర్హత పొందిన రైతుల వివరాలను గ్రీవెన్స్ మాడ్యూల్లో పొందుపరచే కార్యక్రమం కూడా శుక్రవారం నిలిచిపోయిందని తెలిపారు. జిల్లాలో మొత్తం 2432దరఖాస్తులు గ్రీవెన్స్ మాడ్యూల్‌లో పొందుపరచి, మండల వ్యవసాయ అధికారి, మండల రెవెన్యూ అధికారి అనుమతితో ఆర్‌టీజీఎస్ పరిశీలనకు పంపుతామని పేర్కొన్నారు. అనంతరం పథకానికి అర్హతపొందే జాబితా వస్తుందని, ఇదంతా నిరంతర ప్రక్రియని తెలిపారు. అనర్హతకు గురైన రైతులు అందుకు గల కారణాలను తెలుసుకుని సరిచేసుకోవాలన్నారు. ఆధార్‌లో తప్పులు, డెత్ మ్యుటేషన్, బ్యాంకు లింకింగ్, ల్యాండ్ ఆధార్ లింకింగ్ ఇతర సమస్యలు సరిచేసుకుని సిద్ధంగా ఉంటే అన్నదాత సుఖీభవ పోర్టల్ తిరిగి ఓపెన్ కాగానే గ్రీవెన్స్ మాడ్యూల్‌లో తిరిగి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని ఆమె వివరించారు.

బదిలీ అయిన టీచర్లకు

వెంటనే జీతాలు చెల్లించాలి

● డీఈవో కార్యాలయం ఎదుట యూటీఎఫ్ నిరసన



డీఈవోకి వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘం నేతలు

నెల్లూరు(విద్య), జూలై 26 (ఆంధ్రజ్యోతి) : బదిలీ అయిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని యూటీఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. నగరంలోని డీఈవో కార్యాలయం ఎదుట శనివారం నిరసన ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు మాట్లాడుతూ బదిలీ అయిన వారికి త్వరగా జీతాలు చెల్లించాలన్నారు. అలాగే బోధనేతర పనుల నుంచి వారు వెంటనే రిలీవ్ అయ్యి వారివారి స్థానాల్లో చేరాలన్నారు. ప్రభుత్వం వారికి రెండు నెలలుగా జీతాలు చెల్లించకపోగా, ప్రాథమికోన్నత పాఠశాలలోని తెలుగు ఉపాధ్యాయుడిని ప్రాథమిక పాఠశాలకు మార్చడం, ప్రాథమిక పాఠశాలలోని హెచ్‌ఎంలను ప్రాథమికోన్నత పాఠశాలలకు మార్చడం వంటి అసంబద్ధమైన చర్యలు చేపట్టిందని విమర్శించారు. వీటన్నింటినీ వెంటనే సవరించి విద్యారంగాన్ని పరిరక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం డీఈవో బాలాజీరావుకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వీవీ.శేషులు, ప్రధాన కార్యదర్శి జీవీ.చలపతిశర్మ, రాష్ట్ర, జిల్లా నేతలు, తదితరులు పాల్గొన్నారు.


నేటి నుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

● పకడ్బందీగా ఏర్పాట్లు : డీఆర్వో

నెల్లూరు (హరనాథపురం) జూలై 26 (ఆంధ్రజ్యోతి) : నేటి (ఆదివారం) నుంచి ఆగస్టు ఒకటోతేదీ వరకు ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు డిపార్ట్‌మెంటల్ పరీక్షలు నిర్వహించనున్నామని, ఇందుకుగాను ఏర్పాట్లన్నీ పూర్తి చేశామని డీఆర్వో హుస్సేన్‌సాహెబ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని డీఆర్‌వో చాంబర్‌లో పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో డీఆర్వో సమావేశం నిర్వహించారు. పొట్టెపాలెంలోని అయాన్ డిజిటల్‌జోన్ కేంద్రంలో నిర్వహించే ఈ పరీక్షలు ఉదయం 10 నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్స్‌లో నిర్వహిస్తామన్నారు. కంప్యూటర్ ఆధారితంగా నిర్వహించే ఈ పరీక్షలకు విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో పరీక్షల లైజన్ అధికారి ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

ఆకాశంలో మబ్బులు.. రాలని చినుకులు

● వర్షం కోసం రైతుల ఎదురుచూపు



ఉదయగిరి దుర్గాన్ని కమ్మేసిన కారుమబ్బులు

ఉదయగిరి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గతం వారం రోజులుగా ఆకాశంలో కారుమబ్బులు కమ్ముతున్నా చినుకు రాలడంలేదు. కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు కురిసినా ప్రయోజనం శూన్యం. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా సరైన వర్షం కురవలేదు. పంట సాగు చేసిన, సాగుకు భూమిని సిద్ధం చేసిన రైతులు వర్షం కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. కొన్ని పంటలు వాడుముఖం పడుతున్నాయి. మరో వారం రోజుల్లో వరుణుడు కరుణించకపోతే ఖరీఫ్ సీజన్ పంటల సాగు అదును దాటుతోందని రైతులు వాపోతున్నారు.

పొజిషన్ సర్టిఫికెట్లు అందజేస్తాం!

(5వ పేజీ తరువాయి)

పోరాటం ఎప్పటికీ మరిచిపోలేని ఘటన అని, దేశ సైనికుల పోరాటపటిమను యావత్ భారతదేశం ఒకే మాట ఒకేబాటగా గుర్తించిన సమయమని అన్నారు. తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశాన్ని కాపాడిన సైనికుల త్యాగం చిరస్మరణీయమంటూ కొనియాడారు. వారి త్యాగనిరతిని భర్తీ చేయడం అసాధ్యమైనప్పటికీ వారి కుటుంబాలకు జిల్లా యంత్రాంగం ఎప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. కార్గిల్ పోరాటం జరిగినప్పుడు తాను ఎనిమిదేళ్ల వయసులో ఉన్నానని, ప్రతిరోజు యుద్ధవార్తల గురించి ఆసక్తిగా పత్రికలు చూసేవాడినని కలెక్టర్ గుర్తు చేసుకున్నారు. భారతదేశ సైనికుల పోరాటపటిమను నేటితరానికి కూడా తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకుగాను పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహించి వారిలో స్ఫూర్తిని రగిలించాలని అధికారులను ఆదేశించారు. మాజీ సైనికుల కోరిక మేరకు నెల్లూరులో అమరవీరుల స్థూపం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన 20 మంది కార్గిల్ పోరాట వీరులను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కార్తీక్‌లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి హరికృష్ణ, మాజీ సైనికులు శ్యాంప్రసాద్, కృష్ణారెడ్డి, తదితరులతోపాటు వివిధ పాఠశాలల ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	134
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	264

కోడిగుడ్ల ధర (100): 475

మినరల్ వాటర్‌ప్లాంట్ పునఃప్రారంభం

జలదంకి, జూలై 26(ఆంధ్రజ్యోతి): కావలి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత వంటేరు వేణుగోపాల్‌రెడ్డి దాతృత్వంతో వరదారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని బీకే అగ్రహారంలో రూ.3లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటును శనివారం సర్పంచు ఇండ్ల సుధాకర్, ఉపసర్పంచు దగుమాటి మాల్యాద్రిరెడ్డిలు పునఃప్రారంభించారు. ఈ ప్లాంటు గత కొంతకాలంగా నిరుపయోగంగా ఉండగా వంటేరు తన ట్రస్ట్ ద్వారా మరమ్మతులు చేయించారు. ట్రస్ట్ సభ్యులు వంటేరు నంద గోపాల్‌రెడ్డి, జిలుమూడి వినయ్‌కుమార్‌రెడ్డి, జిలుమూడి వేణుగోపాల్ రెడ్డి, మేకల్ శ్రీనాథ్‌రెడ్డి, కాకర్ల కృష్ణారెడ్డిలు గ్రామస్థులకు మమచినీటి క్యాన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిత్తాబత్తిన మస్తాన్‌రెడ్డి, లింగంగుంట వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకుడు చల్లా హనుమారెడ్డి, పంచాయతీ కార్యదర్శి నీరజ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

లింగసముద్రంలో ఆగిన ఆధార్ సేవలు



సచివాలయంలో నిరుపయోగంగా ఉన్న కంప్యూటర్, ఇతర పరికరాలు

లింగసముద్రం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : లింగసముద్రం సచివాలయం-1లో ఆధార్ సేవలు నిలిచి పోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సచివాలయంలో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంటు వారం రోజుల క్రితం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కొత్తగా ఎవరినీ నియమించలేదు. ఈ క్రమంలో కొత్తగా ఆధార్‌కార్డులు, మార్పులు, చేర్పులు తదితర సేవలు పొందేందుకు ప్రజలు వలేటివారిపాలెం, కందుకూరుకు పరుగులు తీయ్యాల్సి వస్తోంది. ఈ విషయమై ఎంపీడీవో కే.శ్రీనివాసులును వివరణ కోరగా వచ్చే సోమవారం డిజిటల్ అసిస్టెంటు రావచ్చని, ఆ తరువాత రెండు రోజుల్లో ఆధార్ కేంద్రం ప్రజలకు అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రస్తుతం మండలంలోని చినపవని సచివాలయంలో ఆధార్ కేంద్రం పని చేస్తుందని, ప్రజలు అక్కడ ఆధార్ సేవలు పొందవచ్చని చెప్పారు.

మాలకొండ ఆదాయం రూ.12,33,850

వలేటివారిపాలెం, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనృసింహ స్వామి ఆలయానికి శనివారం భక్తుల నుంచి రూ.12,33,850 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్‌లకు రూ.7,500, కుంకుమార్చనకు రూ.20,360, వివాహముల ద్వారా రూ.4 వేలు, తలనీలాలకు రూ.46,100, వాహనపూజలకు రూ.4,120, ప్రత్యేకదర్శనం టికెట్లకు రూ.2,81,400, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ.720, రూము అద్దెలు రూ.29,700, కవర్లు విక్రయంతో రూ.11,535, లడ్డూప్రసాదంకు రూ.2,60,690, అన్నదానానికి రూ.3,67,725, విరాళముల రూ.2 లక్షలు వచ్చినట్లు పేర్కొన్నారు.

గిరిజన మహిళలపై అక్రమ కేసులు అన్యాయం

ఉలవపాడు, జూలై 26(ఆంధ్రజ్యోతి): కరేడు శివారులోని రామకృష్ణాపురం ఎస్టీ కాలనీ మహిళలపై పెట్టిన అక్రమ కేసులను ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, కందుకూరు వైసీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్‌లు శనివారం వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు. కరేడు భూములు బలవంతగా సేకరించేందుకు, ఎస్సీ, ఎస్టీ గ్రామాలను తరలించేందు స్థానిక నాయకుడి కుట్రలో భాగమే గిరిజన మహిళలపై పెట్టిన అక్రమ కేసులని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం బాధిత మహిళలకు అండగా ఉంటుందని, న్యాయం జరిగేవరకు పోరాడుతుందని తెలిపారు. అదేవిధంగా అక్రమంగా ఎస్టీ మహిళలపై పెట్టిన కేసులను విచారించి తప్పుడు కేసులు పెట్టించిన అసలైన నిందితులపై చర్యలు తీసుకోవాలని ఏపీసీసీ మెంబర్ సుంకర పద్మశ్రీ జాతీయ ఎస్టీ కమిషన్‌కు లేఖ రాసినట్లు చెప్పారు.

నేడు కరేడుకు రామచంద్ర యాదవ్ రాక

ఉలవపాడు, జూలై 26(ఆంధ్రజ్యోతి): బీసీవై పార్టీ వ్యవస్థాపకుడు బోడే రామచంద్ర యాదవ్ ఆదివారం కరేడులో పర్యటించనున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన మహిళలపై అక్రమ కేసులు బనాయించి బయపెట్టి భూములు లాక్కోవాలని చూడటం ప్రభుత్వ పెద్దలు, స్థానిక ఎమ్మెల్యే అమాయకత్వానికి నిదర్శనమి పేర్కొన్నారు. కరేడు రైతుల బలవంతపు భూసేకరణలో రైతులకు అండగా, గిరిజన మహిళలపై పెట్టిన అక్రమ కేసులపై న్యాయపోరాటం చేస్తానని, కార్యచరణ ప్రణాళిక కోసం ఆదివారం కరేడు రైతులను కలవబోతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రైవేటు సిబ్బందికి పన్నుల నగదు చెల్లించవద్దు

బిట్రగుంట, జూలై 26(ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ కార్యాలయంలో పని చేస్తున్న ప్రైవేటు సిబ్బందికి ఇంటి పన్ను, ఇతర లావాదేవీలకు సంబంధించిన నగదు ప్రజలు చెల్లించవద్దని పంచాయతీ కార్యదర్శి అబ్దుల్‌జహీర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల ఇంటి పన్నుల వసూలు, బిల్లుల విషయంలో ప్రైవేట్ సిబ్బంది వలన తప్పులు జరిగాయన్నారు. ప్రజలు పన్నులు చెల్లింపు విషయంలో ఎటువంటి ఇబ్బందులు పడకుండా కార్యాలయ బిల్ కలెక్టర్‌కు నేరుగా చెల్లించి రసీదు పొందాలన్నారు. ప్రైవేటు సిబ్బందికి నగదు చెల్లిస్తే కార్యదర్శి బాధ్యుడు కాదన్నారు.

ఈ-పంట నమోదుపై నిర్లక్ష్యం!

- వ్యవసాయశాఖ అధికారులను ప్రశ్నిస్తున్న రైతాంగం
- కావలి కాలువ కింద 50 వేల ఎకరాలకు పైగా వరి సాగు
- రెండు మాసాలు కావస్తున్నా పట్టించుకోని సిబ్బంది
- మద్దతు ధర, ప్రభుత్వం కొనుగోలు, బీమాకు ఈ-క్రాప్ ప్రామాణికం



జలదంకిలో బ్రాహ్మణక్రాక మేజర్ కాలువ కింద సాగులో ఉన్న ఎడగారు వరిపైరు

జలదంకి, జూలై 26(ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేసిన రైతులకు ప్రభుత్వం ప్రకటించే మద్దతు ధర రావాలన్నా.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయాలన్నా, పంటలకు బీమా చేయాలన్నా.. అన్నింటికీ ప్రామాణికం ఈ-పంట నమోదు. అయితే దీనిని వ్యవసాయ అధికారులు ఏ సీజన్‌కు ఆ సీజన్‌లో నమోదు చేసి రైతులకు ఆయా ప్రయోజనాలు కల్పించాల్సి ఉంది. కానీ సోమశిల జలాశయం పరిధిలోని కావలి కాలువ ఆయకట్టులో బ్రాహ్మణక్రాక మేజర్ 8వ నెంబరు కుడికాలువ కింద జలదంకిలో వరి పంట సాగు చేసి రెండు నెలలు పూర్తయినా ఇంకా ఈ-పంట నమోదు జరగలేదు. మరో రెండుమాసాల్లో కోతకు వచ్చి రైతుకు దిగుబడి వస్తుంది. అయితే వ్యవసాయశాఖ ఈక్రాప్ నమోదు చేయకపోవడంతో పంటబీమా చేయాలనుకున్నా చేయలేని పరిస్థితి. ఏదైనా ప్రకృతి వైపరీత్యం చోటుచేసుకుని పంట ధ్వంసం అయితే ఈ రైతుకు పంటల బీమా నష్టపరిహారం అందాలంటే ఈక్రాప్ తప్పనిసరి. కానీ నేటికీ వరిసాగుకు సంబంధించి పంటబీమా చేయాలనుకున్నా ఈ రైతు చేయలేని పరిస్థితి. ఏదైనా ప్రకృతి వైపరీత్యం సంభవించి పంటకు నష్టం వాటిల్లితే రైతు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం లేకపోలేదు. ఇంతటి ముఖ్య అవసరమైనటువంటి ఈపంట నమోదు చేయడంలో వ్యవసాయశాఖ ఎందుకు మీనమేషాలు లెక్కిస్తుందో రైతులకు అర్థం కాని పరిస్థితి నెలకొంది.

● 50వేల ఎకరాల్లో వరిసాగు

ఈ ఏడాది గతంలో ఎన్నడూ లేనివిధంగా సోమశిల జలాశయం పరిధిలోని కావలి కాలువ పూర్తి ఆయకట్టుకు రెండో పంటకు సాగునీరు కేటాయింపులు జరిగాయి. దీంతో జిల్లాలో ఒక్క వరిసాగునే 50 వేల ఎకరాలు చేపట్టారు. మిగిలిన వేరుశనగ, పత్తి లాంటి పంటలు మరో 10వేల ఎకరాలు సాగులో ఉంది. ఇలా 60వేల ఎకరాలు సాగులో ఉంది. వ్యవసాయ అధికారులు పైరు వద్దకు వెళ్లి రైతును పైరు వద్ద నిల్చోబెట్టి ఫొటో తీసి ఏ సర్వే నెంబరులో ఎంత విస్తీర్ణంలో ఏ పంట సాగు చేశాడో వ్యవసాయశాఖ యాప్‌లో డౌన్‌లోడ్ చేయాలి. అలా చేసిన వెంటనే రైతు సెల్‌ఫోన్‌కు ప్రత్యేక సంఖ్యతో కూడిన సందేశంతో ఈ పంట నమోదు కాబడినది అని తన సందేశం అందుతుంది. దీనిని భద్రపరుచుకుని రైతు పంటబీమా చేసుకోవడంతో పాటుగా దిగుబడి వచ్చిన పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలలో అమ్ముకుని సొమ్ము చేసుకోవడమే కాక మద్దతు ధర రైతుకు దక్కుతుంది. అంతేకాక ప్రకృతి వైపరీత్యం సంభవించినప్పుడు పంట బీమా చేసి ఉంటే నష్టపరిహారం బీమా సంస్థ నుంచి అందుతుంది. ఇంతటి ప్రయోజనాలు రైతుకు ఈపంట నమోదు మూలంగా అందుతాయి. అంతేకాక వివిధ రకాల వ్యవసాయశాఖ ద్వారా అందే రాయితీలు పొందాలన్నా ఈపంట నమోదు తప్పనిసరి. ఇంతటి ప్రయోజనం ఉన్న ఈ పంటనమోదు నేటికీ ఎందుకు వ్యవసాయశాఖ చేపట్టలేదో అర్థం కాని పరిస్థితి రైతులది. ఇప్పటికైనా వ్యవసాయశాఖ ద్వారా ఈ క్రాప్ చేపట్టే విధంగా జిల్లాకలెక్టర్ చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని జిల్లా రైతాంగం, రైతుసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఈ-క్రాప్ నమోదు చేస్తాం

రెండో పంట కింద ఈ ఏడాది సాగులో ఉన్న ప్రతి పంట ఈ క్రాఫ్ నమోదు చేస్తాం. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఈ క్రాఫ్‌కు సంబంధించి సాంకేతిక పరంగా అన్ని సిద్ధంగా ఉన్నాయి. కొన్నిచోట్ల రెండురోజుల నుంచి ఈ క్రాఫ్ బుకింగ్ ఆర్‌ఎస్‌కేల సిబ్బంది చేస్తున్నారు. రెండు మూడు రోజుల్లో అన్ని చోట్ల వీఏఏలు వచ్చి ఈ క్రాఫ్ బుకింగ్ చేస్తారు.

\- నాగరాజు, ఏడీఏ, కావలి

గర్భిణులు, బాలింతలకు అవగాహన



గర్భిణులకు ఐరన్‌సిరప్‌లు అందజేస్తున్న డాక్టర్ అక్బర్‌షా, రామ్‌సెంటర్ నిర్వాహకులు

కావలి, జూలై 26(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు మంచి పోషకాలు ఉన్న పౌష్టికాహారం తీసుకొని వ్యాధినిరోధక శక్తిని పెంచుకోవాలని డాక్టర్ అక్బర్‌షా తెలిపారు. డాక్టర్ రామ్‌సెంటర్, విశ్వోదయ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని కచ్చేరిమిట్ట 1, 2 అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే పోషకాహారాన్ని తీసుకుని వ్యాధి నిరోధకశక్తిని పెంచుకోవాలన్నారు. రక్తహీనత అధిగమించడానికి ఈ పౌష్టికాహారం ఎంతో దోహదపడుతుందన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు ఐరన్, పొలిక్, కాల్షియం సిరప్‌లు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ చిన్నారులకు విద్యాసామగ్రి అందచేశారు. ఈ కార్యక్రమంలో రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి, స్వచ్ఛందసంస్థ నిర్వహకులు రాయపాటి దిలీప్, బాబ్జి, ఏఎన్ఎం సుజాత, మహిళా పోలీస్ యశోద, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకోండి

● కరపత్రాలు ఆవిష్కరించిన వామపక్షాల నేతలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వామపక్ష నేతలు

కావలి(టౌన్), జూలై 26(ఆంధ్రజ్యోతి) : ఇళ్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించకుండా అడ్డుకోవాలని వామపక్ష పార్టీల నేతలు పేర్కొన్నారు. శనివారం సీపీఎం కార్యాలయంలో వామపక్ష పార్టీల నేతలు సమావేశమై స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకిస్తూ ముద్రించిన కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం సీపీఎం పట్టణ కార్యదర్శి పీ.పెంచలయ్య, సీపీఐ కార్యదర్శి నాగరాజు, సీపీఐఎంఎల్ నేత లక్ష్మారెడ్డిలు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి రూ.15,485 కోట్లు సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజల వద్ద వసూలు చేశారని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ అడుగుజాడల్లో రాష్ట్రప్రభుత్వం నడుస్తు ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలను దోచుకుంటున్నారన్నారు. ప్రజలు మేల్కొని అడ్డుకోకపోతే భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగా స్మార్ట్ మీటర్ల వల్ల జరిగే అనర్థాలు, నష్టాలను వివరించి ప్రజలను చైతన్యవంతం చేస్తామన్నారు.

సీపీఐ నియోజకవర్గ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం

కందుకూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గ సీపీఐ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గ మహాసభల ముగింపు సందర్భంగా కార్యదర్శిగా బీ.సురేష్‌బాబు, సహాయ కార్యదర్శిగా పీ.బాలకోటయ్య, కార్యవర్గసభ్యులుగా కే.మురళీకృష్ణ, వై.ఆనంద్‌మోహన్, ఎన్.రామారావు, సీహెచ్ దుర్గాప్రసాద్, ఎం.నరసయ్య, ఓలేటి కల్పన, డీ.ఆదినారాయణ, ఆహ్వానితులుగా మెండా శైలజలను ఎన్నుకున్నట్లు నాయకులు తెలిపారు.

పేదల వైద్యానికి ఆసరా సీఎంఆర్ఎఫ్

● ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి ● 96 మందికి రూ.71.66 లక్షల చెక్కుల పంపిణీ



చెక్కులు అందచేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, తదితరులు

కావలి, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవ వర్తించక సొంత నిధులు వెచ్చించి వైద్య చికిత్సలు చేయించుకున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఆసరాగా నిలుస్తోందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని సెల్ఫీ పాయింట్ వద్ద 100 అడుగుల జాతీయజెండా కింద శనివారం సాయంత్రం 96 మంది లబ్ధిదారులకు రూ.71,66,072 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యం బారినపడి పలు కార్పొరేట్ ఆసుపత్రులలో చికిత్స పొందిన అర్హులైన పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థికసహాయం అందించటంతో వారి జీవన ప్రమాణాలు మెరుగు పడతాయన్నారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో అత్యధికంగా కావలి నియోజకవర్గానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఇప్పటి వరకు 534 మంది లబ్ధిదారులకు రూ.5,11,84,072ల ఆర్థికసహాయం అందించామన్నారు. రాష్ట్రప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాత్రింబవళ్లు కష్టపడి పనిచేస్తున్నారన్నారు. ప్రజల సంక్షేమం కోసం, పేదప్రజల ఆరోగ్య సంరక్షణకు కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడు ప్రజల గుండెల్లో నిలిచి ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్‌బాబు, జ్యోతి బాబూరావు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, పోతుగంటి అలేఖ్య, బీద గిరిధర్, ఆవుల రామకృష్ణ, కండ్లగుంట మధు బాబు నాయుడు, మాలేపాటి నాగేశ్వరరావు, బండి శ్రీనివాసులు రెడ్డి, అల్లం హనుమంత రావు, కొండూరు పాలిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నియంత్రణే లక్ష్యం

● అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి ● వైద్య సిబ్బందికి అవగాహన



బిట్రగుంట : మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలి

కావలి(టౌన్)/బిట్రగుంట, జూలై 26(ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి నియంత్రణే లక్ష్యంగా అనుమానితులకు తప్పనిసరిగా కపం పరీక్షలు చేయించాలని అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి ఆదేశించారు. శనివారం స్థానిక ఏరియా వైద్యశాల సమావేశ మందిరంలో టీబీ ముక్తభారత్ అభియాన్ ఇంటెన్సిఫైడ్ టీబీ క్యాంపెయిన్ కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజిత ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. వెంగళరావునగర్, రాజీవ్‌నగర్, వైకుంఠపురం అర్బన్ హెల్త్ సెంటర్‌లను సందర్శించి సిబ్బందితో సమీక్షించి తగు సూచనలు ఇచ్చారు. అలాగే బోగోలు మండలం కోవూరుపల్లి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ల్యాబ్, రికార్డులు పరిశీలించారు. ఇంటింటి సర్వే, గర్భిణులు, కాన్పులు, మాతాశిశుసంరక్షణపై వైద్యులు జీ.హారిక, నిత్యప్రశాంతిలను అడిగి తెలుసుకున్నారు. విశ్వనాథరావుపేట-1లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని కోవూరుపల్లి వైద్యుడు రామకృష్ణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టీబీ రహిత సమాజ స్థాపనకు కృషి చేస్తున్నాయని, ఎవరికైనా క్షయ లక్షణాలు ఉన్నట్లు అనుమానాలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యపరీక్షలు చేయించాలన్నారు. క్షయ నిర్ధారణ అయితే ప్రభుత్వం అందించే ఉచిత మందులు వైద్యసేవలు అందించాలన్నారు. సంబంధిత నివేదికలు ప్రతి రోజు జిల్లా కేంద్రానికి పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా బాధితులకు రెడ్‌క్రాస్ అండ

● ఏరియా వైద్యశాలలో సదస్సు

కావలి, జూలై 26(ఆంధ్రజ్యోతి): తలసేమియా పీడిత బాధితులకు రెడ్‌క్రాస్ అండగా ఉంటుందని రెడ్‌క్రాస్ తలసేమియా డేకేర్ సెంటర్ వైద్యాధికారి పామూరు శ్రీధర్ తెలిపారు. కావలి ఏరియా వైద్యశాలలో శనివారం పట్టణంలోని అర్బన్‌హెల్త్‌సెంటర్, సూపర్ వైజర్లు, సిబ్బంది, ఏఎన్ఎంలు, సామాజిక ఆరోగ్య కార్యకర్తలకు తలసేమియా వ్యాధిని గుర్తించడంపై అవగాహన కల్పించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పీ.బ్రిజిత, అర్బన్ హెల్త్‌సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మేఘనాథ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ తలసేమియా పుట్టుకతో వచ్చే జన్యుపరమైన వ్యాధి అన్నారు. ఈ వ్యాధి ఉన్న పిల్లలకు బోన్మారో నుంచి రక్తం ఉత్పత్తికాదని, వారి ప్రాణాలు కాపాడాలంటే తరచూ రక్తం ఎక్కించాలన్నారు. సామాజిక, ఆరోగ్య అధికారులు, కార్యకర్తలు తమ పరిధిలో రక్తహీనత కలిగిన పిల్లలను గుర్తించి రెడ్‌క్రాస్‌కు సమాచారం ఇస్తే తాము వారికి వ్యాధి నిర్ధారక పరీక్షలు చేస్తామన్నారు. వ్యాధులు ఉన్న వారిని గుర్తించి ప్రతినెలా ఉచితంగా రక్తం ఎక్కించటంతో పాటు మందులు, పౌష్టికాహారం ఉచితంగా అందిస్తామన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి తలసేమియా చిన్నారులను ఆదుకునేందు విశేష కృషి చేస్తున్నారన్నారు. ఆమె స్ఫూర్తితో సామాజిక, ఆరోగ్య కార్యకర్తలు తమకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమం లో రెడ్‌క్రాస్ రక్తకేంద్రం కన్వీనర్ డాక్టర్ టీ.రమ్య, రెడ్‌క్రాస్ వైస్‌చైర్మన్ కే.హరి నారపరెడ్డి, రోటరీక్లబ్ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పాత కక్షల నేపథ్యంలో ఘర్షణ : ఇరువురిపై కేసు నమోదు

గుడ్లూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): పాతకక్షల నేపథ్యంలో ఘర్షణ పడి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటనలో ఇరువురిపై కేసులు నమోదయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. కావలిలో నివాసం ఉండే కూతల జీవన్‌కుమార్ ఉలవపాడు మండలం రామాయపట్నం జడ్పీ హైస్కూల్‌లో పీడీగా పనిచేస్తున్నారు. శుక్రవారం విధులకు హాజరైన ఆయన సాయంత్రం విధులు ముగించుకుని తన కారులో కావలికి బయలుదేరారు. గుడ్లూరు మండలం తెట్టు కుమ్మరపాలెం వద్దకు రాగానే తెట్టు నుంచి రామాయపట్నంకు బైక్‌పై వెళుతున్న మండలంలోని కర్లపాలెంకు చెందిన చాపల సాయిచంద్ కారుకు అడ్డంగా బైకును నిలిపి జీవన్‌కుమార్‌ను అడ్డగించి దుర్భాషలాడాడు. గతంలో కావలిలో వీరిద్దరి మధ్య జరిగిన వివాదం నేపథ్యంలో అనూహ్యంగా చోటు చేసుకున్న ఈ ఘటనలో ఇరువురు ఘర్షణ పడి ఒకరిపై ఒకరు రాళ్లు, కత్తితో దాడి చేసుకున్నారు. గమనించిన స్థానికులు ఇరువురికి నచ్చచెప్పి అడ్డుతీసి పంపించారు. ఈ దాడిలో గాయపడిన సాయిచంద్ కావలి ఏరియా వైద్యశాలలో, జీవన్‌కుమార్ ఉలవపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు. శనివారం పోలీసులకు పరస్పరం ఫిర్యాదు చేసుకోవడంతో కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట్రావు తెలిపారు.

ఆర్టీసీ స్థలాల ప్రైవేటీకరణపై ఆందోళన



ఆందోళన చేస్తున్న ఎన్ఎంయూ కార్మికులు

కావలి(టౌన్), జూలై 26(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా కోట్ల రూపాయలు విలువ చేసే ఆర్టీసీ స్థలాలు ప్రైవేటీకరణకు పూనుకోవడం దుర్మార్గమని ఆర్టీసీ ఎన్ఎంయూ నేతలు మండిపడ్డారు. ఈ మేరకు శనివారం డిపో వద్ద ఆందోళన చేశారు. విజయవాడ గవర్నర్‌పేటలోని ఆర్టీసీ డిపో-2కు సంబంధించిన విలువైన భూములు లూలూ మాల్ నిర్మాణానికి ధారాదత్తం చేయాలనుకోవడం సమంజసం కాదని, ఆర్టీసీ ప్రయోజనాలు, ప్రజా ప్రయోజనాలకే వినియోగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ స్థలాలు కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసుకుంటూ పోతే చివరకు ఆర్టీసీని కూడా ప్రైవేట్‌పరం చేస్తారేమోనన్న అనుమానాలు వ్యక్తం కలుగుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూ అధ్యక్షుడు పీవీ రావు, గ్యారేజ్ కార్యదర్శి ఎస్‌కె కలాం, నేతలు ఎం రవికుమార్, రీజినల్ ప్రచార కార్యదర్శి ఎస్‌కే మీరామొహిద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

కలిగిరి, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకొండూరులో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో శనివారం విగ్రహప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయంలో జరిగిన అభిషేకాలు, గ్రామోత్సవంలో పాల్గొన్నారు. భక్తులతో కలసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బిజ్జం కృష్ణారెడ్డి, బీవీ రామారావు, సర్పంచు మొక్కా సుజాత, ఉప సర్పంచు తోట మాల్యాద్రిరెడ్డి, మాజీ సర్పంచు మొక్కా హజరత్తరావు, తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఆర్‌లో మడ అడవుల సంరక్షణ దినోత్సవం



గాజు గ్లాసుల్లో పెంచిన వృక్ష రకాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్, ఆర్డీవో, ఎంవీఐ, అధ్యాపకులు

కందుకూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మడ అడవుల సంరక్షణ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ మాట్లాడుతూ మడ అడవుల సంరక్షణపై యునెస్కో చొరవతో ప్రపంచదేశాలు అనేక సంరక్షణ కార్యక్రమాలు చేపడుతున్నాయని, పౌరులుగా ఈ కార్యక్రమాలలో భాగస్వామ్యం కావాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టరు ఎస్.తిరుపతిస్వామి మాట్లాడుతూ ప్రకృతి విపత్తులైన సునామీ, తుఫాన్‌లు, వేగమైన గాలుల తీవ్రతను అడ్డుకోవటంలో మడ అడవులు కీలకపాత్ర పోషిస్తాయని, సుస్థిరాభివృద్ధిలో మడ అడవుల పాత్ర కీలకం కనుక ఈ అడవుల సంరక్షణకు కృషిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నాగలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థినీ విద్యార్థులు గాజుగ్లాసులలో సంరక్షించిన మడ అడవుల వృక్ష రకాలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ పీ. రాజగోపాల్‌బాబు, కోటపాటి నరేష్ రాజా, గడ్డం బ్రహ్మయ్య, ఇట్టా అనూష, బాలునాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగాపై శిక్షణ




విద్యార్థులకు యోగా శిక్షణ ఇస్తున్న శిక్షకుడు

జలదంకి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణక్రాకలో శ్రీవిద్యానికేతన్ పాఠశాలలో శని వారం సాయం త్రం విద్యార్థు లకు యోగాపై శిక్షణ ఇచ్చి అవగాహన క ల్పించారు. యోగా వల్ల మానవ జీవితంలో కలిగే లాభా లను వివరించారు. రోజువారీ కార్యక్రమాలలో యోగాను ఒక అంశంగా ఇప్పటి నుంచే చేర్చుకుని ఆరోగ్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకుని విద్యలో ఉన్నత శిఖరాలు అందిపుచ్చుకోవాలని పాఠశాల కరస్పాండెంట్ మారెళ్ల బ్రహ్మారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

కందుకూరులో 'కార్గిల్ విజయ్ దివస్'

కందుకూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): మేరా యువభారత్, శ్రీరామసాయి బాబా వెల్ఫేర్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక వివేకా జూనియర్ కాలేజీలో శనివారం కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా యువజన అధికారి ఏ.మహేంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలని, భారతదేశ సంస్కృతి సంప్రదాయాల గురించి అవగాహనతో దేశంకోసం ప్రతిపౌరుడు ఓ సైనికుడిలా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. 1999లో పాకిస్తాన్‌తో జరిగిన కార్గిల్ యుద్ధం విజయం ద్వారా దేశప్రతిష్ఠ ప్రపంచవ్యాప్తంగా పెరిగిన వైనాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో శ్రీవివేకా కళాశాల డైరెక్టర్లు జీ.బాల భాస్కరరావు, బీ.నరేంద్రబాబు, ఐఐటీ క్యాంపస్ ఇంచార్జి షాహుల్ హమీద్, శ్రీరామసాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు రవ్వా శ్రీనివాసులు, సీహెచ్ వెంకటనాగసాయి, పూర్ణతేజ తదితరులు పాల్గొన్నారు.





సాగులో 'డ్రోనాస్త్రం'

పైరుపై ఎగురుతుంటే గువ్వను తలపిస్తుంది. పనితీరు పరిశీలిస్తే విస్మయం కలిగిస్తుంది. అన్నదాతకు ఆసరాగా నిలుస్తోంది. వ్యవసాయాన్ని కొత్తపుంతలు తొక్కిస్తూ ఆలంబనగా ఉంటోంది. కూలీల కొరతకు పరిష్కారం చూపుతూ, పెట్టుబడి, దిగుబడుల్లోనూ చేదోడుగా రైతునేస్తంగా మారిన డ్రోన్‌పై కథనం..

- వివరాలు 6వ పేజీలో -

ఉవ్వెత్తున ఎగసిన 'గంగ'

ఒక్కసారిగా పది అడుగుల పైకి ఎగసిన నీటిని చూసి జనం భయకంపితుల య్యారు. ఏం జరిగిందో తెలియక గుండెలు అరచేతిలో పెట్టుకున్నారు. ఇళ్ల నుంచి పరుగులు తీశారు. శనివారం తిరుపతి మంగళం ప్రాంతంలో తెలుగు గంగ ఎయిర్ వాల్వ్ ఊడిపోవడంతో ఎదురైన పరిస్థితి ఇది. కాసేపటికి సాంకేతిక లోపాన్ని సరిచేయడంతో ఊపిరి పీల్చుకున్నారు.



తమిళ జాలర్ల దౌర్జన్యం

సముద్రంలో తమిళ జాలర్ల దౌర్జన్యాలు పెరిగి పోతున్నాయి. ఆంధ్రా సరిహద్దు భూ భాగంలోకి చొచ్చుకొచ్చి చేపలను వేటాడుతున్నారు. దీంతో 61 రోజుల చేపలవేట నిషేధం తర్వాత చేపలు పట్టేందుకు వెళుతున్న స్థానిక మత్స్యకారులు లబోదిబోమంటున్నారు.

\- కోట, ఆంధ్రజ్యోతి

ఆంధ్రా భూభాగంలోకి చొచ్చుకొచ్చి చేపలను వేటాడుతున్న వైనం

జీవనోపాధి కరువై గుండెలు బాదుకుంటున్న స్థానిక మత్స్యకారులు



గోవిందపల్లిపాళెం వద్ద చక్కర్లు కొడుతున్న తమిళ బోట్లు

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో వేలాది కుటుంబాల జాలర్లు చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్నారు. ముఖ్యంగా కోట, చిల్లకూరు, వాకాడు మండలాలకు చెందిన మత్స్యకారులు ఎక్కువగా ఉన్నారు. వీరు సాధారణ మోటరు బోట్ల సాయంతో చేపలను వేటాడుతున్నారు. అయితే ఇటీవల తమిళనాడుకు చెందిన జాలర్లు ఆధునిక మెకనైజ్డ్ బోట్ల సాయంతో ఆంధ్రా సరిహద్దు భూ భాగంలోకి చొచ్చుకొని వస్తున్నారు. ప్రధానంగా సముద్రతీరం నుంచి 8 నాటికల్ మైళ్ల మాత్రమే తమిళనాడు సరిహద్దు ఉంది. దాన్ని దాటి వారు చేపలను వేటాడుతున్నారు. వారి వద్ద అధునాతన వలలు ఉండడంతో ఒకసారి విసిరితే 10 నుంచి 20 టన్నుల చేపలు పడుతున్నాయి. స్థానిక జాలర్ల వలలకు కేజీల్లో మాత్రమే చేపలు పడుతున్నాయి. ఈ క్రమంలో చేపలను తమిళ జాలర్లు పట్టుకునిపోతుండడంతో ఆంధ్రా జాలర్ల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. 61 రోజుల చేపల వేట నిషేధం తర్వాత సముద్రంలోకి వెళ్లినా తమిళ జాలర్లు తమ కడుపు కొడుతున్నారని వాపోతున్నారు. ఈ విషయం పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఆవేదన చెందుతున్నారు. ఈ క్రమంలో తమకు ఉపాధి కరువవుతోందని, అధికారులు స్పందించి తమిళ జాలర్లను అడ్డుకోవాలని కోట మండలం గోవిందపల్లిపాళెం, శ్రీనివాససత్రం, చిల్లకూరు మండలం తమ్మినపట్నం, గుమళ్లదిబ్బ మత్స్యకార గ్రామాల ప్రజలు కోరుతున్నారు. లేకపోతే తమకు వలసవెళ్లడం తప్ప తమకు వేరే మార్గం లేదని అంటున్నారు.



సముద్రం ఒడ్డున తమిళ జాలర్లు




హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే

వెంకన్న దయతలిస్తే

టాప్‌లో కూర్చుంటా!

'కింగ్‌డమ్' వేడుకలో హీరో విజయ్ దేవరకొండ

తిరుపతి అర్బన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : తిరుమల ఏడుకొండలస్వామి నా పక్కన వుండి నడిపిస్తే పోయి టాప్‌లో కూర్చుంటానని యువ హీరో విజయ్ దేవరకొండ అన్నారు.ఆయన హీరోగా నటించిన 'కింగ్‌డమ్' సినిమా ట్రైలర్ రిలీజ్ కార్యక్రమం శనివారం రాత్రి తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్‌లో వైభవంగా జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ప్రతిసారిలాగే ఈ సినిమాకు కూడా ప్రాణంపెట్టి గట్టిగా పనిచేశాం. ఇక మిగిలింది ఆ వెంకన్నస్వామి దయ, మీ అందరి ఆశీస్సులు.ఈ రెండూ నా వెంటవుంటే నన్ను ఎవరూ ఆపలేరు,సినిమా విడుదల రోజైన 31న థియేటర్‌లో మిమ్మల్ని మళ్లీ కలుస్తా, అప్పటి వరకు బాగా చూసుకో స్వామీ, ఏడుకొండలవాడా గోవిందా గోవిందా' అని చిత్తూరు యాసలో మాట్లాడుతూ యువతను ఆకట్టుకున్నారు. హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే మాట్లాడుతూ 'తిరుపతి నాకు చాలా స్పెషల్, ఇక్కడికి వస్తేనే పాజిటివ్ ఫీలింగ్ వస్తుంది, చేసింది ఒక్క సినిమానే అయినా మీరంతా నామీద చూపిస్తున్న ప్రేమ మరువలేను' అన్నారు. చక్కటి టీం వర్క్‌తో పనిచేశామని, కింగ్‌డం సినిమా ఆద్యంతం అలరిస్తుందని చెప్పుకొచ్చారు.క్లాస్, మాస్ వాతావరణంలో జరిగిన ట్రైలర్ రిలీజ్ మధురానుభూతినిచ్చిందన్నారు.అంతకు ముందు మూవీ ట్రైలర్ రిలీజ్ చేయగానే కుర్రకారు లేచినిలబడి కేరింతలు కొడుతూ సందడి చేశారు.యువత ఉత్సాహం మితిమీరడంతో పోలీసులు రంగంలోకి దిగి అదుపుచేశారు.దర్శకుడు గౌతమ్‌తిన్ననూరి, సంగీత దర్శకుడు అనిరుధ్, నిర్మాత నాగవంశీ తదితరులు పాల్గొన్నారు. కాగా గతంలో గిరిజనులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన హీరో విజయ్ దేవరకొండను అరెస్టు చేయాలని గిరిజన సంఘాల జేఏసీ ప్రతినిధులు మైదానం వెలుపల ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు.



విజయ్ దేవరకొండ అభివాదం

తిరుమలలో చిరుత సంచారం

తిరుమల, జూలై26(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం చిరుత సంచారం కలకలం సృష్టించింది. తిరుమలలో స్థానికులు నివసించే బాలాజీనగర్‌కు సమీపంలోని బ్యాటరీ స్టేషన్ వద్ద శనివారం రాత్రి ఓ చిరుత వాహనదారుల కంటపడింది. దీంతో భయభ్రాంతులకు గురైన వారు సమీపంలోని విజిలెన్స్ సిబ్బందికి సమాచారమిచ్చారు. వారిద్వారా ఫారెస్ట్ అధికారులు విషయం తెలుసుకుని ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. అప్పటికే చిరుత అడవిలోకి వెళ్లిపోయింది. అయినప్పటికీ సమీపంలో చిరుత ఉంటే అడవిలోకి వెళ్లిపోయేలా సైరన్లు వేశారు. అలాగే వాహనదారులను, స్థానికులను అప్రమత్తం చేశారు.

నేటి నుంచి ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

● హాజరుకానున్న 3,654 మంది అభ్యర్థులు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం నుంచి ఆగస్టు ఒకటో తేదీ వరకు ఏపీపీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఆర్వో నరసింహులు తెలిపారు. దీనిపై కలెక్టరేట్‌లో శనివారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. డీఆర్వో మాట్లాడుతూ జూపార్కు రోడ్డులోని చెర్లోపల్లి వద్ద ఉన్న ఐయాన్ డిజిటల్ జోన్‌లో జరిగే ఈ పరీక్షలకు 3,654మంది అభ్యర్థులు హాజరవుతారని వెల్లడించారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలూ అనుమతించరని చెప్పారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యమూ లేకుండా మౌలిక వసతులు కల్పించాలని, పరీక్షల సమయాల్లో ఆర్టీసీ బస్సులు నడపాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు వెంకటరమణ, బీవీఎస్ శేఖర్ పాల్గొన్నారు.



డీఆర్వో నరసింహులు

తిరుమలలో సీఎస్

తిరుమల, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఏపీ చీఫ్ సెక్రటరీ విజయానంద్ శ్రీవారి దర్శనార్థం శనివారం రాత్రి తిరుమలకు వచ్చారు. గాయత్రి గెస్ట్ హౌస్ వద్ద స్వాగతం పలికి బస, దర్శన ఏర్పాట్లు చేశారు.

విద్యార్థినుల పట్ల పీఈటీ దాష్టీకం

● వైట్ యూనిఫాం ధరించలేదని 150 గుంజిళ్లు తీయించిన వైనం
● వాతలు పడేలా కర్రతో దాడి
● అస్వస్థతకు గురైన పలువురు విద్యార్థినులు



కాళ్లపై పీఈటీ కొట్టిన దెబ్బలను చూపుతున్న విద్యార్థినులు




విద్యార్థినులను ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

కోట,జూలై 26(ఆంధ్రజ్యోతి):వైట్ యూనిఫాం ధరించలేదని విద్యార్థునుల పట్ల వ్యాయామ ఉపాధ్యాయుడు దురుసుగా ప్రవర్తించారు. ఒక్కో విద్యార్థిని చేత 150 గుంజిళ్లు తీయించాడు. బూతులు తిడుతూ కర్రతో వాతలు తేలేలా చితకబాదాడు. ఈ విషయం బయటకు పొక్కనివ్వకుండా దాచినప్పటికీ పీఈటీ కొట్టిన దెబ్బలకు నొప్పులు తాళలేక విద్యార్థినులు విలపిస్తూ వార్డెన్‌కు చెప్పారు.ఇంతలో కొంతమంది విద్యార్థినులు అస్వస్థతకు గురవడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. కోట ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో ఎస్సీ బాలికల వసతిగృహంలో 160 మంది విద్యార్థినులు ఉన్నారు. వీరంతా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10 తరగతుల వరకు చదువుకుంటున్నారు. శనివారం ఉదయం రోజూలాగే గ్రీన్ యూనిఫారం ధరించి పాఠశాలకు వెళ్లారు. ప్రార్థన సమయంలో వైట్ యూనిఫాం వేసుకురాని విద్యార్థినులను వ్యాయామ ఉపాధ్యాయుడు సుభాన్ ప్రశ్నించారు. ఇప్పటివరకు హాస్టల్‌లో వైట్ యూనిఫారం ఇవ్వలేదని విద్యార్థినులు చెప్పడంతో కోపోద్రిక్తుడైన వ్యాయామ ఉపాధ్యాయుడు 60మంది హాస్టల్ విద్యార్థినుల చేత 150 గుంజిళ్లు తీయించాడు. అంతేకాకుండా కర్రతో ఆ విద్యార్థినులను కాళ్లమీద, వెనుక భాగంలో తీవ్రంగా కొట్టాడు. కన్నీటి పర్యంతమైన విద్యార్థినులు సాయంత్రం 5 గంటలకు హాస్టల్‌కు వెళ్లారు. రాత్రి అయ్యేసరికి పీఈటీ మాస్టర్ కొట్టిన దెబ్బలకు కాళ్లు, తొడలు వాచిపోయి నొప్పులు భరించలేక విద్యార్థినులు ఏడ్పులు మొదలుపెట్టారు. విచారించిన వార్డెన్ ఉషారాణి హెచ్ఎం భారతిని, పాఠశాలలోని ఉపాధ్యాయులను ప్రశ్నించినా సక్రమంగా సమాధానం చెప్పలేదు. విద్యార్థినులు వెక్కివెక్కి ఏడుస్తుండటంతో దళిత సంఘాల నాయకులు, టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జలీల్ అహ్మద్, సురేష్ హాస్టల్‌కు వెళ్లి విద్యార్థినులను విచారించారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను 108 వాహనంలో కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మిగిలిన విద్యార్థులకు వార్డెన్ ఉషారాణి ఆధ్వర్యంలో వసతి గృహంలోనే చికిత్స అందించారు. ఎంఈవో మస్తానయ్య హాస్టల్‌కు చేరుకుని విచారణ చేపట్టారు.

గజదాడులకు మరో రైతు బలి

● ఏనుగుల తిష్టతో బిక్కుబిక్కుమంటున్న గ్రామీణ జనం



రామకృష్ణమరాజు మృతదేహం

పుంగనూరు/సోమల, జూలై 26(ఆంధ్రజ్యోతి): మదపుటేనుగుల దాడిలో మరో రైతు ప్రాణాలు కోల్పోయాడు. పొలం వద్ద ఉన్న నీటి డ్రమ్ము ఇంటికి తెచ్చుకోవడానికి వెళ్లిన రైతుపై ఏనుగుల గుంపు దాడి చేసి హతమార్చిన సంఘటన శనివారం రాత్రి సోమల మండలంలో జరిగింది. ఆవులపల్లె పంచాయతీ కొత్తూరుకు చెందిన చెన్నూరి రామకృష్ణమరాజు అలియాస్ బాబు (46) గ్రామ సమీపంలోని పొలంలో టమోటా సాగు చేశాడు.మూడురోజులుగా ఆవులపల్లె పంచాయతీలో 16 ఏనుగుల గుంపు సంచరిస్తూ పంటలు ధ్వంసం చేస్తుండడంతో రైతులు త్వరగా పొలాల నుంచి ఇళ్లకు చేరుకుంటున్నారు.శుక్రవారం రాత్రి రామకృష్ణమరాజు పొలంలోని కొబ్బరిచెట్లతో పాటు టమోటా తోటలో ఏనుగులు సంచరించి తొక్కినాశనం చేశాయి. రామకృష్ణమరాజు పొలంలో పంటలకు క్రిమిసంహారక మందులు పిచికారి చేయడానికి ప్లాస్టిక్ డ్రమ్ము ఉంచాడు. ఏనుగులు తొక్కి నాశనం చేస్తాయోమోనని డ్రమ్మును ఇంటికి తీసుకురావడానికి రామకృష్ణమరాజు గ్రామానికి చెందిన సంజీవరాజు, రాజారెడ్డిలను తోడు పెట్టుకుని శనివారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లాడు. డ్రమ్ములో నీటిని కింద పోస్తుండగా ఏనుగుల గుంపు దాడి చేసి కిందపడేసి తొక్కి చంపేసింది. ఏనుగుల ఘీంకారాలను గుర్తించిన రాజారెడ్డి, సంజీవరాజు భయంతో హుటాహుటిన ద్విచక్రవాహనంలో గ్రామానికి చేరుకుని సమాచారం ఇచ్చారు. రామకృష్ణమరాజు కుటుంబీకులతో పాటు గ్రామస్తులంతా కలసి సంఘటనా స్థలానికి వెళ్లారు. రామకృష్ణమరాజు మృతదేహం వద్దే ఏనుగుల గుంపు తచ్చాడడం చూసి భయంతో వెనుదిరిగారు. రాత్రి 10 గంటల సమయంలో ఏనుగులు వెళ్లిపోవడంతో రామకృష్ణమరాజు మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు. రామకృష్ణమరాజు మృతితో ఆయన భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు తమకింక దిక్కెవరని రోదించడం చూసి గ్రామస్తులు కూడా కళ్లనీళ్ల పెట్టుకున్నారు.

తిరుమలలో హోంమంత్రి అనిత




పద్మావతీ అమ్మవారి ఆలయంలో హోంమంత్రి అనిత - శ్రీవారి ఆలయం వద్ద నిరోషా

తిరుమల శ్రీవారిని శనివారం రాష్ట్ర హోంమంత్రి అనిత దర్శించుకున్నారు. ఇంకా ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, సినీనటి నిరోషా, ఆస్ట్రేలియా కౌన్సిల్ జనరల్ శిలాయ్ జాకీ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. అంతకుముందు హోంమంత్రి అనిత శ్రీకాళహస్తీశ్వరుడిని, పద్మావతీ అమ్మవారిని దర్శించుకున్నారు. నిరోషా పరశురామేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ముక్కంటి ఆలయంలో పాము కలకలం

శ్రీకాళహస్తి, జూలై 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోకి పాము చొరబడటంతో కలకలం రేగింది. ఆలయంలో రూ.750 రాహుకేతు పూజా మండపం వద్ద శనివారం సాయంత్రం భారీ జెర్రిపోతు పూజా సామగ్రి మూటల వద్ద కనిపించింది. దీంతో భక్తులు ఉలిక్కిపడ్డారు. ఆలయాధికారులు అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించారు. అటవీ శాఖ ఉద్యోగి దాము ఆలయం వద్దకు చేరుకుని పామును పట్టుకుని కైలాసగిరి అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.



పామును పట్టుకుంటున్న దాము

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో ఓ షెడ్డులో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం : రూ.4.23 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,576

తలనీలాలు సమర్పించినవారు: 25,227





సాగులో 'డ్రోనాస్త్రం'

- అన్నదాతకు అన్నింటా వెన్నుదన్నుగా డ్రోన్
- 80శాతం సబ్సిడీతో అందజేస్తున్న ప్రభుత్వం
- వ్యవసాయంలో ఇప్పుడీ పరికరానిదే కీలకపాత్ర


వ్యవసాయంపై అన్నదాత పెదవి విరుస్తున్న క్రమంలో ఆధునిక సాంకేతికత ఓ తీయని కబురందించింది. ఎగిరే ఓ అద్భుత యంత్ర పరికరాన్ని రూపొందించి అండగా నిలిచింది. దీన్ని అందిపుచ్చుకుంటే సాగులో లాభాలు పొందవచ్చునని భరోసా ఇచ్చింది. కూలీలు దొరకలేదని, ఖర్చు పెరుగుతోందని డీలా పడుతున్న రైతులకు డ్రోన్ రూపంలో చేదోడువాదోడుగా ఉంటోంది.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి



డ్రోన్ ద్వారా మందు పిచికారీ చేస్తున్న రైతు

డ్రోన్ల ప్రవేశంతో వ్యవసాయం తీరు మారింది. నైరాశ్యంలో కొట్టుమిట్టాడే రైతన్నలకు ఇది కొండంత అండగా నిలిచింది. సాగులో ఎదుర్కొంటున్న పలు సమస్యలకు చక్కని పరిష్కారం చూపుతోంది. పదిమంది కూలీలు చేసే పనిని తానొక్కటే చేసి చూపిస్తూ అన్నదాతకు ఆసరా అవుతోంది. ఈ క్రమంలోనే వ్యవసాయ రంగాన్ని ఊపందించేందుకు డ్రోన్లను ప్రభుత్వం కారుచౌకగా అందిస్తోంది. రైతులు కూడా ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుంటున్నారు. ఫలితంగా జిల్లాలో డ్రోన్ల వినియోగం పెరుగుతోంది. పెట్టుబడి భారాన్ని తగ్గించుకుంటూ నాణ్యమైన ఉత్పత్తులను అందించడంలో సఫలీకృతమవుతున్నారు.



ఆగస్టు నుంచి మరిన్ని డ్రోన్లు

జిల్లాలో రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3.52 కోట్లు వెచ్చించి 36డ్రోన్లను పంపిణీ చేసింది. సబ్సిడీ కింద రూ.2.82కోట్లు చెల్లించింది. డ్రోన్ల వినియోగంపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన వచ్చింది. డ్రోన్లపై కొంతమంది రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఆగస్టు నుంచి మరిన్ని కేటాయించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాం.

- ప్రసాదరావు, జిల్లా వ్యవసాయాశాఖాధికారి



డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్



సమయం ఆదా అవుతోంది

ప్రభుత్వం సబ్సిడీపై డ్రోన్లను అందజేస్తుండటం శుభపరిణామం. నాకు 20 ఎకరాల పొలముంది. గతంలో ఎకరాకు 200లీటర్లు నీరు నింపి పవర్‌స్ప్రే ద్వారా రెండు గంటల పాటు మందు పిచికారీ చేయాల్సి వచ్చేది. డ్రోన్ ద్వారా ఎకరాకు 10 లీటర్ల పురుగుల మందును 8 నిమిషాల్లోనే స్ప్రే చేస్తున్నాం. సమయం ఆదాతో పాటు కూలీల కొరత కూడా తీరింది.

- మస్తాన్ బిలాల్, రైతు, కల్లూరు గ్రామం, డీవీసత్రం



సాగు ఖర్చు తగ్గింది

నాకు 60 ఎకరాల పొలం ఉంది. సంవత్సరంలో రెండుసార్లు పంట పండిస్తాం.డ్రోన్ సాయంతో సమయం ఆదా అవుతోంది. ఖర్చు కూడా తగ్గుతోంది. కొన్ని దీర్ఘకాలిక తెగుళ్లకు డ్రోన్‌తో పురుగుల మందు పిచికారీ చేయడంతో దిగుబడి పెరిగింది. కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

- చంద్రశేఖర్, రైతు, సత్యవేడు



అధిక దిగుబడి సాధిస్తున్నాం

మాకు 16 ఎకరాల పొలం ఉంది. ఇద్దరు వ్యక్తులు రోజుకు ఐదెకరాల్లో పురుగుల మందు పిచికారీ చేసేవారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో మాకు డ్రోన్లు ఇవ్వడంతో తక్కువ సయయంలోనే పిచికారీ చేస్తున్నాం. డ్రోన్‌తో స్ప్రే చేయడం వల్ల ప్రతి ఆకుపై నేరుగా మందు పడుతోంది. దీంతో అధిక దిగుబడి సాధిస్తున్నాం.

- ప్రేమ్‌కుమార్, రైతు, చిన్నకనపర్తి, తొట్టంబేడు మండలం.



సబ్సిడీ కింద రైతులకు డ్రోన్లు అందిస్తున్న గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

పిచికారీలో ప్రధాన పాత్ర

జిల్లాలో ప్రతి మండలానికీ 80శాతం రాయితీతో ప్రభుత్వం డ్రోన్లు మంజూరు చేసింది. తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, వెంకటగిరి, సత్యవేడు, సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల్లో వీటిని ఇప్పటికే అందజేసింది. మారుమూల గ్రామీణ ప్రాంత రైతులు సైతం ఇప్పుడు డ్రోన్ల సాయంతో సాగులో చకచకా దూసుకుపోతున్నారు. సమయం ఆదాతోపాటు పెట్టుబడీ తగ్గుతుండటంతో డ్రోన్ల వ్యవస్థపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

డ్రోన్ కావాలంటే ఇలా చేయాలి

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ రంగం నీరుగారింది. మందు పిచికారీ చేయాలంటే డ్రోన్‌ను అద్దెకు తీసుకోవాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం వచ్చాక డ్రోన్ల వ్యవస్థను బలోపేతం చేయాలని సంకల్పించింది. కనీసం ఐదుగురు రైతులు సంఘంగా ఏర్పడితే చాలు. పదవ తరగతి లేదా ఐటీఐ చదివి డీజీసీఏ నిబంధనల ప్రకారం పాస్‌పోర్టు ఉండాలి. గ్రూప్‌లోని ఒక రైతుకు డ్రోన్ వినియోగంపై 12రోజుల పాటు గుంటూరులో శిక్షణ ఇస్తారు. డ్రోన్ ఖరీదు రూ.9.80లక్షలు. ఇందులో రైతుల సంఘం రూ.2లక్షలు చెల్లిస్తే మిగతా రూ.7.84 లక్షలు బ్యాంకు రుణంగా సమకూర్తుంది. ఈ మొత్తాన్ని ప్రభుత్వం 80శాతం రాయితీ కింద 7.84లక్షలు రైతుల ఖాతాల్లో జమ చేస్తుంది.



వరి, మామిడిపై మందు పిచికారీ చేస్తున్న డ్రోన్

రైతులను పట్టించుకోవడం లేదు


- కాంగ్రెస్ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న తులసిరెడ్డి

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జూలై 26(ఆంధ్రజ్యోతి): రైతుల బాధలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, రాజ్యసభ మాజీ సభ్యుడు నర్రెడ్డి తులసిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని, మిర్చి, పొగాకు, మామిడి, చీనీ, పసుపు ఇలా ఏ పంటకూ గిట్టుబాటు ధర లభించడం లేదని అన్నారు. పంట కొనేవారే కరువయ్యారన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ అందడం లేదన్నారు. యూరియా కొరత తీవ్రంగా ఉందని, కాంప్లెక్సు ఎరువుల ధరలు అమాంతంగా పెరిగాయని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రైతుకు రూ.20వేలు ఆర్థిక సాయం చేస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టినా 14 నెలలు కావస్తున్నా అమలు చేయలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తే రాష్ట్రం వాటిని వేరే కార్యక్రమాలకు మళ్లించారని ఆరోపించారు. వైసీపీ, టీడీపీ దొందూదొందేనని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ తిరుపతి నగర అధ్యక్షుడు చిట్టిబాబు, పీసీసీ కార్యదర్శి వెంకట నరసింహులు, నాయకులు చంద్రశేఖర్, లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుప్పారెడ్డిపాళెంలో తమిళనాడు పోలీసుల విచారణ



దొరవారిసత్రం, జూలై 26(ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఆరంబాకంలో ఐదేళ్ల బాలికపై ఈనెల 12న లైంగిక దాడికి పాల్పడిన అసోం రాష్ట్రానికి చెందిన రాజ్ విశ్వకర్మను శుక్రవారం సూళ్లూరుపేటలో తమిళనాడు పోలీసులు అరెస్టు చేసిన విషయం విదితమే. ఈ కేసు విచారణలో భాగంగా రాజ్ విశ్వకర్మను వెంట బెట్టుకుని ఆరంబాకం పోలీసులు శనివారం దొరవారిసత్రం మండలం కుప్పారెడ్డిపాళానికి వచ్చారు. అక్కడ హైవే పక్కన గల డాబాలో నిందితుడు పనిచేస్తున్నట్లు విచారణలో చెప్పడంతో దాన్ని పరిశీలించి, చుట్టుపక్కల వారిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అతని కుటుంబ వివరాలు కూడా సేకరిస్తున్నారు.

రైలులో నుంచి పడి కానిస్టేబుల్ మృతి



అశోక్ మృతదేహం

వెంకటగిరి, జూలై 26(ఆంధ్రజ్యోతి): రైల్లో నుంచి పడి కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన శనివారం తెల్లవారుజామున వెంకటగిరి - గూడూరు రైలు మార్గంలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. డక్కిలి మండలం సంఘనపల్లి గ్రామానికి చెందిన ఎస్.అశోక్(35) వెంకటగిరి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. శనివారం విధులకు హాజరయ్యే నిమిత్తం గూడూరు నుంచి రైలులో వెంకటగిరికి బయలుదేరాడు. వెంకటగిరి సమీపంలో ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే కీమెన్ గుర్తించి గూడూరు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. మృతదేహాన్ని గూడూరుకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఉవ్వెత్తున ఎగసిన 'గంగ'

- మంగళంలో ఊడిపోయిన తెలుగుగంగ పైపులైన్ ఎయిర్‌వాల్వ్

తిరుపతి అర్బన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరశివారు ప్రాంతం మంగళంలోని తిరుమలనగర్‌కు వెళ్లే మలుపు వద్ద శనివారం మధ్యాహ్నం తెలుగుగంగ పైపులైన్ ఎయిర్‌వాల్వ్ ఊడిపోయింది. నీరు దాదాపు 10 మీటర్ల ఎత్తు ఎగసిపడ్డాయి. మూడుసార్లు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో పంపింగ్‌స్టేషన్ నుంచి ఫిల్టర్‌హౌస్‌కు సరఫరా అవుతున్న రా వాటర్ స్తంభించింది. ఫిల్టర్‌హౌస్ ఎత్తులో ఉండడంతో నీరు ఒక్కసారిగా వెనక్కి తన్నింది. దీంతో కరకంబాడీ ప్రధాన రహదారి పక్కనున్న ఎయిర్ వాల్వ్ ఊడిపోయింది. పైపు నుంచి నీరు ఒక్కసారిగా ఉప్పొంగింది. పది మీటర్ల ఎత్తు వరకు ఎగిసిపడుతూ పక్కనే ఉన్న నివాసం మీదకు పడ్డాయి. కిటికీ నుంచి లోపలికి నీరుచేరడంతో ఇంట్లోని వారు బయటకు పరుగులు తీశారు. ప్రవాహ ఉధృతికి ఇంటిపైనున్న ట్యాంకు పైపులు పగిలిపోయాయి. చెత్తనిల్వ చేసే సిమెంట్ కట్టడం కూలిపోయింది. ఇంతలో పంపింగ్‌స్టేషన్‌లో గేటువాల్వ్ ఓపెన్ చేయడంతో నీటి ఉధృతి తగ్గింది. అప్పటికే లక్షల గ్యాలన్ల నీరు వృథా అయ్యాయి. తెలుగుగంగ ఏఈ పవన్‌కుమార్ రెడ్డి అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విద్యుత్ అంతరాయం మూలాన జరిగినట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు.



ఊడిపోయిన తెలుగంగ పైపు ఎయిర్‌వాల్వ్ - ఉవ్వెత్తున ఎగసిపడుతున్న నీరు

గన్‌మెన్లతో సామాన్లు మోయించడం ఏమిటీ...?

- పెద్దిరెడ్డి తీరుపై హోంమంత్రి అనిత పరోక్ష వ్యాఖ్యలు

తిరుచానూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): 'ఎంతో శిక్షణ పొంది మన రక్షణ కోసం వచ్చిన గన్‌మెన్ల వద్ద సామాన్లు మోయించడం ఏమిటి..? గన్‌మెన్ అంటే మీ ఇంట్లో పనిచేసేవారు కాదుకదా.. ఎవరి పనులు వారు స్వతంత్రంగా చేసుకోనివ్వండి' అంటూ మాజీ మంత్రి పెద్దిరెడ్డిపై హోంమంత్రి అనిత పరోక్షంగా వ్యాఖ్యానించారు. తిరుమల వెంకన్నను, తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని ఆమె శనివారం దర్శించుకున్నారు.తిరుచానూరు ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. వైసీపీ హయాంలో ఉద్యోగులు చాలా ఇబ్బందులు పడ్డారని తెలిపారు. గన్‌మెన్ అనేవారు వ్యక్తిగత భద్రత కోసమేనని, అలాంటి వారిని వ్యక్తిగత పనుల కోసం వాడుకోవడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు.తనకు గొడుగు పట్టుకుని వస్తే కూడా ఒప్పుకోనన్నారు. కూటమి ప్రభుత్వంలో నిజాయితీగా పనిచేసుకోవచ్చన్నారు. లిక్కర్ స్కామ్ విచారణ వేగవంతంగా జరుగుతోందని, దర్యాప్తు పారదర్శకంగా సాగుతోందన్నారు. ఎవరినీ వ్యక్తిగతంగా టార్గెట్ చేయలేదన్నారు.ఎమ్మెల్యేలపై రోజా చేసిన వ్యాఖ్యలపై అనిత స్పందిస్తూ నాయకులు ఆదర్శంగా ఉండాలని, ఫ్రస్ట్రేషన్ తట్టుకోలేక నోటికి వచ్చినట్లు మాట్లాడడం సరికాదని అన్నారు. ఇలాంటి చర్యలను ప్రజలు అస్యహించుకుంటున్నారన్నారు. సభ్యత, సంస్కారం లేనివారి గురించి మాట్లాడడం అంటే సమయం వృథా అన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ కరెక్ట్‌గా ఉందన్నారు. క్రైమ్ రేటు కూడా తగ్గిందన్నారు.పోలీసుశాఖలో డ్రోన్ కెమెరాల వ్యవస్థ రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చిందన్నారు.



తిరుమల ఆలయం వద్ద హోంమంత్రి అనిత

క్యాన్సర్ బాధితులకు తక్కువ ఖర్చుతో వైద్యం

తిరుపతి(వైద్యం), జూలై 26(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ బాధితులకు తక్కువ ఖర్చుతో వైద్యసేవలు అందించేందుకు టాటా క్యాన్సర్ ట్రస్టు అన్ని విధాలా కృషి చేస్తోందని టాటా మెమోరియల్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ఉమేష్ అన్నారు. జూపార్కు రోడ్డులోని టాటా క్యాన్సర్ ఆస్పత్రిలో శనివారం జాతీయ క్యాన్సర్ గ్రిడ్ - ఏపీ స్టేట్ ఛాప్టర్ 3వ వార్షిక సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు దేశవ్యాప్తంగా ఉన్న క్యాన్సర్ ఆస్పత్రులు, పరిశోధన సంస్థలు, సేవా సంస్థలతో కలిసి 2012లో టాటా మెమోరియల్ సెంటర్ ఎన్‌సీజీ(జాతీయ క్యాన్సర్ గ్రిడ్)ను స్థాపించిందన్నారు. క్యాన్సర్‌ను గుర్తించడం, అవసరమైన వైద్యం అందించడం, నివారించడం ఎన్‌సీజీ లక్ష్యమన్నారు. క్యాన్సర్‌ను సమూలంగా నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల గురించి వర్చువల్లో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు వివరించారు. ఈ సదస్సుకు దేశ నలుమూలల నుంచి హాజరైన క్యాన్సర్ వైద్య నిపుణులు వారి అనుభవాలను, అభిప్రాయాలను వివరించారు.

104 వాహనం ఢీకొని రైతు మృతి



సుబ్రహ్మణ్యంరెడ్డి (ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, జూలై 26(ఆంధ్రజ్యోతి): 104 వాహనం ఢీకొని రైతు మృతి చెందిన ఘటన శ్రీకాళహస్తి మండలం ఉడమలపాడు వద్ద శనివారం చోటుచేసుకుంది. ముచ్చివోలు గ్రామానికి చెందిన పి.సుబ్రహ్మణ్యంరెడ్డి(49) ఆదివారం గ్రామంలో షిర్డీ సాయిబాబా ఉత్సవం, ఊరేగింపు ఉండడంతో సరుకుల కోసం ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వచ్చాడు. సరుకులను ఆటోలో వేసి బైక్‌లో తిరిగి వెళుతుండగా ఉడమలపాడు వద్ద ద్విచక్ర వాహనాన్ని 104 ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పాఠశాల విలీనంపై ఆగ్రహం

- టీచర్లను చుట్టుముట్టిన గ్రామస్తులు



కేవీబీపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విలీనాన్ని వ్యతిరేకిస్తూ మండలంలోని అనంతపద్మనాభపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను గ్రామస్తులు చుట్టుముట్టారు. అనంతపద్మనాభపురం విద్యార్థులను విలీనం పేరుతో పక్కనున్న గుంటిపేడు గ్రామానికి వెళ్లాలని విద్యాశాఖ అధికారులు సూచించగా అందుకు గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పాఠశాలకు తాళం వేసి నిరసన తెలుపుతున్నారు. ఉపాధ్యాయులు రోజూ వచ్చి పాఠశాల బయట కూర్చుని వెళ్లిపోతున్నారు. తల్లిదండ్రులకు అర్థమయ్యేలా వివరించాలని ఎంఈవో ఉపాధ్యాయులపై ఒత్తిడి తెచ్చారు. ఈ క్రమంలో శనివారం ఉపాధ్యాయులు పాఠశాల తాళం తీయడంతో ఆగ్రహానికి గురైన గ్రామస్తులు ఇద్దరు ఉపాధ్యాయులను చుట్టుముట్టారు. తమ పిల్లలకు చదువు లేకపోయినా పర్వాలేదు గాని వేరే పాఠశాలకు పంపేది లేదని తెగేసి చెప్పారు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌బాబు అక్కడికి చేరుకుని విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించి, టీచర్లను అక్కడి నుంచి పంపించారు. సోమవారం నుంచి పాఠశాలకు రావద్దని గ్రామస్తులు ఉపాధ్యాయులను హెచ్చరించారు.



తైవాన్ ప్రతినిధులకు శ్రీసిటీ గురించి వివరిస్తున్న శివశంకర్

శ్రీసిటీలో తైవాన్ వ్యాపార ప్రతినిధుల బృందం

సత్యవేడు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాల పరిశీలనలో భాగంగా తైవాన్‌కి చెందిన 14మంది వ్యాపార ప్రతినిధుల బృందం శనివారం శ్రీసిటీని సందర్శించింది. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన బ్రాండెడ్ అథ్లెటిక్, క్యాజువల్ ఫుట్‌వేర్ తయారీదారు పౌచెన్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మార్క్సలిన్ నేతృత్వంలో విచ్చేసిన ఈ బృందానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్, శ్రీసిటీ తరఫున మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.శివశంకర్ సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రత్యేకతలను వివరించారు. తైవాన్‌కు చెందిన రెచి ప్రెసిషన్ సంస్థ శ్రీసిటీలో డైకిన్‌తో కలిసి ప్లాంట్ ఏర్పాటు చేసిన విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లారు. ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు అధికారులు వికాస్ మర్మత్, రంజిత్, గీతాంజలి, ఇన్వెస్ట్ ఇండియా ప్రతినిధి మనీష్‌తివారీతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య ముఖ్య కార్యదర్శి డాక్టర్ యువరాజ్ వర్చువల్‌గా తైవాన్ బృందంతో చర్చించారు.

ఇద్దరు ఎర్రచందనం దొంగల అరెస్టు



పట్టుబడిన ఎర్రచందనం నిందితులు

ఎర్రావారిపాలెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి); ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్న ఇరువురిని అరెస్టు చేసినట్లు భాకరాపేట రేంజ్ ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. తలకోన సెంట్రల్ బీట్ పరిధిలోని దద్దిలం అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దొంగలు ఉన్నట్లు ముందస్తు సమాచారం అందింది. ఈ మేరకు అటవీ శాఖ సిబ్బంది శనివారం కూంబింగ్ నిర్వహించారు. వీరికి 9మంది ఎర్రచందనం దొంగలు తారసపడ్డారు. పట్టుకునేందుకు ప్రయత్నించగా ఇద్దరు దొరికారు. మిగిలిన వారు పరారయ్యారు. పట్టుబడిన వారిని సోమల మండలం అన్నెంగారిపల్లె పంచాయతీ రెడ్డివారిపల్లెకు చెందిన వీరప్ప, శివయ్యలుగా గుర్తించారు. సంఘటన స్థలంలో రెండు ద్విచక్ర వాహనాలతో పాటు 311 కేజీల బరువున్న 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు వెంకటరమణ తెలిపారు. పట్టుబడిన ఎర్రచందనం విలువ రూ.13 లక్షలు ఉంటుందన్నారు. దాడిలో అధికారులు ప్రదీప్, సల్లావుద్దీన్, రాజేష్ కుమార్, డ్రైవర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ప్రయాణంపై 30న ఆర్టీసీ ఉన్నతస్థాయి సమావేశం

తిరుపతి(ఆర్టీసీ),జూలై 26(ఆంధ్రజ్యోతి): ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయనున్న నేపథ్యంలో ఈ నెల 30న తిరుపతిలో ఆర్టీసీ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనుంది. ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు, ఈడీలు, ఇతర ఉన్నతాధికారులు మంగళవారం తిరుపతికి చేరుకోనున్నారు. స్థానిక విద్యాపీఠం కాన్ఫరెన్స్ హాల్లో సమావేశం కానున్నారు. రాయలసీమ ఉమ్మడి జిల్లాలైన చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం సంబంధించిన డీపీటీవోలు, డిప్యూటీ సీటీఎంలు, సీఎంఈలు, పీవో, ఇతర అధికారులు, 54 డిపోల మేనేజర్లు హాజరు కావాలని ఇప్పటికే ఆదేశాలిచ్చారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: కురుగొండ్ల


మల్లమ్మగుడి వీధి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని 12వ వార్డు మల్లమ్మ గుడి వీధిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. వార్డులో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అలాగే సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు చేరువ చేసి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని తెలియ చెప్పేందుకే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరామదాసు గంగాధర్, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, బీరం రాజేశ్వరావు, అవ్వారు సత్యనారాయణ, ఆది, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్


టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులు

నాయుడుపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఏఎల్‌సీఎం క్రీడా ప్రాంగణంలో రాష్ట్రస్థాయి అండర్-15 బాలికల ఫుట్‌బాల్ టోర్నమెంట్ శనివారం నిర్వహించారు. ఏపీ, తిరుపతి, నాయుడుపేట ఫుట్‌బాల్ అసోసియేషన్లు సంయుక్తంగా రాష్ట్రస్థాయి టోర్నమెంట్ నిర్వహించాయి. శ్రీకాకుళం, కడప, అనంతపురం, నెల్లూరు, తిరుపతి, పల్నాడు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల క్రీడాకారులు పోటీపడ్డారు. వీరిలో నెల్లూరు - అనంతపురం, కడప - పల్నాడు జట్లు ఆదివారం జరిగే ఫైనల్స్‌కు ఎంపికయ్యాయి. కోచ్ షేక్ గౌస్‌బాషా, తిరుపతి ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి రెడ్డెప్ప పర్యవేక్షించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కళాచంద్, బిషప్ మైకెల్ బెన్‌హర్, లక్ష్మయ్య, రాకీ, వినోద్, ఎలీషా, ఫుట్‌బాల్ కోచ్‌లు రమేష్, వినోద్, అనిల్‌కుమార్, శ్రీనివాసరావు, ప్రసన్నకుమార్, సిరాజ్, ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో మడ అడవులు కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శంకర్ శర్మ

సూళ్లూరుపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో మడ అడవుల పాత్ర కీలకమని స్థానిక వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ శర్మ అన్నారు. శనివారం కళాశాలలో అంతర్జాతీయ మడ అడవుల సంరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో మడ అడవుల ఎంతో కీలకమని, తుఫాన్లు, సునామీల వంటి విపత్తుల నుంచి కాపాడుతాయన్నారు. అంతే కాకుండా విభిన్నమైన జీవరాశులకు మడ అడవులు ఆవాసాలని చెప్పారు. చెట్లను నరికివేయడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతిని జీవుల మనుగడకే ప్రమాదమని, ప్రతి ఒక్కరూ అడవులను రక్షించేందుకు చొరవ తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు మడ అడవులపై వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. అంతకుముందు కళాశాల నుంచి షార్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విక్టోరియారాణి, అధ్యాపకులు శ్రీనివాస్, రాజా తదితరులు పాల్గొన్నారు.

మడ అడవులను పరిరక్షించాలి

వాకాడు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మడ అడవుల సంరక్షించాల్సిన అవసరం ఉందని గూడూరు ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని వాలమేడు ప్రభుత్వ పాఠశాలలో శనివారం ప్రపంచ మడ అడవుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మడ అడవులు ఎంతో దోహదపడుతాయన్నారు. మడ అడవులను నరకవద్దని, వాటిని సంరక్షించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వాలమేడు సెక్షన్ ఫారెస్టు ఆఫీసరు ధనలక్ష్మి, కడివేడు ఫారెస్టు బీట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, రవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు విడుదల చేయండి



ర్యాలీ చేస్తున్న చేస్తున్న విద్యార్థులు, పీడీఎస్‌వో నాయకులు

వెంకటగిరి టౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌వో జిల్లా కార్యదర్శి ఆర్.ఆష డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని వైష్ణవి, ఈఎస్ఎస్, విశ్వోదయ డిగ్రీ కళాశాలల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. క్రాస్ రోడ్డు వద్ద మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంటు నిధులు విడుదల చేయక పోవడంతో యాజమాన్యాలు కళాశాలను నిర్వహించే పరిస్థితిలో లేవన్నారు. ఇప్పటీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం రూ.6400 కోట్లు బకాయిలు ఉన్నాయని చెప్పారు. అలాగే పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్ ఛార్జీలు, స్కాలర్‌షిప్‌లు పెంచాలని కోరారు. కార్యక్రమంలో పవన్, స్రవంతి, లీలా మోహన్, తిరుమలేష్, శ్రీను, తేజ, నవీన్, పెంచలయ్య, అరుణాచలం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం అందించండి

గూడూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సాగరమాల రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి పరిహారం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. శనివారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద కోట మండలం కొత్తపాళెం గ్రామానికి చెందిన రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగరమాల రోడ్డు నిర్మాణానికి భూములు తీసుకుని ఎటువంటి పరిహారం ఇవ్వలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు పరిహారం ఇవ్వాలని కోరారు.


సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద రైతుల నిరసన

ఆదర్శనీయుడు అబ్దుల్‌కలాం


మొక్కలు నాటుతున్న జడ్జి వెంకట నాగపవన్

గూడూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం ఆదర్శనీయుడని ఏడవ అదనపు జిల్లా జడ్జి వెంకట నాగపవన్ అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో అబ్దుల్‌కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అబ్దుల్‌కలాం వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ అబ్దుల్‌కలాం దేశానికి ఎనలేని కృషి చేశారన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తి సులోచనారాణి, ట్రస్ట్ అధ్యక్షుడు తాజుద్దీన్, న్యాయవాది పార్వతయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

నాయుడుపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి ప్రాంతాల్లో విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాలు ఆదివారం కూడా పనిచేస్తామని, వినియోగదారులు బిల్లులు చెల్లించవచ్చని ట్రాన్స్‌కో ఈఈ శ్రీనివాసులు తెలిపారు.

రెండు వంతెనలు, హైవే దాటి..

పిల్లలను బడికి పంపలేం

- పాఠశాల విలీనంపై తల్లిదండ్రుల నిరసన
- డిగ్రీ యువతి చేత చదువు చెప్పిస్తున్న వైనం


పాఠశాల ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రుల నిరసన


సుభాషిణి వద్ద చదువుకుంటున్న విద్యార్థులు


లింగంపాడు పాఠశాలకు వెళ్లే దారిలో రైల్వే వంతెన కింద వర్షపు నీరు

దొరవారిసత్రం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండ లం అయ్యపాళెం పాఠశాలలోని 3, 4, 5 తరగతులను ఆ గ్రామా నికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న తల్లంపాడు పంచాయతీ లింగంపాడు పాఠశాలలో విలీనం చేశారు. దీంతో అయ్యపాళెం పాఠశాలకు చెందిన 16 మంది విద్యార్థులు లింగంపాడుకు వెళ్లాల్సి వచ్చింది. అయితే ఇందుకోసం రెండు కిలోమీటర్ల నడక దారిలో పోలిరెడ్డిపాళెం రైల్వేస్టేషన్ వద్ద ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిని దాటుకోని వెళ్లాలి. ఈ వంతెన వద్ద వర్షం కురిస్తే పెద్దవాళ్లు కూడా మునిగిపోయే లోతు నీరు చేరుతుంది. రెండు రోజులుగా కురుస్తున్న తేలికపాటి వర్షాలకే వంతెన కింద నీరు చేరింది. దీంతో విద్యార్థులు వెళ్లలేని పరిస్థితి. అలాగే అయ్యపాళెం మార్గంలో జాతీయ రహదారికి సమీపంలో నెర్రికాలువపై మరో వంతెన ఉంది. పిట్టగోడలు కూడా లేని ఈ వంతెనపై చిన్నపిల్లలు నడిచి వెళ్లడం ప్రమాదకరం. అంతేకాకుండా టపాయిండ్లు వద్ద జాతీయ రహదారిని దాటి వెళ్లాలి. రహదారిని దాటే సమయంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా పిల్లలు ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. లింగంపాడు పాఠశాలకు వెళ్లడం సాహసంతో కూడిన పని కావడంతో నాలుగు రోజుల నుంచి విద్యార్థులను తల్లిదండ్రులు స్కూలు మానిపించేశారు. తమ గ్రామంలో పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్నారు. డిగ్రీ వరకు చదువుకున్న గ్రామానికి చెందిన యువతి సుభాషిణి చేత బడి బయటే విద్యార్థు లకు చదువు చెప్పిస్తున్నారు. తమ ఊరి బడిలోనే 3, 4, 5 తరగతులను కొన సాగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం: పాశిం


ముట్టెంబాకలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

వాకాడు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం ముట్టెంబాక, కల్లూరు, కొత్తపాళెం, సిద్ధిగుంటపాళెం గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేస్తూ ఏడాది పాలనలో ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని పరిష్కరించాలనే అధికారులకు సూచించారు. అనంతరం ముట్టెంబాక అంగన్‌వాడీ టీచర్ సలోమి, కల్లూరు కొత్తపాళెం అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన సామూహిక సీమంతం కార్యక్రమంలో పాల్గొన్నారు. గర్భిణులకు చీర, జాకెట్, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదనరెడ్డి, నాయకులు ఉచ్చూరు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, దువ్వూరు జనార్దనరెడ్డి, కల్లూరు హరీష్ నాయుడు, సన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, నందగోపాల్‌రెడ్డి, దోశకాయల కృష్ణమూర్తి, కుంచం దయాకర్, పసుపులేటి రాజయ్య, నెల్లూరు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే సీఎం చంద్రబాబు ధ్యేయం: విజయశ్రీ


అక్కరపాకలో ఇళ్ల నివేశ గృహాల మంజూరు విషయమై స్థానికులు, హౌసింగ్ ఏఈతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

దొరవారిసత్రం, జూలై 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలో అక్కరపాక, పోలిరెడ్డిపాళెం, పూలతోట, ఆనేపూడి, సింగనాలత్తూరు పంచాయతీల్లో పర్యటించారు. ఏడాది పాలనలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారంతో కూడిన కరపత్రాలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా జరిగిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలంటినీ తప్పకుండా అమలు చేస్తామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, సూళ్లూరుపేట ఏఎంసీ ఛైర్మన్ రమేష్, తహసీల్దారు శైలాకుమారి, ఎంపీడీవో గోవర్ధన్, ఎస్ఐ అజయ్‌కుమార్, టీడీపీ నాయకులు శ్రీనివాసులు నాయుడు, పామంజి శ్రీనివాసులు, మురళిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు


విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న రోటరీవెస్ట్‌క్లబ్ సభ్యులు

గూడూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రోటరీ వెస్ట్‌క్లబ్ అధ్యక్షుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాలలో రోటరీవెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో శ్రీకంటి రామమోహన్‌రావు దాతృత్వంతో విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే చదువులపై శ్రద్ధ చూపాలన్నారు. క్రమశిక్షణతో మెలుగుతూ ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, శ్రీకంటి రామమోహన్ రావు, రాఘవరెడ్డి, బిల్లు చెంచురామయ్య, తాళ్లూరు శ్రీనివాసులు, ధనుంజయరెడ్డి, శ్రీనివాసులు నాయుడు, హరినాథ్‌రెడ్డి, చెంచు కృష్ణయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుగంగ ఏఈ మృతి


రాజశేఖర్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, కృష్ణయ్య

కోట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని రవినగర్‌లో నివాసం ఉంటున్న తెలుగుగంగ అసిస్టెంట్ ఇంజనీర్ పనబాక రాజశేఖర్(54) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఎమ్మెల్యే సునీల్‌కుమార్, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, పనబాక కృష్ణయ్య తదితరులు రాజశేఖర్ మృతదేహానికి నివాళులర్పించారు.

పీ-4 కుటుంబాలపై సమీక్ష

కోట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పీ-4 కార్యక్రమంలో భాగంగా పలుశాఖల అధికారులతో సమీక్ష జరిగింది. ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ దారిద్రరేఖకు దిగువన ఉన్న కుటుంబాలను గుర్తించి బంగారు కుటుంబాలుగా దత్తత తీసుకునే విషయంపై చర్చించారు. సమావేశంలో డాక్టర్ నాగరాజు, ఆర్ఐ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో విజయ్ దివస్

కోట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం విజయ్ దివస్ నిర్వహించారు. ఎన్‌సీసీ ఆధ్వర్యంలో కార్గిల్ యుద్ధంలో ప్రాణాలర్పించిన సైనికులకు నివాళులర్పించారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ కుమార్‌రెడ్డి, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ మాధవయ్య, పీడీ మల్లికార్జునరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకే పీ4

బాలాయపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన కోసమే పీ4 కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఎంపీడీవో వినీల్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయం సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వివిధశాఖల అధికారులతో పీ4 కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 1642 బంగారు కుటుంబాలను గుర్తించామని, ఆయా కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ముందుకొచ్చే వారిని ప్రోత్సహించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణ గురించి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షులు రాయి మస్తాన్ నాయుడు, రాయి సత్యం నాయుడు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో తనిఖీలు


పీహెచ్‌సీలో వైద్యాధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో హరిత

బాలాయపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో హరిత శనివారం తనిఖీ చేశారు. కాన్పులు, రక్త పరీక్షలు, ఓపీ గదులను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. రోగులకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యాధికారులు వెంకటరెడ్డి, లియోనాలకు పలు సూచనలు చేశారు. కాన్పుల గది ఉరుస్తోందని, టాయిలెట్లు లేవని, ఆస్పత్రి తలుపులు శిథిలావస్థకు చేరుకున్నాయని సిబ్బంది చెప్పడంతో మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

దేశాభివృద్ధికి కృషి చేయాలి

గూడూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మనోజ్‌కుమార్ అన్నారు. శనివారం కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా బీజేవైఎం ఆధ్వర్యంలో సాయి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్గిల్ యుద్ధంలో మరణించిన సైనికులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో శివశంకర్, కిరణ్, మహేష్, ప్రదీప్, రాజు, ప్రణయ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతిసేవా సంస్థ కార్యాలయంలో శనివారం పొనకా మల్లికార్జున్‌రెడ్డి దాతృత్వంతో పేదలకు నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, సురేష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నాగరాజు, మల్లికార్జున, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీసేవ జరిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు


మార్కెట్‌సెంటర్‌లో ట్రాఫిక్ క్లియర్ చేస్తున్న సీఐ మురళీకృష్ణ, పోలీసులు

సూళ్లూరుపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని సీఐ మురళీకృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని బజారు వీధులు, జీఎన్‌టీ రోడ్డులో ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా అడ్డదిడ్డంగా నిలిపిన వాహనదారులకు, జీఎన్‌టీ రోడ్డు వెళ్లే వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మరోసారి ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బజారు వీధులు, ప్రధాన కూడలి ప్రాంతాల్లో దుకాణదారులు హద్దులు దాటి ముందుకు రాకూదన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట, తడ, శ్రీహరికోట ఎస్‌ఐలు బ్రహ్మనాయుడు, కొండపనాయడు, స్వప్న, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కిరణ్మయి

సూళ్లూరుపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పకుండా పాటించాలని ఆర్డీవో కిరణ్మయి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డివిజన్ పరిధిలో ఉన్న పరిశ్రమల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంపెనీల్లో పనిచేసే సిబ్బంది ఎటువంటి ప్రమాదాలకు గురికాకుండా రక్షణ కల్పించాల్సిన బాధ్యత కూడా పరిశ్రమలదేనని స్పష్టం చేశారు. పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే వారు కేటగిరి ప్రకారం ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారు.. ఏ వస్తువులు తయారు చేస్తున్నారు.. ఎలాంటి భద్రత చర్యలు తీసుకుంటున్నారో పూర్తి వివరాలు నోటీసు బోర్డులో వెల్లడించాలని, నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ చెంచుబాబు, పరిశ్రమల భద్రతా విభాగాధికారి శివశంకర్ రెడ్డి, తహసీల్దార్ గోపినాథరెడ్డి, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలపై అభిప్రాయ సేకరణ

సూళ్లూరుపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆర్డీవో కిరణ్మయి ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల సమస్యలపై నాయకుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల భవనాల స్థితి, సమస్యాత్మకంగా ఉన్న వాటి వివరాలడిగి తెలుసుకున్నారు. అధికంగా ఓటర్లు ఉండే ప్రాంతంలో మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఓటర్లు, చేర్పులు మార్పుల వివరాలు బూత్ స్థాయి అధికారులు నాయకులకు అందజేయాలన్నారు. సమావేశంలో సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం, నాయుడుపేట తహసీల్దార్లు రవీంద్ర నాథ్ రెడ్డి, శరత్‌బాబు, శైలాకుమారి, రాజేంద్ర పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

నాయుడుపేట టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండల సర్వసభ్య సమావేశం ఈనెల 27వ తేదీ ఆదివారం ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సురేష్‌బాబు చెప్పారు. అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.